09-10Pg1exHMNWJQE MN 1 GNT_09-10Pg1exHMNWJQE.qxd 10/8/2025 11:51 PM Page 1

సాహితి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 248 పేజీలు: 12 వెల: 6.50

**బీహార్ కూటముల్లో సీట్ల తకరారు!**

**మద్రాసు హైకోర్టు తీర్పుపై సుప్రీంలో విజయ్ సవాల్**

9లో

# రాష్ట్రానికి భారీ ఎఫ్‌డిఐ


ప్రమాదం వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న హోంమంత్రి అనిత

## భగ్గుమన్న పటాసుల తయారీ కేంద్రం

### ఏడుగురు దుర్మరణం, వారిలో ఆరుగురు మంటల్లో బుగ్గి

### కోనసీమ జిల్లా రాయవరంలో దుర్ఘటన

### మృతుల కుటుంబాలను ఓదార్చిన హోంమంత్రి అనిత

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో అక్టోబర్ 8 (ప్రభాతవార్త):** బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం జరిగి ఏడుగురు మృతి చెందగా వీరిలో ఆరుగురు సజీవదహనమైన విషాద సంఘటన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి.సావరంలో శ్రీ గణపతి ఫైర్ వర్క్స్ కేంద్రంలో జరిగింది. ఈ సంఘటన తెలిసిన వెంటనే హుటా >>2

**సిఎం చంద్రబాబు ఆవేదన** 2లో


బుధవారం ఎస్ఐపిబి సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

## రూ. 87, 520 కోట్లతో విశాఖలో 'రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్' ఏర్పాటు

### రూ. 1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపిబి ఆమోదం

### 26 ప్రాజెక్టులద్వారా 67 వేలమందికి పైగా ఉద్యోగావకాశాలు

### మెగా ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

**విజయవాడ,అక్టోబరు 08, ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని (ఎఫ్‌డిఐ) ఆకర్షించిందన్నారు. అమెరికావెలుపల అతిపెద్ద డేటాసెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుందన్నారు. రూ.87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లి వద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దాదాపు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపిబి సమావేశం.. ఇంధన రంగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఏరో స్పేస్, ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగాలతో పాటు పర్యాటకానికి ఊతం ఇచ్చేలా ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలియచేసింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఎపికి సాధించటంపై ఐటి మంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు అభినందనలు తెలియచేశారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే డేటా సెంటర్లు ఎపికి టెక్నాలజీ గేమ్ చేంజర్‌గా మారతాయనిఅన్నారు. కేవలం 15 నెలలకాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సిఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డేటా సెంటర్లతో ఓ ఎకో సిస్టం వస్తోందని.. విశాఖ నగరం తదుపరి స్థాయి ఎఐ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ తక్కువ ధరకు అందిస్తే ఐటీరంగానికి మేలు జరుగుతుందని సిఎం వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ జరిగిన 11 ఎస్ఐపిబిల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 6.20 లక్షల మందికి నేరుగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న ఈ డేటా సెంటర్లు టెక్నాలజీ రంగంలో కీలక మలుపు అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. విశాఖ పారిశ్రామిక అభివృద్ధికోసం ఏర్పాటు చేసిన ఎకనమిక్ కారిడార్ తరహాలోనే రాయల >>2



## పసిడి మరింత పైపైకి

### ఆల్‌టైమ్ గరిష్టానికి బంగారం, వెండి ధరలు

### అప్పుడు తులం రూ. 99, ఇప్పుడు రూ. 1.25 లక్షలు పైనే

**ముంబయి, అక్టోబరు 8:** బంగారం ధరలు చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డు సృష్టించాయి. బుధవారం అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధర తొలిసారిగా ఔన్సుకు 4,000 డాలర్ల మార్కును దాటింది. ఈ ప్రభావంతో భారత మార్కెట్లోనూ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, రాజకీయ ఉద్రిక్తతలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్, ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం, జపాన్, అర్జెంటీనాలలో ఆర్థిక ఆందోళనలు, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం తీవ్రతరం కావడం వంటి కారణాలతో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దీనికితోడు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే అంచనాలు కూడా పసిడికి మరింత డిమాండ్ పెంచుతున్నాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,000 దాటి ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరింది. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,002.53 డాలర్ల వద్ద ఆల్ టైమ్ రికార్డును నమోదుచేసింది. అదే సమయంలో యూఎస్‌కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.5శాతం పెరిగి ఔన్సుకు 4,025 డాలర్ల వద్దట్రేడ్‌అయింది. ఇక దేశీయమార్కెట్ విషయానికొస్తే, ఎంసిఎక్స్‌లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర బుధవారం ఉదయం ట్రేడింగ్‌లో ఏకంగా రూ.1,22,101కి చేరింది. ప్రస్తుతం 0.69 శాతం పెరుగుదలతో రూ.1,21,949 వద్ద కొనసాగుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. సిల్వర్ ఫ్యూచర్స్ 0.73 శాతం పెరిగి కెజి ధర రూ.1,46,855 పలికింది. ఈ ఏడాది ఇప్పటికే దేశీయంగా బంగారం >>2



## బాణాసంచా ప్రమాదంపై డి.సిఎం పవన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,అక్టోబరు 8, ప్రభాతవార్తప్రతినిధి:** బాణాసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం తీవ్ర ఆవేదన కలిగించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యారించారు. డిసిఎంవో కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో చోటు అగ్ని ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం పాలయ్యారని తెలిసి తీవ్రమైన బాధ కలిగిందని పవన్ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. ఈ ప్రమాదంపై జిల్లా అధికార యంత్రాంగం నుంచి వివరాలు అందాయి. ఈ దురదృష్టకర ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశాను. దీపావళి సమయంలో బాణాసంచా తయారీ కేంద్రాల్లో, సంబంధిత గోదాముల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసాగా ఉంటుంది అన్నారు.

## అనంతపురం మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి నాగమణి సస్పెన్షన్

### శిశు గృహంలో నెలల పసికందు మరణం కేసులో తొలి వేటు

**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి:** అనంతపురం శిశుగృహలో రెండు నెలల పసికందు మాస్టర్ నిరూప్ మృతిపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. శిశుగృహను పర్యవేక్షించడంలో లోపం, బాలుడు మరణించినా ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు సకాలంలో తెలియచేయడంలో జాప్యం కారణంగా ఆ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) పిడి నాగమణిని సస్పెండ్ చేసింది. ఈమేరకు మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఘటనకుకారణాలపై పూర్తి సమాచారం సేకరించి దానికనుగుణంగా ఇతర బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

# రూ. 212 కోట్లతో రాజ్‌భవన్

### నిర్మాణానికి సిఆర్‌డిఎ ఆమోదం: సిఎం చంద్రబాబు

### భూములిచ్చిన ఊళ్లోనే రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలి

### అమరావతితోపాటు స్థానిక రైతులూ అభివృద్ధి చెందాలి: సిఎం

**విజయవాడ అక్టోబర్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి అభివృద్ధితో పాటు... రాజధానికి భూములిచ్చిన రైతులు కూడా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను తక్షణం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 53వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. మొత్తంగా 18 అంశాలపై అథార్టీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణ పనులు రీస్టార్ట్ చేశాం. రాజధాని కోసం భూములను త్యాగం చేసిన రైతులకే మొదటగా రాజధాని అభివృద్ధి ఫలాలు అందాలి. రాజధాని రైతులకు కౌలు చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకూడదు. భూములిచ్చిన రైతులకు ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని చెప్పామో... అక్కడే ఇవ్వాలి. ఏ ఊళ్లో భూములిచ్చిన వారికి ఆ ఊళ్లోనే ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చాం.. అలాగే ఎలాట్మెంట్ చేయాలి. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెరగాలి. సెక్రటేరియేట్ టవర్లతో సహా ఇతర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. వెస్ట్ బైపాస్ రోడ్డును వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ఏమైనా సాంకేతిక ఇబ్బందులుంటే.. వాటిని వెంటనే పరిష్కరించుకుని ఖాజా టోల్ గేట్ దగ్గర జాతీయ రహదారిని చేరేలా ఉన్న రోడ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. కరకట్ట రోడ్డును విస్తరించాలి. మూడు నెలల్లో రాజధాని నగరాన్ని ఓ రూపునకు తీసుకురావాలి." అని సిఎం చెప్పారు.

**రాజ్ భవన్ సహా వివిధ నిర్మాణలకు ఆమోదం..** అమరావతిలో గవర్నర్ నివాసం రాజ్ భవన్ నిర్మాణానికి సిఆర్‌డిఎ అథార్టీ ఆమోదించింది. రూ. 212 కోట్ల వ్యయంతో రాజ్ భవన్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. కృష్ణా నదీ ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్ భవన్ నిర్మాణం జరగనుంది. రాజ్ భవన్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ అద్భుతంగా ఉండాలని సిఎం సూచించారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25 శాతం నిధులను సిఆర్‌డిఎ ఇచ్చేందుకు అథార్టీ



ఆమోదం తెలిపింది. రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథార్టీ అంగీకరించింది. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టిఫైడ్ భవనాలు ఉండేలా అవసరమైన మార్పులు చేర్పులు అథార్టీ ఆమోదించింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా సిఆర్‌డిఎ వ్యవహరించేలా >>2

## క్వారీలో పిడుగు పడి ముగ్గురు మృతి

### శ్రీకాకుళం జిల్లాలో ఘటన

**శ్రీకాకుళం, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి మండలంలో దుర్ఘటన జరిగింది. మండలంలోని జంగాలపాడులోని క్వారీలో పిడుగు పడి ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను వెంటనే వేర్వేరు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**క్షతగాత్రులను పరామర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ:** పిడుగుపాటుకు గురైన బాధితులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డితో కలిసి బుధవారం పరామర్శించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులనుకలిసి సంఘటనగురించి అడిగి తెలుసుకున్నారు. కూలి పనులు చేస్తూ పిడుగుపాటుకు గురై షాక్ నుండి బయటపడిన తీరును జిల్లా కలెక్టర్‌కు బాధితులు వివరించారు. చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడిగి ఆరా తీశారు. మెరుగైన >>2

## విద్యా వ్యవస్థను నం.1 చేయడమే లక్ష్యం

### ఉపాధ్యాయుల సహకారం కూడా కావాలి: మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చించుకుని మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు అంతర్ జిల్లా బదిలీల ఉపాధ్యాయులు, భాషా పండితులతో మంత్రి సమావేశమయ్యారు. టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను (మ్యూచువల్, స్పౌజ్) విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న భాషా పండితుల సమస్యను పరిష్కరించడం పట్ల మంత్రి నారా లోకేష్‌ను ప్రత్యేకంగా కలిసి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తిచేశాం. వచ్చే నాలుగేళ్ల పాటు ఫలితాలపైనే దృష్టిసారిస్తాం. గత ప్రభుత్వం మాదిరిగా విద్యార్థులను డ్రాప్ బాక్స్‌లోపెట్టి దొంగ లెక్కలు చూపబోం. పారదర్శకంగా వ్యవహరిస్తాం. విద్యాశాఖను ఛాలెంజింగ్‌గా తీసుకున్నాం. ఎపిలో



విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం. ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించాలి. అభ్యసన ఫలితాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారు. దీనిని అధిగమించేందుకు కృషిచేస్తున్నాం. 150రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశాం. ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాం.

**విద్యార్థులకు బాగా చదువు చెబితే అదే పెద్ద గిఫ్ట్**

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు భాషా పండితులకు పదోన్నతులుకల్పించిన మంత్రి నారా >>2


సుసుము కిటగావా


రిచర్డ్ రాబ్సన్


ఒమర్ ఎం.యాఘి

## రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

### ఎడారి గాలి నుంచి నీటి సేకరణ టెక్నాలజీ ఆవిష్కరణ, మెటల్ ఆర్గానిక్స్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధికి గుర్తింపు

### మానవాళి సవాళ్లకు పరిష్కారం చూపే పరిశోధకులుగా ప్రశంసలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** కొత్త తరహా మాలిక్యులర్ ఆర్కిటెక్చర్‌ను అభివృద్ధి చేసినందుకు శాస్త్రవేత్తలు సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం.యాఘిలకు రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. లోహ–సేంద్రీయ చట్రాల అభివృద్ధి ద్వారా, మానవ సమాజం ఎదుర్కొంటున్న కొన్ని సవాళ్లను పరిష్కరించడానికి కొత్త అవకాశాలను అందించారు అని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. ఈ ముగ్గురూ ఎడారి గాలి నుండి నీటిని సేకరించడానికి, కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించడానికి ఉపయోగపడే పరమాణు నిర్మాణాలను సృష్టించారని అకాడమీ తెలిపింది. >>2

## అమరావతి నిర్మాణానికి మరో సంస్థ

### గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సహా పలు ప్రాజెక్టులు

**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణం కోసం మరో సంస్థను ఏర్పాటు చేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు పలు ప్రాజెక్టులను ఈసంస్థ చేపట్టనుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, ఆర్థిక అంశాలు, అప్పులు, చెల్లింపులతోపాటు ఇతర అంశాలన్నిటనీ ఇది పర్యవేక్షించనుంది. కంపెనీ చట్టంకింద ఏర్పాటు చేసే ఈ సంస్థకు పదిలక్షల షేర్లను ఒక్కోటి రూ.10 చొప్పున కేటాయించారు. బోర్డు డైరెక్టర్ల నిర్ణయం మేరకు ఈ ధర పెరుగుదల ఉండదనుంది. ఇప్పటికే రాజధాని కోసం ఏర్పాటుచేసిన ఎపి సిఆర్‌డిఏతోపాటు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కూడా ఉంది. ఇవికాకుండా వేర్వేరు పేర్లతో సుమారు 14 కంపెనీలు రిజిస్టరయి ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే సంస్థ ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుతో పాటు ఎన్‌టిఆర్ విగ్రహం, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ వంతెన, స్పోర్ట్స్ సిటీ, రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, రోప్‌వే, ఇన్నర్ రింగురోడ్డు, కొత్తగా గుర్తించే ఇతర ప్రాజెక్టులను దీని ద్వారా చేపట్టనున్నారు.

దీనిలో పట్టణాభివృద్ధిశాఖ, ఆర్థికశాఖ, విద్యుత్, ఆర్అండ్‌బి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శులతోపాటు ఎపి సిఆర్‌డిఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉంటారు. అనంతరం ముగ్గురు ఇండిపెండెంట్ డైరెక్టర్లను ఎన్నుకునేందుకు అవకాశం కల్పించారు. కొత్తగా ఏర్పాటు చేసే సంస్థకు అవసరమైన నిధులు సమకూర్చడంతోపాటు భూములు తనఖా పెట్టుకునే హక్కును కూడా ఇచ్చారు. అలాగే యూజర్ ఛార్జీలు వసూలుకూ అవకాశం కల్పించారు. >>2

09-10pg2exHMNWJQE MN 2_09-10pg2exHMNWJQE.qxd 10/8/2025 11:54 PM Page 1





బుధవారం న్యూఢిల్లీలోని యశోభూమిలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోడీ

# నం.1 చేయడమే లక్ష్యం

>> లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపేలా రాష్ట్రవ్యాప్తంగా 'థాంక్యూ లోకేష్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు మంత్రి స్పందిస్తూ.. అలాంటి కార్యక్రమాలేవీ వద్దని, విద్యార్థులకు చదువు బాగా చెబితే అదే పెద్ద గిఫ్ట్ అని వారితో చెప్పారు. ఏలూరు జిల్లాలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు బి.లక్ష్మీ ప్రసన్న, నా భర్త కడపలో పనిచేస్తున్నారు. ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయినా వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ.. గత ఐదేళ్లుగా మేం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. బదిలీ కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా సక్సెస్ కాలేకపోయాం. ఇక బదిలీ కాదు అనే స్థిర నిర్ణయానికి వచ్చాం. ఈ సమయంలో భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిగారిని కలిసి మా సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లాం. ధైర్యంగా ఉండాలని, విద్యాశాఖ మంత్రి కచ్చితంగా అంతర్ జిల్లా బదిలీలు చేస్తారని చెప్పారు. అనుకున్నట్లుగానే అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చారు. అంతర్ జిల్లాల బదిలీలు అంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. ఎన్నో ఏళ్లు పడుతుంది. ఎప్పటికో అవుతుందిలే అని భావించాం. నిర్దిష్ట సమయంలోనే నోటిఫికేషన్ రావడం, జీవో రావడం జరిగిపోయింది. మేం స్కూల్‌లో కూడా జాయిన్ అయ్యాం. ఇవాళ చాలా సంతోషంగాఉంది. మీకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి వచ్చాం. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఏ.కొండయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరాజు, జనరల్ సెక్రటరీ బి.హైమారావు, ఫైనాన్షియల్ సెక్రటరీ జే.శ్రీనివాస్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షులు సంపత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా పేలుడు ఘటనపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** కోనసీమలో బాణసంచా పేలుడు ఘటనలో పలువురి మృతిపై వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనలో పలువురు మరణించడం అత్యంత విషాదకరమని అన్నారు. రాయవరంలో జరిగిన ఈ ఘటన అత్యంత దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. మరణించినవారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## మమ్ముట్టి, దుల్కర్‌ల ఇళ్లల్లో ఇడి సోదాలు!

**తిరువనంతపురం, అక్టోబరు 8:** భూటాన్ లగ్జరీకార్ల స్మగ్లింగ్ కుంభకోణం కేసు మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ప్రముఖ నటులు మమ్ముట్టి, ఆయన కుమారుడు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చక్కలక్కల్ నివాసాలతో పాటు మొత్తం 17 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) ఉల్లంఘనల ఆరోపణలపై ఈడీ ఈ చర్యలు చేపట్టింది. భూటాన్, నేపాల్ మార్గాల ద్వారా టయోటా ల్యాండ్ క్రూయిజర్, ల్యాండ్‌రోవర్ డిఫెండర్ వంటి ఖరీదైన వాహనాలను అక్రమంగా దిగుమతి చేస్తున్న ఓ ముఠాపై తమకు కచ్చితమైన సమాచారం అందిందని ఈడీ అధికారులు తెలిపారు. ఈ ముఠా భారత సైన్యం, అమెరికా రాయబార కార్యాలయం, విదేశాంగ మంత్రిత్వ శాఖ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అక్రమంగా వాహన రిజిస్ట్రేషన్లు పొందినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత ఈ కార్లను సినీ ప్రముఖులతో సహా పలువురికి తక్కువ ధరకు విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. 'ఆపరేషన్ నుమ్‌ఖోర్' కింద కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న తన కారును విడుదల చేయాలని కోరుతూ దుల్కర్ సల్మాన్ కేరళ హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి పొందిన మరుసటి రోజే ఈడీ దాడులు జరగడం గమనార్హం. దుల్కర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, ఆ కారును 2004లో రెడ్ క్రాస్ కోసం చట్టబద్ధంగా దిగుమతి చేశారని, ఆ తర్వాత తాము కొనుగోలు చేశామని కోర్టుకు తెలిపారు. అయితే, కేసు విచారణ కొనసాగుతున్నందున కారును సీజ్ చేసే హక్కు తమకుందని కస్టమ్స్ అధికారులు వాదించారు.

# తయారీ కేంద్రం

>> హాటిన రాష్ట్ర హోంశాఖామంత్రి వంగలపూడి అనిత సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోనసీమ జిల్లా బాణసంచా తయారీ కేంద్రానికి వచ్చే ఏడాది వరకు అనుమతి ఉందని ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుదాఘాతం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు చెప్పడం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు అన్ని రకాలుగా అండగాఉంటామన్నారు. మృతుల కుటుంబా లకు త్వరలో పరిహారం ప్రకటిస్తామన్నారు. బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు ముందస్తు జాగ్రత్త నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. బాణ సంచా తయారుచేసే కార్మికులకు బీమా కల్పించేలా చూస్తామన్నారు. బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు తనిఖీ చేయాలని అధికారు లను ఆదేశించడం జరిగిందన్నారు. ఇటువంటి పునః దురదృష్టవశాత్తు ఇటువంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఆమె తొలుతగా కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి సావరం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ తయారీ కేంద్రం పరిశీలించిన అనిత సహాయ చర్యలు, ఇతర వివరాలు తెలుసుకున్నారు. లింగం చిన్న బాబు, వాసంశెట్టి విజయలక్ష్మి, చిట్టూరి యామిని అనే క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు మెరుగైన వైద్య సేవల నిమిత్తం తరలించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించడం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు మంత్రి సానుభూతిని తెలిపారు. విద్యుత్ ఘాతంతో జరిగిన ఈ దురదృష్టకర సంఘటనలో ఆరుగురు కార్మికులు సజీవ దహనం కావడం బాధాకర మన్నారు. గాయ పడిన వారు త్వరగా కోలుకోవాలని ఆమె భగవంతుని ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహు ల్ మీనా, ఆర్డీవో దేవరకొండ అఖిల, జిల్లా అగ్నిమాపక విపత్తుల స్పందన శాఖ అధికారి సారథి, డీఎస్పీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం చంద్రబాబు ఆవేదన

**విజయవాడ,అక్టోబర్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన కలచి వేసిందని సిఎం చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా సీఎం స్పందిస్తూ.. ఈ ఘోర ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ప్రమాద కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, వైద్య సాయంపై అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఉన్నతాధికారులను ఆదేశించామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయం అందించాలకు సూచించామని.. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇస్తూ సిఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. కోనసీమ జిల్లా రాయవరం విషాద ఘటనపై సిఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర మంత్రులు స్పందిస్తూ.. విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కోనసీమ జిల్లాలో అగ్నిప్రమాదంపై హోం మంత్రి అనిత స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాద ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన గురించి జిల్లా అధికారులతో మాట్లాడారు మంత్రి. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతులు, గాయపడిన వారిపై అధికారులు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రమాదానికి గురైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

**మృతుల కుటుంబాలకు మంత్రి సుభాష్ సంతాపం**

కోనసీమ అగ్నిప్రమాదంపై మంత్రి వాసం శెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాయవరంలోని బాణసంచా ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులతో మంత్రి ఫోన్లో మాట్లాడి సహాయ చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రమాద కారణాలపై పూర్తి స్థాయి వివరాలు ఇవ్వాలని మంత్రి సుభాష్ కోరారు. భద్రతా నిబంధనల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.

# పిడుగు పడి ముగ్గురు మృతి

>> వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అత్యవసరమైన పరిస్థితిలో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించాలని వైద్యులను సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, త్వరలో కోలుకునే విధంగా వైద్య సేవలు అందిస్తామని, అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ ముగ్గురు కార్మికులు చనిపోగా, జిల్లా ఆస్పత్రిలో నలుగురు క్యాజువాల్టీ వార్డులో చికిత్స పొందుతున్నారన్నారు. మరొకరి పరిస్థితి విషమంగాఉండటంతో కార్పొరేట్ హాస్పిటల్‌కి తరలించామని తెలిపారు. ప్రస్తుతానికి ఆరోగ్యం నిలకడగాఉన్నట్లు వెల్లడించారు. బాధితులకు ప్రభుత్వపరంగా మెరుగైన వైద్య సదుపాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మెళియాపుట్టి మండలంప్రాంతంలో ఎక్కువ పిడుగుపాటు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో శాస్త్రీయంగా నివారణకు కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



తూ.గో జిల్లా రాయవరంలో అగ్నికీలల్లో పటాసుల తయారీ కేంద్రం

# రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

>> "వారు పదార్థాలను సృష్టించడానికి మార్గాలను కనుగొన్నారు. పూర్తిగా కొత్త పదార్థాలు, వాటి లోపలి భాగంలో పెద్ద కుహరాలు ఉంటాయి. వీటిని హోటల్‌లోని గదుల మాదిరిగా చూడవచ్చు. తద్వారా అతిథి అణువులు ఒకే పదార్థం నుండి ప్రవేశించి మళ్లీ నిష్క్రమించవచ్చు" అని నోబెల్ కమిటీ ఫర్ కెమిస్ట్రీ చైర్మన్ హైనర్ లింకే తెలిపారు. "అటువంటి చిన్న మొత్తంలో పదార్థం హ్యారీ పాటర్‌లోని హెర్మియోన్ హ్యాండ్‌బ్యాగ్ లాగా ఉంటుంది. ఇది చిన్న పరిమాణంలో భారీ మొత్తంలో గ్యాస్‌ను నిల్వ చేయగలదు" అని లింకే పేర్కొన్నారు. కిటగావా జపాన్‌లోని క్యోటో విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉండగా, రాబ్సన్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. యాఘి అమెరికాలోని కాలిఫోర్నియా వర్శిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధిలో ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించారు. ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీటిని సేకరించడం, వాతావరణంలోని హానికర కర్బన ఉద్గారాలను బంధించడం వంటి అసాధారణ పనులకు వీలు కల్పించే వినూత్న ఆవిష్కరణ చేశారు. కొత్తరకం పరమాణు నిర్మాణాన్ని వీరు అభివృద్ధి చేశారు.

మెటల్‌ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్‌ల అభివృద్ధి అనేది రసాయన శాస్త్రవేత్తలకు సమాజంలోని పలు సవాళ్లను పరిష్కరించడానికి కొత్త అవకాశాలను అందించింది. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన విషపూరిత వాయువులను నిల్వ చేయడానికి ఎంఒఎఫ్ పదార్థాలను ఉపయోగిస్తున్నారు. ఫ్యాక్టరీలు, విద్యుత్ కేంద్రాల నుంచి కార్బన్ డై ఆక్సైడ్‌ను సంగ్రహించి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి అనేక కంపెనీలు ఎంఒఎఫ్ పదార్థాలను పరీక్షిస్తున్నాయి. ఈ ముగ్గురు శాస్త్రవేత్తల ఆవిష్కరణలు పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమలలో సురక్షితమైన, సమర్థవంతమైన పరిష్కారాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ రంగంలో 1989లో రిచర్డ్ రాబ్సన్ తొలి అడుగులు వేయగా, ఆ తర్వాత సుసుము కిటగావా, ఒమర్ యాఘి తమ పరిశోధనలతో దీనిని మరింత ముందుకు తీసుకెళ్లారు. కిటగావా ఈ నిర్మాణాల్లోకి వాయువులు స్వేచ్ఛగా ప్రవహిస్తాయని నిరూపించగా, యాఘి అత్యంత స్థిరమైనలను సృష్టించి, వాటిని మనకు కావాల్సిన విధంగా మార్చుకునే పద్ధతిని ఆవిష్కరించారు. వీరి కృషి ఫలితంగా ఇప్పటివరకు పదివేల రకాలకు పైగా రూపుదిద్దుకున్నాయి. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మనకు అవసరమైన సరికొత్త ప్రయోజనాలతో పదార్థాలను రూపొందించుకో వడానికి ఇది ఊహించని అవకాశాలను అందిస్తున్నాయి అని నోబెల్ కమిటీ చైర్మన్ హైనర్ లింకే ఈ సందర్భంగా ప్రశంసించారు.

**ఫిజిక్స్‌లో గూగుల్ శాస్త్రవేత్తలకు నోబెల్: సుందర్ పిచాయ్ హర్షం**

భౌతిక శాస్త్రంలో 2025కు గాను జాన్ క్లార్క్, మిషెల్ డెవోరెట్, జాన్ ఎం మార్టినిస్‌లకు నోబెల్ శాంతి పురస్కారం లభించడం పట్ల గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ హర్షం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో సంభవించే ఎనర్జీ క్వాంటిజేషన్‌పై చేపట్టిన డిస్కవరీకి గుర్తింపుగా నోబెల్ అవార్డు వరించిన విషయం తెలిసిందే. ముగ్గురిలో ఇద్దరు గూగుల్‌సంస్థలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు కావడం విశేషం. మిషెల్ డెవోరెట్.. గూగుల్ క్వాంటమ్ ఎఐ ల్యాబ్‌లో హార్డ్‌వేర్ చీఫ్ సైంటిస్ట్‌గా, జాన్ మార్టినిస్ హార్డ్‌వేర్ టీమ్‌కి చాలా ఏళ్లుగా నాయకత్వం వహించారు. ఈ నేపథ్యంలో వారికి ఈ అత్యున్నత పురస్కారం దక్కడంపై సుందర్ పిచాయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మిషెల్ డెవోరెట్, జాన్ మార్టినిస్, జాన్ క్లార్క్‌లకు అభినందనలు. మిషెల్ మా క్వాంటమ్ ఎఐ ల్యాబ్‌లో హార్డ్‌వేర్ చీఫ్ సైంటిస్ట్‌గా, జాన్ మార్టినిస్ చాలా ఏళ్లుగా హార్డ్‌వేర్ టీమ్‌కి నాయకత్వం వహించారు. ఐదు మంది నోబెల్ గ్రహీతలు ఉన్న కంపెనీలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా" అని పేర్కొన్నారు.

## పేలుడు పదార్థాల అక్రమ రవాణా కేసులో ఒకరికి ఐదేళ్లు జైలు

**చిత్తూరు, అక్టోబరు 8 ప్రభాతవార్త:** అనుమతి లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలను రవాణా చేస్తున్న వ్యక్తికి చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు బుధవారం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు 5 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాలిలా వున్నాయి. 2019 సంవత్సరంలో తమిళనాడు నుండి కుప్పంకు చట్టబద్ధమైన ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలను మురుగన్ మన్నుకన్ రవాణా చేస్తూ కుప్పం పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జిటి నాయుడు 22 ఫిబ్రవరి 2019 సాయంత్రం 4 గంటల సమయంలో కుప్పం మండలం కృష్ణాపురం గ్రామం మల్లనూరు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఓ ట్రాక్టర్ తమిళనాడు నుండి కుప్పం వైపుకు వచ్చింది. ఈ సమయంలో అక్కడ వున్న పోలీసులను చూసిన డ్రైవర్ మురుగన్ మన్నుకన్ భరత్ పెట్రోల్ బంకు వద్ద ట్రాక్టరును వదలి పారిపోవడానికి ప్రయత్నించాడు. అయితే ఇన్స్‌పెక్టర్, సిబ్బంది వెంబడించి అతనిని పట్టుకుని విచారించగా తన పేరు మురుగన్ మన్నుకన్ అని, తాను రాళ్లను పేల్చి జీవనం సాగించేవాడని, తన వద్ద ఎలాంటి చట్టబద్ధ లైసెన్స్ లేదని తెలిపారు. తాను వేలూరు జిల్లాలోని అక్రమ విక్రేతల నుండి తక్కువ ధరకే జెలిటిన్ స్టిక్స్, డిటోనేటర్లను కొనుగోలు చేసి గ్రామానికి తీసుకెళ్తున్నట్లు అంగీకరించాడు. ఈ క్రమంలో అప్పటి ఎస్ఐ ఇ వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్స్‌పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి నుండి పోలీసులు 40 డిటోనేటర్లు, 40 జెలిటిన్ స్టిక్స్, ఒక మగ్గర్ బాక్స్, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించగా కోర్టు కేసు పూర్వపరాలను విచారించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక బుధవారం తీర్పు వెలువరించారు.

# రూ. 212 కోట్లతో రాజ్‌భవన్

>> అథార్టీలో నిర్ణయించారు. హ్యాపీ నెస్ట్, ఎపి ఎన్నార్టీ ప్రాజెక్టులకు చెందిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజును మాఫీ చేసేందుకు అథార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధానిలో నిర్మించే హోటళ్ల వద్ద పార్కింగ్ నిబంధనల్లోనూ స్వల్ప మార్పులు చేసేందుకు అథార్టీ అంగీకరించింది. కొండవీడు వాగు సమీపంలో నీటి ప్రవాహాల కోసం 8400 క్యూసెక్కుల సామర్థంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అథార్టీ నిర్ణయించింది. దీంతో పాటు మరికొన్ని సాంకేతిక అంశాలకు, పరిపాలనా అంశాలకు అథార్టీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సిఎం కొన్ని సూచనలు చేశారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉందని... పార్కింగ్ సమస్య లేకుండా ప్రణాళికలు చేయాలని సూచించారు. అమరావతి రాజధానిలో రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేసే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. కామన్ పార్కింగ్ ప్రాంతాలు ఉండేలా ప్రణాళికలు చేయాలని సిఎం అధికారులకు చెప్పారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరితాడేపల్లి కార్పోరేషన్లు, తెనాలి మున్సిపాలిటీ, రాజధాని ప్రాంతంతో ఇంటిగ్రేట్ చేయాలని... బ్లూ గ్రీన్ అమరావతిగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సిఆర్డీఎ అథార్టీ సమావేశానికి మంత్రి నారాయణ, సిఎస్ కె.విజయానంద్, సిఆర్‌డిఎ, ఎడిసి మౌలికసదుపాయాల కల్పన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అమరావతి నిర్మాణానికి మరో సంస్థ

>> **కొత్తగా ఏర్పాటయ్యే సంస్థ బాధ్యతలు**

కొత్త ప్రాజెక్టులకు నిధుల సేకరణతోపాటు అవసరమైన ప్రాజెక్టులు రూపొందించి వాటికి డిపిఆర్‌లు తయారు చేయనుంది. పిపిపి, ఇపిసి, హెచ్‌ఎం వంటి పద్ధతుల్లో కాంట్రాక్టర్లకు నిర్మాణ బాధ్యతలను అప్పగించనుంది. ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులను అమలు చేసేందుకు వీలుగా పత్రాలు తయారు చేసే బాధ్యతనూ నిర్వర్తించనుంది. పిపిపి పద్ధతిలో ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన ప్రణాళికనూ తయారు చేయనుంది. ఇక్కడ ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా కార్పొరేట్ సంస్థలనూ ఎంపిక చేసుకునే అవకాశమూ కొత్తగా ఏర్పాటు చేసుకునే సంస్థకు ఇచ్చారు.

# రాజధానిలో భూసేకరణకు ఉత్తర్వులు

## సమీకరణలో ఇవ్వని భూమిని తీసుకోవాలని నిర్ణయం

**విజయవాడ, అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో 217 చ.కి.మీల పరిధిలో సమీకరణలో రైతులు ఇప్పటి వరకు ఇవ్వని భూముల్ని...సేకరణ విధానంలో తీసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో 343.36 ఎకరాల సేకరణకు జారీ చేసిన నోటిఫికేషన్లను ఉపసంహరించుకొని,వాటిపై పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టేందుకు సీఆర్‌డీఏకు అనుమతినిచ్చింది. రాజధానిలో సమీకరణలో ఇవ్వని భూమి ఇంకా సుమారు 2,800 ఎకరాల వరకు ఉంది. ఆ మొత్తం సేకరణకు ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వకుండా...రాజధానిలో చేపట్టే ప్రాజెక్టుల వారీగా అవసరమైన చోట సేకరణ చేపడతారు. ఎక్కడ ఎంత భూమి అవసరమో సీఆర్‌డీఏ కమీషనర్ చెబితే...దాని సేకరణకు గుంటూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ ఇస్తారు. '2013 భూసేకరణ చట్టం'నిబంధనల్ని అనుసరించి భూమిని సేకరిస్తారు. రాజధానిలో అక్కడక్కడా కొంత భూమిని సమీకరణలో ఇవ్వకపోవడంతో...మౌలిక వసతుల ప్రాజెక్టులు,వివిధ సంస్థలకు భూ కేటాయింపులు,రైతులకు స్థలాలు కేటాయించడం వంటి ప్రక్రియలకు విఘాతం కలుగుతోందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

# భారీ ఎఫ్‌డిఐ

>> సీమకూ ఓ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. ఆమేరకు మూడు ప్రాంతాలను పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నామని అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకూ ఒక ఆర్థిక ప్రగతి రీజియన్‌ను, నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో ఎకనామిక్ డెవలప్మెంట్ రీజియన్లను ఏర్పాటు చేసుకోవాలని సిఎం సూచించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు అభివృద్ధి అవుతున్నాయని సిఎం అన్నారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా ఉన్న రాయలసీమ ఆగ్రో ప్రాసెసింగ్ హబ్‌గా మారుతోందని త్వరలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేంద్రంగా ఈ ప్రాంతం మారుతుందని అన్నారు. అమరావతి రాజధాని నగరం క్వాంటం వ్యాలీతో నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా మారుతుందని సిఎం అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును కూడా అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీని కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసుకుని ప్రాజెక్టులను ఆహ్వానించాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిఎం ఆదేశించారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రైల్వే లైన్‌కు కూడా అనుసంధానిస్తే లాజిస్టిక్స్ వ్యయం తగ్గి ఆయా ప్రాజెక్టులకు ప్రయోజనం కలుగుతుందని సిఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విలువ జోడింపుపైనా దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు నాణ్యమైన వసతి లభించేలా చూడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వివిధ కేటగిరీల హోటళ్లకు అనుబంధంగా ఎకో సిస్టం కూడా వచ్చేలా చూడాలని సూచించారు. తిరుపతిలో ఉన్న కలినరీ ఇనిస్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచి వివిధ సంస్థలను అనుసంధానించాలని పేర్కొన్నారు. కూచిపూడి, థింసా లాంటి సంప్రదాయాలతో పాటు వివిధ ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల విజయం సాధించిన విజయవాడ ఉత్సవ్ తరహాలోనే విశాఖ, రాజమహేంద్రవరం లాంటి చోట్ల కూడా ఉత్సవ్‌లను నిర్వహించాలని సూచించారు.

అమెరికాలో వర్జీనియా నగరం డేటా వ్యాలీగా ఉందని.. ప్రస్తుతం విశాఖ కూడా రైడెన్, గూగుల్ ప్రాజెక్టులతో డేటా వ్యాలీగా రూపొందుతుందని ఐటీ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రికి వివరించారు. టిసిఎస్ సంస్థ కూడా ఇక్కడ త్వరలోనే క్యాంపస్‌ను ప్రారంభించనుందని.. ఒక్క విశాఖ నగరంలోనే 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం.. ఐటీ సంస్థల్లు, అందులో పనిచేసే ఉద్యోగులకు హౌసింగ్‌తో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతులు ఉండేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌తో స్థానిక టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. వీటితో పాటు 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రామాయపట్నం సమీపంలో వస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీతో పాటు ఆర్సెలార్ మిట్టల్, రైడెన్ డేటా సెంటర్ లాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యే వరకూ పర్యవేక్షణ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించాలని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు లాజిస్టిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నీటి సరఫరా, వినియోగం లాంటి అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. 2028 నాటికల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసేలా చూడాలని సిఎం పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఎస్ఐపిబి సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు సీఎస్ కె.విజయానంద్, పరిశ్రమలు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పసిడి మరింత పైపైకి

>> ధరలు 55 శాతానికి పైగా పెరిగాయి. ప్రపంచ, కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడం, గోల్డ్ ఇటిఎఫ్‌లలోకి పెట్టుబడులు పెరగడం వంటివి కూడా ధరల పెరుగుదలకు దోహదపడ్డాయి. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు ఇలాగే కొనసాగితే, బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పదిగ్రాముల బంగారం రూ 1,25,780గాను, 22 క్యారెట్ల బంగారం 1,12,900గాను నిలిచింది. ఢిల్లీలో 1.22,080రూపాయలు, 22 క్యారెట్లు 1,12,030గాను కొనసాగాయి. ముంబయిలో 24, 22 క్యారెట్లు వరుసగా రూ.1,22,030లు, 1,11,860లుగానడిచాయి. కోల్‌కత్తాలో కూడా రూ.1,22, 030, రూ.1,11,860లుగా ఒకేరకంగా కొనసాగాయి. ఇక దక్షిణాదిలో కీలకంగా పరిగణించే చెన్నైలో కూడా అవేధరలు కొనసాగాయి. బెంగళూరులో ధరలు 24 క్యారెట్లు 1,22,030గాను, 22 క్యారెట్లు 1,11,860గాను కొనసాగాయి. బంగారంతోపాటే వెండిధరలు కూడా ర్యాలీ తీసాయి. హైదరాబాద్‌లో కిలో వెండి 1,66,900గా కొనసాగితే విజయవాడలో 1,66,900, ఢిల్లీలోరూ.1,57,100, చెన్నైలో 1,66,900, కోల్‌కత్తాలో 1,57,100, ముంబయిలో 1,57,100గా కొనసాగాయి. బెంగళూరులో కూడా 1,57,100గాను, ఆభరణాల తయారీ ఎక్కువ ఉండో వదోదర, అహ్మదాబాద్‌లలో కూడా రూ.157,100గా నడిచాయి. అంతర్జాతీయంగా కరెన్సీ మార్కెట్, ఫండ్స్,ఈక్విటీల్లో ఎదురవుతున్న ప్రతికూల పవనాలు బులియన్ మార్కెట్‌కు కలిసొస్తున్నాయి. ఫెడ్‌రిజర్వ్‌తోపాటు కీలక సెంట్రల్‌బ్యాంకులు ఫండ్‌రేట్స్ సడలిస్తే ఆప్రభావం బులియన్‌పై చూపిస్తోంది. 1950 నుంచి ఉన్న పసిడి ధరలను ఒకసారి పరిశీలిస్తే అన్నివర్గాలకు ఆశ్చర్యం కలుగక మానదు. ఈఏడాదిలోనే ఇప్పటివరకూ బంగారం 50వేల రూపాయలకు పైబడి పెరిగింది.

| సంవత్సరం | ధర 10 గ్రాములు. రూ.లలో |
|---|---|
| 1950 | 99 |
| 1970 | 184 |
| 1980 | 1330 |
| 1990 | 3200 |
| 2000 | 4400 |
| 2010 | 18,500 |
| 2020 | 48,651 |
| 2024 | 75,000 |
| 2025 (మార్చి) | 82,100 |
| 2025 (అక్టోబరు 8) | 1,25,780 |

## వారం - వర్జ్యం

09-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
తదియ రా.10.56
భరణి రా.8.04
వర్జ్యం : ఉ.6.49-8.15
దు.ఉ.9.56-10.43, 2) మ.2.41-3.28
శుభసమయం: ఉ.5.30-6.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ప్రకృతి వైద్యం మేలు చేస్తుంది. దూరప్రాంతాల నుండి శుభ వార్తలు.

**వృషభం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు అధిగమిస్తారు. సన్నిహితుల కలయిక.

**మిథునం:** భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. వస్తు లాభం.

**కర్కాటకం :** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**సింహం:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. వాహనయోగం.

**కన్య :** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**తుల :** దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. శుభవార్తలు.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇంటాబయటా అనుకూలం.

**ధనుస్సు:** ఇతరుల విషయాలలో జోక్యం వద్దు. వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**మకరం:** శుభకార్యాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. సమయస్ఫూర్తితో మెలగడం మంచిది.

**మీనం :** డాక్యుమెంట్లు, ముద్రణా పరమైన బాకీలు ఇబ్బందులకు గురిచేస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

09-10Pg3exHMNWJQETP 3 GO_09-10Pg3exHMNWJQETP.qxd 10/9/2025 12:01 AM Page 1



# కల్తీ లిక్కర్‌పై ఉక్కుపాదం

## ములకల చెరువు కేసులో 21 మంది నిందితులుగా గుర్తింపు
## న- వారిలో 12 మంది అరెస్టు
## - ఫేక్ ప్రచారంపైనా చర్యలు : సిఎం చంద్రబాబు



లిక్కరుపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష దృశ్యం

**విజయవాడ.అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కల్తీ లిక్కర్ తయారీ, అమ్మకాలను ఏ మాత్రం ఉపేక్షించవద్దని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కల్తీ లిక్కర్‌తో ప్రజల ప్రాణాలను హరించే వారిపై కఠిన చర్యల ద్వారా ఉక్కుపాదం మోపాలని సీఎం స్పష్టం చేశారు. 15 నెలల్లో పటిష్ట చర్యల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టామని...ఇంతే సమర్థవంతంగా పనిచేసి రాష్ట్రంలో కల్తీ లిక్కర్ అనేది లేకుండా చేయాలని చెప్పారు. ఏ ఒక్క చోటా కల్తీ లిక్కర్ తయారీ కేంద్రాలు కానీ, అటువంటి వ్యక్తులు కానీ ఉండకూడదని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ లిక్కర్ వ్యవహారంలో తీసుకున్న చర్యలను, దర్యాప్తు వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరవు కేసులో మొత్తం 21 మంది నిందితులుగా గుర్తించామని...అందులో ఇప్పటికి వరకు 12 మందిని అరెస్టు చేశామని...మిగిలా నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ములకలచెరువు కేసులో ఎ1 గా ఉన్న అద్దేపల్లి జనార్ధన్‌రావు లావాదేవీలు, వ్యాపారాలపై విచారణ జరపుతున్నామని తెలిపారు. ముకలచెరువు కేసుల ఆధారంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జనార్ధన్‌రావుకు చెందిన వ్యాపారాలపై తనిఖీలు జరిపామని తెలిపారు. ఈ తనిఖీల్లో కిరాణా షాప్ వెనుక కల్తీ మద్యం నిల్వలను గుర్తించినట్లు తెలిపారు. అద్దేపల్లి జనార్ధన్‌రావు ఇబ్రహీంపట్నంలోని మెస్సర్స్ తివిళి బార్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. అతను 15 సంవత్సరాలుగా మద్యం వ్యాపారం చేస్తున్నాడు. అధిక లాభాల కోసం నకిలీ మద్యం తయారీ ద్వారా చట్ట విరుద్ధ కార్యక్రమాలు నిర్వహించారు. తన సోదరుడు అద్దేపల్లి జగన్ మోహన్ రావు ద్వారా కల్తీ మద్యం తయారీ, సరఫరా, అమ్మకం చేపట్టాడు. వీరిద్దరు కొందరితో కలిసి కల్తీ మద్యం తయారు చేసినట్లు తనిఖీల్లో గుర్తించామని అధికారులు తెలిపారు. ఇక్కడ జరిపిన తనిఖీల్లో కల్తీ లిక్కర్ సీసాలు పట్టుకున్నామని తెలిపారు. ఇక్కడ కల్తీ లిక్కర్ వ్యవహారంలో మొత్తం 12 మందిని నిందితులుగా గుర్తించామని వీరిలో ముగ్గురిని ఇప్పటికి అరెస్టు చేశామని తెలిపారు. నలుగురిని పీటీ వారెంట్‌పై తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. నిందితుల కాల్ రికార్డులతో పాటు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని అధికారులు వివరించారు. కల్తీ లిక్కర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసిన ముఖ్యమంత్రి.....ఈ మొత్తం వ్యవహారంలో పలు కీలక సూచనలు చేశారు. అన్నమయ్య జిల్లాలో జరిగిన కల్తీ లిక్కర్ వ్యవహారంపై రాష్ట్రంలో రాజకీయ పక్షాలు తప్పుడు ప్రచారంతో రాజకీయ ప్రయోజనం కోసం ప్రయత్నం చేస్తున్నాయని సీఎం అన్నారు. రాష్ట్రం అంతటా కల్తీ లిక్కర్ అని తప్పుడు ప్రచారంతో ప్రజలను భయపెడుతున్నారని....ప్రతి మూడు బాటిల్స్‌లో ఒక బాటిల్ కల్తీ లిక్కర్ బాటిల్ ఉందని ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీఎం అన్నారు. రాష్ట్రంలో కల్తీ లిక్కర్‌తో ప్రాణాలు పోతున్నాయని ఫేక్ ప్రచారాలు మొదలు పెట్టిన విషయాన్ని మంత్రులు కూడా అర్థం చేసుకోవాలని.... వైసీపీ నేతల రాజకీయ కుట్రలను ఎప్పటికప్పుడు భగ్నం చేయాలని సూచించారు. కల్తీ లిక్కర్ కారణంగానే అక్కడ చనిపోయారు...ఇక్కడ చనిపోయారు అని ప్రచారం చేస్తున్నారని.... ప్రతీ ఆరోపణ పైనా విచారణ జరపించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైతే పోస్టుమార్టం వంటి విధానాల ద్వారా మృతికి కారణాలు సైంటిఫిక్‌గా నిర్ధారించి...వాస్తవాలు వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. ఏది నిజమో చెప్పడంతో పాటు..రాజకీయ కుట్రల్లో భాగంగా సహజ మరణాలపై తప్పుడు ప్రచారాలు చేసేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్తీ లిక్కర్‌తో మరణాలు అని ప్రచారం చేస్తే దానికి రుజువు చూపాలని అడగాలని...తప్పుడు ప్రచారం అని తేలితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా అయినా, సోషల్ మీడియా అయినా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించవద్దని సీఎం స్పష్టం చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి లాభం పొందుదామనుకుంటే ప్రభుత్వం, ప్రభుత్వ శాఖలు సైలెంట్‌గా చూస్తూ ఊరుకోవని సీఎం హెచ్చరించారు. ఈ సమావేశానికి మంత్రులు కొల్లు రవీంద్ర, లోకేష్ నేరుగా హాజరవ్వగా..హోంమంత్రి సహా పలువురు మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. 2019లో వివేకా హత్య సమయంలో వైసీపీ ఆడిన డ్రామాలు, శవ రాజకీయాలను మరిచిపోవద్దని చెప్పారు. వాళ్లు ఫేక్ ప్రచారంతోనే ప్రజలను నమ్మించాలనే ప్రయత్నంలో ఉంటారన్నారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి సేవలో 1008 సత్యాత్మతీర్థస్వామి



**తిరుమల,అక్టోబర్ 8ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగంలో భగవంతుని నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని, భక్తులు భగవంతుని ఆశీస్సులు పొందుతారని ఉడిపి మఠం పీఠాధిపతి 1008 సత్యాత్మ తీర్థస్వామి తెలిపారు. బుధవారం ఉదయం తిరుమలకు శిష్యులతో కలసి వచ్చిన స్వామికి పెద్దజీయర్ మఠం సమీపంలోని రాగిచెట్టువద్ద నుండి ఆలయ సాంప్రదాయాలతో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ మహద్వారం నుండి ఆలయంలోపలకు వెళ్ళిన స్వామి శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ సింఘాల్, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేశవ్యాప్తంగా అందుబాటులోకి టిటిడి క్యాలండర్లు డైరీలు



**తిరుమల,అక్టోబర్ 8ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి సంబంధించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ముద్రించిన 2026 నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. వీటిని గతనెల 24వతేదీ సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించిన విషయం విదితమే. ప్రస్తుతం తిరుమల, తిరుపతితోబాటు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, హిమాయత్‌నగర్, న్యూఢిల్లీ, ముంబై, బెంగుళూరు, వేలూరు, చెన్నైలతోబాటు ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరులోని టిటిడి కళ్యాణమండపాల్లో టిటిడి నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. 12పేజీలు క్యాలండర్, ఆరపేజీల క్యాలండర్, టేబుల్‌టాప్ క్యాలండర్, డీలక్స్‌డైరీలు, పెద్దడైరీలు ఇలా స్వామివారి ప్రతిమల క్యాలండర్లు కొనుగోలుచేసుకునే అవకాశం కలిగింది. టిటిడి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా భక్తులు బుక్‌చేసుకునే సదుపాయం టిటిడి కల్పించింది. ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకున్న వారికి తపాలశాఖ ద్వారా ఇంటివద్దే టిటిడి డైరీలు, క్యాలండర్లు అందజేయబడుతాయి. "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తిరుమల. ఓఆర్‌జి, టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

## శ్రీవారి సేవలో విఐపిలు - అందరికీ శుభాలు కలగాలి



**తిరుమల,అక్టోబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమలశ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని, సుఖసంతోషాలతోఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయంనైవేద్యాల విరామ సమయంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిటిడి బోర్డుసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సినీనటుడు నారా రోహిత్, ఏపిఈఆర్‌సి ఛైర్మన్ పివిఎస్‌రెడ్డి, సినీరచయిత కోన వెంకట్, నటి అషురెడ్డి కుటుంబంతో కలసి వేర్వేరుగా ఉదయం ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# డిసిఎం పవన్‌ను విమర్శించే స్థాయి పాలేరు నానికి లేదు

## - జనసేననేత కిరణ్ రాయల్



**తిరుపతి,అక్టోబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించే స్థాయి పాలేరునానికి లేదని, నాని ఎవరి మనిషి అనేది ప్రజలందరికీ తెలుసని తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. పేర్నినాని కాదని పాలేరునాని అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. డిసిఎం పవన్‌కల్యాణ్ గురించి విమర్శించే స్థాయి పాలేరునానిగానీ, మాజీ సిఎం జగన్‌కుకూడా లేదని గట్టిగా స్పందించారు. పవన్‌కల్యాణ్ ఎక్కడ పర్యటిస్తున్నారు, ఏం చేస్తున్నారనేది పాలేరుకేమి తెలుసని ఎద్దేవాచేశారు. బుధవారం తిరుపతిలో మీడియాతో కిరణ్ మాట్లాడారు. దేశరాజకీయాల్లో పవన్‌కల్యాణ్ అవసరం ఎన్డీఎలో కీలకంగా ఉందన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే బందర్‌బస్టాండ్‌లో నాని నాలుకోస్తామని హెచ్చరించారు. సుగాలిప్రీతి కేసు గత ఐదేళ్లలో కానిస్టేబుల్ కూడా విచారణకు ఇవ్వలేదని, అలాంటిది ఐదేళ్ళ వైసిపి పాలనలో నకిలీ మద్యం పట్టుకున్నారా? ఒక్కరిపైనా కేసు పెట్టారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేసు సిబిఐకి ఇచ్చిందని, నకిలీ మద్యంలో పెద్దోళ్ళు జైలుకెళ్ళడం తెలియదాఅని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జనసేన నేతలు హేమకుమార్, రుద్రకిశోర్; మనోజ్, సాయిదేవ్, సాయి.ఆది, లోకేశ్ పాల్గొన్నారు.

# విజయవాడ హత్య కేసులో వీడిన మిస్టరీ

## - ఇద్దరు నిందితుల అరెస్ట్


**విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 8,ప్రభాతవార్త** తన భార్య తనను వదిలి వెళ్ళడానికి కారణమైందనే కారణంతో తన పిన్నిని హత్య చేసినట్లుగా నమోదైన కేసులో సిసి కెమేరాల ద్వారా పోలీసులు నిందితుడిని పట్టుకున్న ఉదంతమిది. సిపి రాజశేఖరబాబు తలిపిన వివరాల ప్రకారం గొల్లపూడి లోని బొమ్మసాని సుబ్బారావు నగర్ వద్ద మురుగునీటిలో రెండు చేతులు, రెండు కాళ్ళు, తల లేని కేవలం ఒక మొండెం భాగం మాత్రమే ఉన్న మహిళ మృతదేహం ఉందనే సమాచారంపై భవానీపురం పోలీసులు అనుమానాస్పద మృతి క్రింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు పశ్చిమ జోన్ ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ, ఏసిపి దుర్గారావుల పర్యవేక్షణలో సిఐ ఉమామహేశ్వరరావు అధ్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి చుట్టుపక్కల విచారించారు. ఈ నేపథ్యంలో పొత్తూరి విజయలక్ష్మి (70) చిట్టినగర్ లోని సాయిరాం థియేటర్ సమీపంలోని వాసవి కళ్యాణ మండపం వద్దకు వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదని వచ్చిన సమాచారం మేరకు అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన సిసి కెమేరాలను పరిశీలించి సదరు మహిళను ఒక వ్యక్తి బైక్‌పై తీసుకెళ్ళినట్లు గుర్తించారు. సదరు వ్యక్తి ఇంటి సమీపం లోని సీసీ కెమేరా పుటేజి పరిశీలించగా మృతురాలిని గత నెల 30ర సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి లోపలికి తీసుకువెళ్ళినట్లు అప్పటి నుండి మృతురాలు తిరిగిరానట్లు తర్వాత నిందితులైన వంకదార హనుమాన్ జి.సుబ్రహ్మణ్యం, అతని కుమారుడు వంకధార లక్ష్మీ నరసింహస్వామిలు పలుమార్లు ఇంటి నుండి బయటకు బ్యాగులతో బయటకు వచ్చి బండిపై వెళ్ళినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించారు.

# ప్రత్యేక ప్రాజెక్టుల కోసం ఎస్‌పివి ఏర్పాటు

**విజయవాడ.అక్టోబరు 8,ప్రభాత వార్తప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రత్యేక ప్రాజెక్టుల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ) ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్‌పీవీ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రీలు, నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, స్పోర్ట్స్ సిటీ, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులు రానున్నాయి. మరోవైపు రాజధానిలో భూసేకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమీకరణలో ఇవ్వని భూమిని తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# కాన్పూర్‌మిశ్రీగంజ్‌లో భారీ పేలుడు

## మహిళ సహా ఆరుగురికి తీవ్రగాయాలు



**కాన్పూర్, అక్టోబరు 8:** నగరంలోని మిశ్రీ బజారులో బుధవారం సాయంత్రం రెండు పార్కింగ్‌చేసిన స్కూటర్లలో అమర్చిన బాంబులు పేలడంతో భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ పేలుడులో కనీసం ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులను వెంటనే సమీపం లోని ఉర్సులా ఆసుపత్రికి తరలించారు. రాత్రి 7.15 గంటలప్రాంతంలో మిశ్రీ బజార్ ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. జెసిపి అశుతోష్‌కుమార్ మాట్లాడుతూ రెండు స్కూటర్లనుంచి ఈ పేలుడు సంభవించిందని మహిళ సహా ఆరుగురు గాయపడినట్లు చెప్పారు. మా ఫోరెన్సిక్ బృందాలుసంఘటనాస్థలాలో వివరాలు సేకరిస్తున్నాయని అన్నారు. పేలుడు సంభవించిన స్కూటర్‌ను గుర్తించామని, ఇందుకు సంబంధించి అన్ని కోణాలనుంచి దర్యాప్తు జరుగుతోందని అశుతోష్ వెల్లడించారు. ఇది ప్రమాదమా లేక కుట్రపూరితమా అన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతున్నట్లు జెసిపి అశుతోష్ చెప్పారు. పోలీస్, బాంబు నిర్వీర్యంచేసే బృందాలతోపాటుఫోరెన్సిక్ టీమ్‌లుకూడా వెంటనే ప్రమాదస్థలానికి చేరుకు ఉన్నాయి. అంతేకాకుండా చెల్లాచెదురయిన ఈ ప్రాంతాన్ని మొత్తం సీజ్‌చేసి పేలుడుకు సంబంధించిన మొత్తం వివరాలను పరిశీలనచేస్తున్నారు.

# వైకుంఠ ద్వార దర్శనం రెండా? పదిరోజులా?

## డిసెంబరు 31న వైకుంఠ ఏకాదశి



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ప్రపంచప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రానున్న డిసెంబర్‌లో వైకుంఠద్వార దర్శనాలు ఎన్ని రోజులు తెరిచి ఉండనున్నారనేది ఇప్పుడు అటు శ్రీవారి భక్తుల్లో ఇటు టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ ఏడాది డిసెంబర్ 31వతేదీ వైకుంఠ ఏకాదశి ఘడియలు మొదలవుతాయి. 2026 నూతన సంవత్సరం జనవరి 1వతేదీ వైకుంఠ ద్వాదశిపర్వదినం మోక్షం లభించే ఘడియలు. అయితే దక్షణిభారతదేశంలోని పలు వైష్ణవాలయాలు అనాదికాలంగా పదిరోజులపాటు పవిత్రమైన వైకుంఠద్వారాలను తెరచి ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఇదే ఆనవాయితీని 2023వ సంవత్సరంలో తిరుమలతిరుపతిదేవస్థానం పాలకమండలి ,అధికారులు నిర్ణయించి పదిరోజుల వైకుంఠద్వారాలను తెరచి ఉంచి భక్తులకు దర్శనం చేయిస్తున్నారు. గతంలో 2021వరకు తిరుమల ఆలయంలో ఆనందనిలయంలోని వైకుంఠద్వారాలను కేవలం అత్యంత పవిత్రమైన వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియల్లో మాత్రం తెరచివుంచి దాదాపు 2లక్షలమంది వరకు భక్తులకు మోక్షమార్గం దర్శనం చేయించేవారు. అయితే ప్రముఖుల నుండి, ఆగమపండితుల నుండి వచ్చిన విజ్ఞప్తులతో తిరుమల ఆలయంలోనూ పదిరోజులపాటు తెరచివుంచి సామాన్యభక్తులకు ఈ పవిత్రమైన వైకుంఠ ద్వార దర్శనం ప్రశాంతంగా చేయిస్తున్నారు. అయితే ఈ ఏడాది జనవరిలోనూ పది రోజులు వైకుంఠద్వార దర్శనాలు కల్పించడం, అందుకు భారీగా భక్తులు తరలిరావడం తో 2025 జనవరి 8వతేదీ రాత్రి తిరుపతిలో తొక్కిస లాటు, తోపులాట ఘటనల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పో వడం, యాభైమందికి పైగా భక్తులు క్షతగాత్రులైన విషాద ఘటన చోటుచేసుకుంది. దీంతో అప్పట్లోనే తీవ్రస్థా యిలో భక్తుల నుండి వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అప్పట్లోనే రాష్ట్రప్రభుత్వం పదిరోజుల వైకుంఠ ద్వారదర్శనాలను ఆగమ సలహాదారులు, అర్చకులు పునరాలోచన చేయాలని భక్తులు కోరారు. 2025 జనవరి 10వతేదీ నుండి 19వతేదీ వరకు పదిరోజులు వైకుంఠద్వారాలను తెరచివుంచి భక్తులకు దర్శనం చేయించారు. ఆ పదిరోజులు దాదాపు 8లక్షలమంది భక్తులు పవిత్రమైన మోక్ష మార్గంలో ఏడుకొండల స్వామిని దర్శించు కోగలిగారు. ఇప్పుడు తిరుమల బోర్డు, తిరుమల ఆలయ అధికారులు తీసుకునే నిర్ణయంపై వైకుంఠ ద్వారాలు ఎన్నిరోజులు తెరచివుంచనున్నారనేది సందిగ్ధంలో ఉంది. టిటిడిలో చోటుచేసుకున్న పరిణామాలు, ప్రస్తుత పాలకమండలి, ఉన్నతాధికారులు రానున్న డిసెంబర్ నెలలో 31వతేదీ వైకుంఠ ఏకాదశి ఘడియిలు, 2026 జనవరి 1వతేదీ వైకుంఠ ద్వాదశి ఘడియలు వస్తున్నాయి. ఆ రెండురోజులు మాత్రమే వైకుంఠద్వారాలను తెరచి ఉంచుతారా? లేక పదిరోజుల వైకుంఠద్వారాలను తెరచి భక్తులకు దర్శనం చేయిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఈ విషయంపైకూడా భక్తుల నుండి అభిప్రాయసేకరణ చేపట్టేందుకు టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు. మరీ దేశంలోని పలు వైష్ణవాలయాలలో పదిరోజులు వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచుతున్నపుడు తిరుమల ఆలయంలో తీసుకోనున్న నిర్ణయాలు పై భక్తుల్లో సందిగ్ధత నెలకొంది. మరీ గతంలోలాగే వైకుంఠ ద్వార దర్శనాలకు అనుమతినిస్తారా, లేక పదిరోజులు దర్శనాలకు అనుమతినిస్తారా అనేది త్వరలోనే టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు భక్తులకు ఒక స్పష్టత నిచ్చే అవకాశం ఉంది.

# దశాబ్దాల అనంతరం ఒకే వేదికపై రైల్వే గార్డులు, టిఎంఆర్‌లు..

## భావోద్వేగాల మధ్య రైల్వే పూర్వ గార్డుల ఆత్మీయ కలయిక



**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 08, ప్రభాత వార్త:** వారు కొన్ని దశాబ్దాలపాటు వృత్తి పట్ల బాధ్యత, నిబద్ధతలతో కలిసి విధులు నిర్వర్తించి రైల్వే అభివృద్ధిలో పాలుపంచుకున్నవారు. ఉద్యోగ విరమణ చేసి దశాబ్దాల విరామం అనంతరం తాము ఒకరినొకరు కలిసి యోగాక్షేమాలు తెలుసుకొని అలనాటి తమ తమ అనుభవాలను మరోసారి నెమరువేసుకుంటు ఆనందంగా గడపటం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. దక్షి ణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ లో పనిచేసిన అప్పట్టి గార్డులు, ట్రైన్ మేనేజర్లు ఉద్యోగ విరమణ చేసిన అనేక సంవత్సరాలకు దేశంలోనే తొలిసారిగా నిర్వహించిన ఈ చారిత్రాత్మక కార్యక్రమం స్థానిక రైల్వే ఇన్స్‌టిట్యూట్ లో ఆనందోత్సాహాలమధ్య, ఆడంబరంగా జరిగింది పూర్వ గార్డుల సమ్మేళనం కార్యక్రమం. భారతీయ రైల్వే చరిత్రలో మొట్ట మొదటిసారిగా నిర్వహించిన ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో అలనాటి పూర్వపు గార్డులు శ్రీనివాస మూర్తి, నీలకంఠారెడ్డి, రంగనాయకులు, జి.రామచంద్రారెడ్డి, ఎస్.ఎం. బాషా, యస్ మొహమ్మద్ అలీ, వాఘేశ్వరన్, బి.శ్రీనివాసులు, ధర్మన్న, రామనాయక్, శ్రీధరన్, చిట్టిబాబు, రవికుమార్, వై.పి.ఆంజనేయులతో పాటు అధిక సంఖ్యలో సీనియర్ గార్డులు ఈఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని తమ తమ అనుభవాలను, అనుబంధాలను గుర్తుచేసుకొని ఆనందోత్సాహాలు, భావోద్వేగాలకు లోనయ్యారు. తమ సహచరులను, మిత్రులను కలుసుకొని అలనాటి తమ తీపి, మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు... " చెదరని బెదరని చెలిమే తమది.. చెరగని తరగని స్నేహం తమది.. జీవితమంతా విడదీయలేని వాడని వీడని బంధం తమది.. అంటూవృత్తిపట్ల నిబద్ధతలతో చక్కగాఒక్కటిగా కలిసి మెలిసి పనిచేసినరోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఉన్న పలువురు గార్డులు బరువెక్కిన వేదనాభరిత హృదయంతో భావోద్వేగానికి లోను కావడం చూపరులను కంటతడి పెట్టించింది. ఈసందర్భంగా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు రాబిన్ థామస్, వాఘేశ్వరన్, హనుమంతరావు, ధన్ రాజ్, సాయిశేఖర్ సభ్యులు తమ సీనియర్ లను భక్తిశ్రద్ధలతో ఘనంగా శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి పాదాభివందనాలుచేసి ఆశీస్సులు పొందారు... బతుకు తెరువుకై వెళ్తున్నాం.. మళ్లిఎప్పుడోఎక్కడో కలుసుకుందామంటూ టాటా చెప్పుకున్నారు.

# ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించింది

## - ఎస్సార్సీ ఎంపి వైవి సుబ్బారెడ్డి



**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించిందని వైకాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి సుబ్బారెడ్డి ఆరోపించారు. ప్రజల పక్షాన తమ పార్టీ విరామం లేకుండా పోరాడుతుందన్నారు. తమ నేత జగన్ ప్రజల మధ్యకు వచ్చి జనం కోసం ఉద్యమిస్తున్నారన్నారు. తాము ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తుంటే ప్రభుత్వ అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. ఈ మేరకు వైకాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వైవి సుబ్బారెడ్డి ఒక ప్రకటన విడుదల చేసారు. రైతుల పక్షాన పోరాడి యూరియా కష్టాలు తీర్చడానికి కృషి చేశామన్నారు. వైసీపీ, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. ప్రతి నియోజక వర్గంలో ఉన్న సమస్యలు మా దృష్టిలో ఉన్నాయన్నారు. ఎవరు కేసులకు భయపడాల్సిన పని లేదన్నారు. వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. డయేరియా బాధితులను అలాగే వదిలేసిందన్నారు. ఎవరు ఎన్ని తప్పులు చేసినా మీడియాని అడ్డంపెట్టుకొని వాస్తవాలు కప్పి పెడుతుంది. జగన్ దూరదృష్టితో 17 మెడికల్ కాలేజీలుకి శ్రీకారం చుడితే ప్రభుత్వం వాటిని ప్రైవేట్‌పరం చేస్తోంది. విద్యా, వైద్యం, పేదలకు అందుబాటులో ఉండాలని జగన్ పని చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కల్తీ మద్యం చేసింది కూటమి ప్రభుత్వం నిందలు వేసేది మాత్రం వైసీపీ మీద అన్నారు. ప్రతి ఇల్లకూ కల్తీ మద్యం ఫ్యాక్టరీ పెట్టేశామన్నారు. గ్రామ మండల స్థాయి కమిటీలు అన్నీ పూర్తి చేస్తామన్నారు, పార్టీ అధినేత జగన్ ఆదేశం ప్రకారం 29 అనుబంధ విభాగాల నియామకం జరుగుతుంది. కోటి సంతకాల సేకరణ చేస్తాం. దాని ద్వారా ప్రభుత్వపై పోరాడతాం. రాష్ట్రంలో తమ ప్రభుత్వంలో రోడ్ల మరమ్మత్తులకు 1000 కోట్ల నిధులు మంజూరు చేసామన్నారు. రాష్ట్రంలో 274 రోడ్డు పనుల కోసం రూ.1000 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిలో స్టేట్ హైవేస్ 108కి సంబంధించిన పనులకు రూ.400 కోట్లు మంజూరు చేసిందన్నారు. మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్ 166 పనులకు రూ.600 కోట్లు మంజూరు చేసింది. చంద్రబాబు ప్రభుత్వం చేసిందేమిటో చెప్పాలన్నారు. అంకెల గారడీతో జనాన్ని పదే, పదే మోసగించలేమన్నారు.

# నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులకు నాణ్యమైన భోజనం: మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ట్రిపుల్ ఐటీల్లో మెస్ నిర్వహణ భాధ్యతను అక్షయపాత్రకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అప్పగించారు. లోకేష్ తన మాట నిలబెట్టుకున్నారని విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు విద్యార్థులు. ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీ భోజనం సరిగా పెట్టడం లేదని విద్యార్థులు ఆందోళన చేశారు. అయితే అక్షయపాత్ర ద్వారా నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని లోకేష్ నిర్ణయం తీసుకున్నారు. అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన భోజనం అందుతుండటంతో సంతోషం వ్యక్తం చేశారు విద్యార్థులు.

తమ సమస్య పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ కృషి చేశారని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అభినందనలు తెలిపారు. అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన భోజనాలతో ఇప్పుడు నిజమైన మార్పు కనిపిస్తోందని విద్యార్థులు పేర్కొన్నారు.

వార్త

పుస్తకం విలువ దాని ఖరీదుతో వెలకట్టకండి, ఆ పుస్తకం ఇచ్చే అపార విజ్ఞానంతో వెలకట్టండి.

-ఆస్కార్‌వైల్డ్

# ప్రతిష్ఠాత్మక భేరి !

బీహార్లో వైశాలి ప్రపంచానికి ప్రజాస్వామ్య మార్గాన్ని చూపినట్లే, ఈసారి బీహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళన దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నది ఎన్నికల కమిషన్ ఆకాంక్ష. అందుకేనేమో! ఇలా ప్రత్యేక ముమ్మర ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తవగానే బీహార్ ఎన్నికల నోటిఫికేషన్ అలా ప్రకటించేసింది ప్రధాన ఎన్నికల కమిషన్. 22ఏళ్ల తర్వాత బీహార్ రాష్ట్రంలో ఇలాంటి ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగిందని సిఇసి ఎందుకలా గొప్పగా చెప్పుకుంటుందో అర్థంకాదు. ఇంతక్రితం అలాంటిదేమీ జరుగలేదని కాబోలు. కానీ ఏ స్థాయి ఎన్నికలైనా త్వరలో వస్తాయనగా లేదా ఏటా విస్తృత ఓటర్ల జాబితా సవరణ వంటి సవరణలు జరుగుతూనేఉంటాయి. అవన్నీ బూటకమేనా! అలాంటి సవరణల్లో కనీసం కొత్త నవయువ ఓటర్ల చేర్పింపు, అదే సమయంలో నకిలీ ఓటర్ల గుర్తింపు, జాబితాల నుంచి ఓటర్ల బదలీ వంటివి సాధారణం. వీటన్నిటినీ మించి బీహార్ జాబితా సవరణ లేదా ప్రక్షాళన సంపూర్ణమైందంటే ఆహ్వానించదగిన పరిణామమే. అయినా ఎన్నడూ లేనిది ఓటర్ల జాబితా తప్పొప్పుల విషయం మాత్రమే చర్చించే విపక్షాలు ఈసారి గొంతెత్తి అరిచాయి. వారి విమర్శలు చిరిగి చిరిగి కన్నం చాటయ్యిందన్న చందాన ఉన్నాయి. జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యల్ని సిఇసి సీరియస్‌గా తీసుకుని క్షమాపణలు కోరిన పరిస్థితి వచ్చింది. చెప్పాలంటే సిఇసి తన బాధ్యతలను విస్మరించి వ్యక్తిగత స్థాయిలో విమర్శల్లోకి వెళ్లిపోవడాన్ని ఎవరూ సమర్థించలేదు. అన్ని అధికారాలు ఉన్న స్వతంత్ర సంస్థ ఎన్నికల కమిషన్. అలాంటి ఎంతో హుందాగా వ్యవహరించాల్సి ఉందని పలువురు బ్యూరోక్రట్స్ కూడా సూచించారు. అది సద్దుమణిగినా బీహార్ ఓటర్ల జాబితా విషయంలో ఎన్నికల కమిషన్ ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉంది. భారతీయులు కానివారు, మరణించినవారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, ఒకటి రెండు చోట్ల ఒకే వ్యక్తికి ఓటుంటే వారి ఓట్లను తొలగించారు. ఇవన్నీ వాస్తవంగా చేయగలిగి ఉంటే అంతకన్నా పెద్ద ప్రక్షాళన మరేదీ ఉండదు. ఎన్నికల కమిషన్‌ను అభినందించాల్సిందే. ఎప్పుడూ ఏ ఎన్నికకూ లేనట్లు బీహార్ ఎన్నికలపైనా శ్రద్ధ పెట్టడం అటుంచితే ఆగస్టులో ముసాయిదా ప్రచురణకు ముందే బీహార్ ఓటర్ల జాబితాలోంచి 65 లక్షల మంది పేర్లను తొలగించడం, ఎన్నో విమర్శలకు గురైనా సుప్రీంకోర్టు మార్గదర్శకత్వంలో మరికొన్ని జాగ్రత్తలతో నెల రోజులపాటు స్వీకరించిన క్లెయిమ్‌లు,అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియతో మరో 3.66 లక్షల మంది పేర్లను తొలగించడంలో ఎన్నికల కమిషన్ విశేష శ్రమ తీసుకుందనే చెప్పాలి. ఇప్పటికీ ఓటర్లు వ్యక్తిగతంగా వారి వారి హక్కుల కోసం ఎన్నికల కమిషనర్‌ను సంప్రదించవచ్చుననే వెసులుబాటును కూడా ఇచ్చింది. ఏది ఏమయినా బీహార్ ఎన్నికలప్రక్రియకు ముందే ఎన్ని ఆరోపణలున్నా వాటిని అంచెలంచెలుగా సర్దుబాటు చేసుకుని రావడం, అసాంతం కొత్త కొత్త విధానాలకు కమిషన్ శ్రీకారం చుట్టింది. గతంగతః బీహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనలో అనుసరించిన పద్ధతులన్నీ ఇతర రాష్ట్రాలకువర్తింప చేయడంలో ఎన్నికల కమిషన్ ఔచిత్యాన్ని ప్రశంసించాల్సిందే. తగిన సమయంలో అన్ని రాష్ట్రాలకు ఇదేప్రక్రియ విస్తరించేందుకు కమిషన్ ముందుకువచ్చింది.15రోజుల్లో ఓటర్లకు ఎపిక్ కార్డులను అందచేసేందుకు నడుం కట్టింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందే 17 నూతన సంస్కరణలకు అంకురార్పణ చేయడం విశేషం. ఈవిఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలను వినియోగిస్తారు. పార్టీ ఎన్నికల గుర్తు కూడా రంగుల్లోనే.వందశాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్. ఇవన్నీ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెంచేందుకేనని సిఇసి జ్ఞానేశ్ కుమార్ స్పష్టంచేశారు. ఈ ఎన్నికలు దేశానికే రోల్‌మోడల్ అవుతాయని విశ్వాసంతో ముందడుగు వేస్తున్నారు. వెబ్‌కాస్టింగ్ వల్ల అనుమానాలకు తావుండదు. ఈ ప్రక్రియ మొత్తాన్ని సిసిటివి కెమెరాల్లో రికార్డుచేశారు. ఈవిఎం కౌంటింగ్ యూనిట్లలో ఓట్లులెక్కింపు జరిగినప్పుడు వివిప్యాట్ల వ్యత్యాసం గుర్తించదగినట్లుగా ఉంటే రీకౌంటింగ్‌కు ఆస్కారమిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో నిష్పాక్షికత, పారదర్శకత కోసం తీసుకున్న చర్యలను ఎన్నికల కమిషన్ సభ్యులు ముగ్గురూ దేశానికి తేటతెల్లం చేశారు. నవంబరు 22తో బీహార్ శాసనసభ సభాకాలం ముగుస్తుంది. ఆలోగానే బీహార్ ఎన్నికలు పూర్తి చేసే తలంపుతో నవంబరు 6, 11న పోలింగ్, 14న కౌంటింగ్ జరుగుతుందని ఇసి ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ జారీచేసింది. అయినా సుప్రీంకోర్టు కూడా బీహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. దేశమంతటా ఇదే తరహాలో వాస్తవ ఓటర్ల జాబితా కోసం చేపట్టాలనుకున్న ప్రక్రియను పరిశీలించాలనుకుంటోంది.ఆ నేపథ్యంలోనే బీహార్ తుదిఓటర్ల జాబితా నుంచి తొలగించిన 3.66 లక్షల పేర్లు,వివరాలతో అందచేయాలని సుప్రీం కేంద్ర ఎన్నికలసంఘాన్ని ఆదేశించింది.ఎలక్టోరల్ జాబితాలు పటిష్టంగా ఉంటే ఎన్నికలుఎంత సజావుగా నిర్వహించవచ్చునో బీహార్ ఎన్నికల ద్వారానే దేశానికి వెల్లడించేందుకు ఇసి నడుం కట్టడం అభిలషించదగినదే. ఇప్పుడు బీహార్ ప్రతిష్టాకర అంకంలోకి అడుగు పెడుతోంది. ఎన్‌డిఎ కూటమి అండతో ప్రస్తుత ముఖ్యమంత్రి నితీష్‌కుమార్,మూడోసారి రంగంలోకి దిగుతుండగా, లాలూప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వి నేతృత్వంలో విపక్ష కూటమి కూడా పోటీకి ఉరుకులు పరుగులు తీస్తోంది. వీటన్నిటిని మించి ఎన్నో ఎన్నికల్లో ప్రధాన పార్టీల విజయానికి ప్రభావితం చేసిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిషోర్ 'జనసురాజ్' కూడా పకడ్బందీ వ్యూహంతో ముందుకు కదులుతోంది.



తెలిసినవాడు సత్యం కోసం వాడిగా వేడిగా వాదిస్తాడు. తెలియని వాడు తన అభిప్రాయం కోసం వాదిస్తాడు.

టాల్‌స్టాయ్



మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.

పాస్కల్

## ప్రజావాక్కు



### అప్రమత్తతే మన రక్షణ కవచం

ఇటీవలి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఛింద్వారా జిల్లాలో జరిగిన చిన్నారుల మరణాలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించాయి.ప్రాథమిక విచారణలో ఈమరణాలు కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ సేవనంతో సంబంధం ఉన్నట్లు తేలింది. తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురం జిల్లాలో తయారైన ఈ సిరప్‌లో డైఎథిలీన్ గ్లైకాల్ అనే అత్యంత విషపూరిత రసాయనం అధిక మోతాదులో ఉన్నట్టు ప్రయోగశాల పరీక్షలువెల్లడించాయి. ఈసంఘటన తర్వాత మధ్యప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ మందు విక్రయాన్ని,పంపిణీని, వినియోగాన్ని పూర్తిగా నిషేధించాయి. ఔషధ తయారీ, పంపిణీ వ్యవస్థల్లో పారదర్శకత లేకపోతే ప్రజారోగ్యం ఎంత ప్రమాదంలో పడుతుందో ఈ ఘటన స్పష్టంగా చూపించింది.

- డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ, హైదరాబాద్

### ప్రాణాలు తీస్తున్న ఆస్పత్రులు

జైపూర్‌లోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రి సవాయి మాన్ సింగ్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళనరేపింది.ముఖ్యంగా అత్యవసరచికిత్స అవసరమైన రోగులు ఉన్న విభాగంలో మంటలు చెలరేగడం వలన పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మొదట షార్ట్ సర్క్యూట్ కారణమని చెప్పినా, వాస్తవానికి ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం,అగ్నిభద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, పరికరాలు సరిగా పనిచేయకపోవడం వంటిఅంశాలే ప్రధాన కారణాలుగా స్పష్టమవుతున్నాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో రోగులను తరలించే ప్రయత్నాలు జరిగినా గందరగోళం కారణంగా పరిస్థితిని అదుపులోకి తేలికగా తీసుకురాలేకపోయారు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### న్యాయమూర్తి మీద దాడి అమానుషం

సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్‌బి.ఆర్. గవాయ్ పై జరిగిన దాడి రాజ్యాంగం, దేశంపై జరిగిన దాడే అని చెప్పవచ్చు. ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయటంతో దేశ రాజ్యాంగాన్ని ఏమైనా చేయగలమనే ఉన్మాదానికి తెగించారు. బి.ఆర్. గవాయ్‌పై జరిగిన దాడిని అందరూ తీవ్రంగా ఖండిస్తున్నారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని కోరుకుందాం.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ఆచి తూచి మాట్లాడాలి

రాజకీయ నాయకులు ఓట్లకోసం పదవులకోసం ఏదైనా మాట్లాడతారు. కాని బాధ్యతాయుతమైన పదవులలో నున్నవారు ఆచి తూచి మాట్లాడాలి. ఆపరేషన్ సిందూర్ మరోమారు సంభవిస్తే పాకిస్థాన్ అనే దేశం ఉండదని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఓ వేదిక మీద అన్నారు. కాని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పాకిస్థాన్‌ను ధ్వంసం చేస్తామని ప్రకటించడం సబబు కాదేమోనని అనిపిస్తోంది. నిజంగా మరోసారి యుద్ధమే సంభవిస్తే పాకిస్థాన్‌కు ఏలా బుద్ధి చెప్పాలో ప్రభుత్వమే సంకేతాలు ఇస్తుంది. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం సైనికులుకు యుద్ధంజరుగుతున్నప్పుడే. యుద్ధం అంటూ వస్తే భారత్‌ను సర్వనాశనం చేస్తామని పాక్ మంత్రి ఒకరు అన్నారని వార్త. భారత్‌తో పాకిస్థాన్ ఎన్నో యుద్ధాలు చేసింది. ఒక్కటైనా గెలవగలిగిందా? అమెరికా, సౌదీ అరేబియా, ఇరాన్ అండదండలు చూసుకుని పాక్ పేట్రేగిపోతున్నది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అమెరికా ఆర్థిక మాంద్యం

జరుగుతున్న పరిణామాలు చూస్తే అలాగే అనిపిస్తోంది దానికి కారణాలు రెండు ఉన్నయి.ఒకటి ఆధిపత్య ధోరణికి ప్రపంచం బయపడడం లేదు రెండు వర్ధమాన దేశాలు అమెరికా వంటి అగ్ర దేశపు డాలర్‌ను ఉమ్మడి ఆర్థిక వస్తువుగా లేదా ఉమ్మడి చెల్లుబాటు నాణెంగా గుర్తించడానికి నిరాకరిస్తున్నాయి. అందుకే ఆసియాన్ అభివృద్ధి బ్యాంక్ ఏర్పడింది. ఇప్పుడు ఎస్ సీవో అభివృద్ధి బ్యాంక్ కూడా ఫామ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆఫ్రికన్ కూటమిని జీ20 దేశాల కూటమిలోకి ఆహ్వానించి భారత్ ముందడుగు వేసింది. ఇప్పుడు అమెరికా నిజానికి మేకపోతు గాంభీర్యం తప్ప ఏమీ చేయలేకపోతోంది.

-యారా కొమురయ్య, అక్కపల్లిగూడెం

### వికలాంగులకు రక్షణ కల్పించాలి

వికలాంగుల హక్కుల చట్టాలను కఠినతరం చేయాలి. వికలాంగుల ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారు. దూషిస్తున్నారు. గ్రామపంచాయతీ నుండి మంచి నీటి కోసం సొంతగా తీసుకున్న నల్లా కలెక్షన్ పైప్‌కు రంధ్రాలు చేసి వికలాంగుల ఇళ్లకు మంచి నీళ్లు రాకుండా చేస్తున్నారు.అధికారులకు, ప్రజాప్రతినిధులకు, పోలీస్‌లకు ఫిర్యాదు చేసినా కూడా ఎవరు పట్టించుకోవడం లేదు. పోలీస్ స్టేషన్ నుండి వికలాంగులకు రక్షణ కలిపించాలి.

- రాపాక రవీందర్, జనగాం

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జీవన ప్రమాణానికే కాటు..గుండెపోటు

**గుండెపోటు ఇప్పుడు చిన్న,మధ్య వయస్కుల జీవితాలను దెబ్బతీస్తోంది. ఛాతీనొప్పి, చేయి లేదా దవడ వరకు నొప్పి రావడం, ఆకస్మాత్తుగా ఆయాసం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్త పడాలి. ముందస్తు గుర్తింపు ప్రాణాలను కాపాడుతుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నా, జీవనశైలి సరిగా లేకపోయినా, ఈసీజీ, కొలెస్ట్రాల్,రక్తపోటు వంటి కీలకమైన పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ఆరోగ్యకరమైన ఆహారం, చురుకైన జీవనం గుండె పోటు ప్రమాదాన్ని సగానికి తగ్గిస్తాయి. పొగాకును మానేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం కేవలం మందులు వాడ టం కంటే మెరుగైన ఫలితాన్నిస్తాయి. పెరుగుతున్న ఈ మరణాలకు తక్షణమే పరిష్కారం చూపాలి. గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టడం, మనందరి ప్రవర్తనలో మార్పురావడం రాబోయే దశాబ్దంలో అత్యంత కీలకం.**

డి జయరాం

గుండెపోటు ఈ రోజుల్లో ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. ఇది కేవలం వృద్ధులకే కాకుండా, చిన్న వయసు వారికి కూడా వస్తోంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అకాల మరణాల సంఖ్య అకస్మాత్తుగా పెరుగుతోంది. ఇటీవల, కర్ణాటకలోని హాసన్ జిల్లాలో కేవలం 40 రోజుల్లో 22 మంది గుండెపోటుతో మరణించారు. వీరిలో దాదాపు సగం మంది 45ఏళ్ల లోపు వారు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ భయంకరమైన పరిస్థితిని గమనిస్తే, మన దేశం ఈ హృదయ సంబంధిత జబ్బుల ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది.మనదేశంలో గత మూడు సంవత్సరాలుగా గుండెపోటు మరణాలు విపరీతంగా పెరిగాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తెలిపిన వివరాల ప్రకారం, 2022లో గుండెపోటు కారణంగా 32,457 మంది మరణించారు. ఇది అంతకుముందు సంవత్సరంలో నమోదైన 28,413 మరణాల కంటే చాలా ఎక్కువ. ఈ నివేదిక ప్రకారం 2022లోనే గుండెపోటు కేసులలో 12.5పెరుగుదల నమోదైంది. ప్రపంచ గణాంకాలలో భారతదేశం హృద్రోగ మరణాల రేటులో రెండవ స్థానంలో ఉంది. మన దేశంలో ఏటా మరణిస్తున్న వారిలో సుమారు 20శాతం పురుషులు,17శాతం స్త్రీలు ఉన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక ప్రకారం మన దేశంలో స్త్రీల కంటే పురుషులలో హృదయ సంబంధిత మరణాల రేటు ఎక్కువగా ఉంది. లక్ష మందిలో పురుషులలో 349 మంది, స్త్రీలలో 265 మంది మరణిస్తున్నారు. ఈ రేట్లు యూనైటెడ్ స్టేట్స్ కంటే రెండు నుండి మూడు రెట్లు ఎక్కువగా ఉండటంగమనార్హం. దేశంలో అకస్మాత్తుగా సంభవించే మరణాలలో దాదాపు 57 శాతం కేవలం గుండెపోటు వల్లే జరుగుతున్నాయి. మరణిస్తున్న వారిలో ఎక్కువ మంది 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులైన పురుషులే ఉన్నారు. అంతేకాకుండా 2020 నుంచి 2023 మధ్య వచ్చిన గుండెపోటు కేసుల్లో దాదాపు సగం మంది 40 ఏళ్లలోపు వారే. ఇది యువతలో గుండె జబ్బులు వేగంగా, తక్కువ వయసులోనే వస్తున్నాయనే ప్రమాదకరమైన వాస్తవాన్ని తెలియజేస్తోంది. ముఖ్యంగా, 30ఏళ్ల లోపువారిలో మరణాలు గత కొన్ని సంవత్సరాలలో 40 శాతంపెరిగాయి. గుండెపోటు మరణాలు ప్రధానంగా మహారాష్ట్ర, కేరళ, గుజరాత్ రాష్ట్రాలలో ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ జాబితాలో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు వంటి ఇతర పెద్ద రాష్ట్రాలలో కూడా వేల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ సంక్షోభం కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా దేశంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించి ఉందని ఇది నిరూపిస్తుంది. జీవనశైలి, జనాభా, ఆరోగ్య సంరక్షణ సదుపాయాల కొరత వంటి కారణాల వల్ల పశ్చిమ, రాష్ట్రాలపై దీని ప్రభావం ఎక్కువ కనిపిస్తోంది. హాస్పిటల్ అధ్యయనాలు కూడా 2020 నుంచి దాదాపు సగం మంది గుండెపోటు రోగులు 40ఏళ్లలోపు వారే అనిచెబుతున్నాయి. గతంలో హృద్రోగాలు వృద్ధులకే వస్తాయనే భావన ఉండేది. కానీ ఇప్పుడు గుండె సమస్యలతో యువకులు అకాల మరణాలకు గురవుతున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం.ముఖ్యంగా, యువతలో గుండెపోటు సమస్యప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. చాలా మందికి తమకు ప్రమాదం ఉందని కూడా తెలియదు.యువ నిపుణులు, విద్యార్థులు, కార్మికులు వంటి వివిధ వర్గాల వారు కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్నారు. దేశంలో గుండెపోటు కేసులు పెరగడానికి ఒకదానితో ఒకటి



ముడిపడి ఉన్న అంశాలు దోహదపడుతున్నాయి. అందులో ముఖ్యమైనవి ఫాస్ట్‌ఫుడ్, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు,చక్కెర పానీయాలతో నిండిన ఆధునిక జీవనశైలి యువతలో ఊబకాయం, అధిక రక్తపోటు, అనారోగ్యకరమైన కొవ్వునిల్వలకు (లిపిడ్ ప్రొఫైల్‌లో తేడాలు) దారితీస్తున్నాయి. యువత తమ దినచర్యలో ఎక్కువ భాగాన్ని పనిలో లేదా విశ్రాంతి పేరుతో కూర్చుని గడుపుతున్నారు. ఇది బరువు పెరగడానికి, హృదయనాళ ఫిట్‌నెస్‌లో క్షీణతకు, తద్వారా గుండె సమస్యలకు దారితీసే ప్రమాదాన్ని పెంచుతుంది. పొగాకు వినియోగం, మాదకద్రవ్యాలు, మద్యం వాడకం మరొక ముఖ్య కారణం. ఉద్యోగాల్లో ఒత్తిడి, ఎక్కువ పని గంటలు, సరైన విశ్రాంతి లేకపోవడంవల్ల దీర్ఘకాలికంగా ఒత్తిడి పెరిగి గుండె ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది.దీర్ఘకాలిక ఒత్తిడి అనేక విధాలుగా గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది.డిప్రెషన్‌ను ఎదుర్కొంటున్న యువకులకు, డిప్రెషన్ లేని వారితో పోలిస్తే, గుండె జబ్బులు వచ్చే అవకాశాలు రెండింతలు ఎక్కువగా ఉన్నాయని కొత్త అధ్యయనాలు కనుగొన్నాయి.దీనికితోడు, వంశపారంపర్యంగా ప్రజలకు గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో సరైన అత్యవసర సేవలు, గుండె పరీక్షా కేంద్రాలు లేకపోవడం వల్ల చికిత్స అందించడంలో ఆలస్యం అవుతోంది. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, గుర్తించని దీర్ఘకాలిక జబ్బులు అధిక సంఖ్యలో ఉన్నాయి. అధిక రక్తపోటు,డయాబెటిస్ వంటివి చాలా మందిలో అసలున్నట్లు కూడా గుర్తించడం లేదు. ఒకవేళ గుర్తించినా 20శాతంకంటే తక్కువ మంది మాత్రమే వాటిని అదుపులో ఉంచుకుంటున్నారు.ఈ ప్రమాదకరమైన పరిస్థితిని మార్చడానికి తక్షణమే అనేక చర్యలు తీసుకోవాలి. మొదటగా, పెద్దఎత్తున గుండె ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. గుండెఆరోగ్యం గురించి, దానిలక్షణాల గురించి ప్రజల్లో విస్తృతంగాప్రచారం చేయాలి. అంతేకా కుండా పనిప్రదేశాలు, పాఠశాలల్లో తగిన ఆరోగ్య చర్యలు తీసుకోవాలి. అంటే, ఆఫీసులు, స్కూళ్లలో సరైనపని వేళలు, ఒత్తిడిని తగ్గించే పద్ధతులు, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉండేలా చూడాలి. తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, పండ్లు,కూరగాయలతో కూడిన సమతుల్య ఆహారం హృద్రో గాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. ప్రపంచఆరోగ్య సంస్థ పెద్దలందరికీ ప్రతివారం కనీసం 150 నిమిషాల మితమైన వ్యాయామం చేయాలని సిఫార్సు చేసింది. ధూమపానం మానేయడం హృదయ సంబంధవ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆల్కహాల్ అధిక వినియోగం హృదయ సంబం ధిత వ్యాధులకు దోహదం చేయడంతో పాటు,రక్తపోటుకు కూడా దారితీస్తుంది. చిన్న పట్టణాలు, గ్రామాల్లో అత్యవసర ఆరోగ్య సేవలు, గుండె జబ్బుల మందులు తక్కువ ధరలో అందేలాచూడాలి.అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం,స్క్రీన్‌సమయాన్ని తగ్గించడంవల్ల బరువుతగ్గడం,ఇతర సమస్యలు దూరమవుతాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలిసి పేదలకు సబ్సిడీ ఆరోగ్య సేవలు, ఉచిత స్క్రీనింగ్ క్యాంపుల నిర్వహణను తమ ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకోవాలి. గుండెపోటు ఇప్పుడు చిన్న,మధ్య వయస్కుల జీవితాలను దెబ్బతీస్తోంది. ఛాతీ నొప్పి, చేయి లేదా దవడ వరకు నొప్పిరావడం, అకస్మాత్తుగా ఆయాసం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తపడాలి. ముందస్తు గుర్తింపు ప్రాణాలను కాపాడుతుంది.కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నా, జీవనశైలి సరిగా లేకపోయినా, ఈసీజీ, కొలెస్ట్రాల్,రక్తపోటు వంటి కీలకమైన పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ఆరోగ్యకరమైన ఆహారం, చురుకైన జీవనం గుండె పోటు ప్రమాదాన్ని సగానికి తగ్గిస్తాయి. పొగాకును మానేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం కేవలం మందులు వాడటం కంటే మెరుగైన ఫలితాన్నిస్తాయి. పెరుగుతున్న ఈ మరణాలకు తక్షణమే పరిష్కారంచూపాలి. గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టడం, మనందరి ప్రవర్తనలో మార్పురావడం రాబోయే దశాబ్దంలో అత్యంత కీలకం. ●

# కుండపోత వర్షాలతో రైతాంగం విలవిల

మేకిరి దామోదర్

దేశవ్యాప్తంగా వాతావరణ మార్పులు భూగోళానికి సవాలు విసురుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు ఒకవైపు, అకాల వర్షాలు మరోకవైపు. ఈ రెండింటి దెబ్బకు ఋతువులు గతి తప్పుతున్నాయి. ప్రకృతి పగబట్టి అన్నదాతల ఆరుగాలం శ్రమను ముంచేస్తోంది. దీని ప్రభావంతో దేశంలో ఆహార ద్రవ్యోల్బణం పెరిగి, కూరగాయల ధరలు ఎగిసే అవకాశం ఉందని క్లైమేట్ ట్రెండ్స్ నివేదిక హెచ్చరించింది. 2022-23లో వేడి తీవ్రత సాధారణంకంటే 30రెట్లు అధికంగా నమోదైంది.గత 40ఏళ్లలో 30శాతం జిల్లాల్లో తక్కువ వర్షపాతం, మరోవైపు కొన్ని జిల్లాల్లో అతివృష్టి పెరిగిందని గణాంకాలు తెలుపుతున్నాయి. వర్షాధారంగా సాగుచేస్తున్న 15-40శాతం ప్రాంతాల్లో 2050 నాటికి ప్రస్తుత పద్ధతులు అనుకూలం కాని పరిస్థితి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది వానాకాలం ప్రారంభంలో నిరాశ పరిచినా, చివర్లో విరుచుకుపడి రైతులను ముంచింది. జూన్‌లో వర్షాల మధ్య విరామాలుఉండగా, తర్వాత ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనాలు, ద్రోణాలతో రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాలు కురిశాయి. రాష్ట్ర సగటు వర్షపాతం 740.6 మి.మీ. కాగా,33శాతం అధికంగా 988.3 మి.మీ. నమోదైంది. నైరుతి రుతుపవనాలు తిరుగుముఖం పట్టగా, అక్టోబర్15లోపు పూర్తిగా నిష్క్రమించనున్నాయి. నారాయణపేట జిల్లా మరికల్‌లో 64.8 మి.మీ., మహబూబ్‌నగర్ మూసాపేటలో 63.6 మి.మీ., దేవరకద్రలో 63.1 మి.మీ. వర్షపాతం నమోదయింది. రాష్ట్రవ్యాప్తంగా 137 మండలాల్లో అత్యధిక వర్షాలు (60పైగా), 294 మండలాల్లో అధిక వర్షాలు (20-59 ), 187 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఇలా ప్రకృతి పగతో రైతులు విలవిలలాడుతున్నారు. ముందస్తు వర్షాలు, అధిక వర్షాల పరిస్థితుల్లోనూ రైతన్నకు నష్టమే. మొదట్లో పత్తి సాగు ఉత్సాహంగా సాగినప్పటికీ, రెండు నెలల వర్షాభావం పంటల ఎదుగుదల దెబ్బతీసింది. ఇప్పుడు తిరిగి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు పంటలను పూర్తిగా నాశనం చేస్తున్నాయి. పత్తి చేలల్లో మొలకలు వస్తున్నాయి,మొక్కజొన్న కుళ్లిపోతోంది.మిర్చి మొక్కలు కాయలతోనే కూలిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 45.47లక్షల ఎకరాల్లో పత్తి,6.44 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.2 లక్షల ఎకరాల్లో మిరప సాగు జరిగింది. పంటలపై క్రమపద్ధతిలో వర్షాభావం-అతివృష్టి దెబ్బ తగిలి రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. నీటితో నిండిన పొలాల్లో వేర్లు ఊపిరాడక పంటలు పాడైపోతున్నాయి. పత్తిలో రసంపీల్చే పురుగులు,మొక్కజొన్నలో కాండం కుళ్లు వ్యాపించాయి.ఇది కేవలం వ్యవసాయ సమస్య మాత్రమేకాదు, వాతావరణ సంక్షోభానికి సంకేతం కూడా. అకాల వర్షాలు, భూకంపాలు, ఆమ్లవర్షాలు ఇవన్నీ మానవ జాతి మనుగడకే ముప్పుతెస్తున్నాయి. ఈ పరిణామాలపై ప్రపంచ స్థాయిలో చర్చించి నివారణ చర్యలు చేపట్టడం అత్యవసరం.ప్రభుత్వాలు శీఘ్రప్రగతి పేరుతో సహజ వనరుల నాశనానికి దారితీసే పారిశ్రామికీకరణను నియంత్రించాలి.భూతాప ఉద్గారాలను తగ్గించే విధానాలు రూపకల్పన చేయాలి. వాతావరణ మార్పులను తట్టుకునే రకాలవిత్తనాలను ప్రోత్సహించి, గ్రీన్‌హౌస్ సాగు, రక్షిత వ్యవ సాయ పద్ధతులు విస్తరించాలి.రైతులకు కోల్డ్‌స్టోరేజీలు, శీతల రవాణా వసతులు, మెరుగైన సరఫరా గొలుసు వ్యవ స్థలు అందుబాటులో ఉండాలి.మానవ మనుగడను కాపాడేమార్గం ప్రకృతిని గౌరవించడం ద్వారానే సాధ్యం. అందరూ తమవంతు బాధ్యత నిబద్ధతతో నిర్వర్తించినప్పుడే జీవకోటి నిలబడగలదు. ●

# న్యాయవ్యవస్థలో పారదర్శకత పెరగాలి

శిరందాసు నాగార్జున

దేశంలో ఎన్నడూ లేనంతగా న్యాయవ్యవస్థ కొంతమంది న్యాయమూర్తులు అవినీతికి పాల్పడుతున్నారనే అపప్రథ తలకెత్తుకుంది. హైకోర్టులతోపాటు సుప్రీం కోర్టు ఇచ్చిన కొన్నితీర్పులు, చేసిన వ్యాఖ్యానాలు విస్మయం కలిగిస్తున్నాయి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగు మూల స్తంభాలు. వీటిలో ఏ ఒక్కటీ మరొకదాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం చేసినా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. ముఖ్యంగా అస్థిరమైన రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా న్యాయవ్యవస్థ ఉండాలి. ఆదిశగా న్యాయవ్యవస్థ స్వీయప్రక్షాళనకు దిగింది. అయినా, న్యాయం అందరికీ సమానంగా అందుతుందా? బెయిల్ విషయంలో పేదవాడికి ఒక రకంగా, రాజకీయ నాయకుడు, ఆర్థిక నేరగాళ్లకు ఒక రకంగా ఉంటుందన్న అనుమానాలు ఉన్నాయి. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం, జైళ్లపాలు కావడంతో, న్యాయమూర్తులు తమకు అనుకూలమైన వారుగా ఉండాలనే భావన వారిలో మొదలైంది. ఈరకమైన ఆలోచనలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. అయినా, న్యాయవ్యవస్థలో ప్రభుత్వం జోక్యానికి ఎమర్జెన్సీ కాలంలోనే బీజం పడింది. అప్పటి ప్రధానమంత్రి ఎన్నికను అలహాబాద్ కోర్టు రద్దు చేసింది. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో తీర్పుతమకు అనుకూలంగా రావాలన్న ఆలోచన ఆనాటి ప్రభుత్వ పెద్దల్లో వచ్చింది. దాంతో,అప్పుడు సీనియారిటీ ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని కాదని, 4వ స్థానంలో ఉన్న జడ్జిని ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఆ నియామకాన్ని వ్యతిరేకిస్తూ,సీనియర్ జడ్జీలు రాజీనామాలు చేశారు. అప్పటి నుంచి కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా, జడ్జీల నియామకాల్లో, బదలీల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ వస్తోంది. అవినీతికి పాల్పడిన కొందరు రాజకీయ నాయకులు, వ్యాపారులు న్యాయమూర్తులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. రూ.1.9 కోట్ల మోసం కేసులో సరైన ఆధారాలు లేకుండా నిందితులైన దంపతులకు బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ సెషన్స్ కోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులకు గత సెప్టెంబరు నెలలో సుప్రీం కోర్టు శిక్ష విధించింది. గతంలో కూడా అనేక సంఘటనలు జరిగాయి. 2009లో అప్పటి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు ఆరోపణలు రావడంతో, ఆయన రాజీనామా చేశారు. అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి ఒకరు 2011లో రాజీనామా చేశారు.రాజ్యసభ అభిశంసనకు గురైన తొలి న్యాయమూర్తిగా ఆయన నిలిచారు. ఓబులాపురం మైనింగ్ కేసులో నిందితుడు గాలి జనార్ధన రెడ్డి ప్రలోభాలకు లోనై బెయిలు ఇచ్చిన కేసులో 2012లో నలుగురు జడ్జీలు అరెస్ట్ అవడం అప్పట్లో సంచలనం కలిగించింది. ఇటీవల అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఇంట్లో కోట్ల



రూపాయల నోట్ల కట్టలు దొరికాయి. ఆయనపై రాజ్యసభలో, లోక్‌సభలో వివిధ రాజకీయ పార్టీలు అభిశంసన నోటీసులు కూడా ఇచ్చాయి. ఇవన్నీ బహిరంగమైన అంశాలు. న్యాయమూర్తుల అవినీతికి సంబంధించిన అన్ని అంశాలు వెల్లడికావు. ఇందుకు సంబంధించి వారికి అంతర్గత విచారణ వ్యవస్థ ఒకటి ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులపై ఫిర్యాదులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి మాత్రమే చేరతాయి. న్యాయవ్యవస్థ పనితీరు, అవినీతి ఆరోపణలకు సంబంధించి 2017 జనవరి 1నుంచి 2021 డిసెంబర్ 31వరకు 1631 ఫిర్యాదులు అందాయి. కేంద్ర మంత్రి లోక్‌సభకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ద్వారా ఈ విషయాలు తెలిశాయి. అయితే, అంతర్గత విచారణ వ్యవస్థ రహస్యంగా ఉంటుంది. అందువల్ల, ఈఫిర్యాదులపై విచారణ ఏ స్థాయిలో ఉందో, ఏ రకమైన చర్యలు తీసుకున్నారో బయటకు తెలియదు. ఇంతేకాకుండా, కోర్టు వ్యాఖ్యలు, తీర్పులపై కూడా అనేక భిన్నమైన విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెళ్లైన తర్వాత భార్య అయినా, భర్త అయినా మరొకరితో ఇష్టంగా శృంగారంలో పాల్గొంటే నేరం కాదని సుప్రీం కోర్టు పేర్కొంది. భార్య అనుమతి లేకుండా ఆమెతో భర్త అసహజ శృంగారం జరపడం నేరం కాదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కుల వ్యవస్థపై నిర్మితమైన మన సమాజంలో న్యాయమూర్తుల నియామకాల విషయంలో కూడా కొందరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.2018 నుంచి మొత్తం 715 మంది హైకోర్టు న్యాయమూర్తులను నియమించారు. వారిలో 551 మంది (77.06 ) అగ్రవర్ణాలకు చెందినవారే ఉన్నారని కేంద్ర న్యాయశాఖ మంత్రి ఈ ఏడాదిలో మార్చిలో రాజ్యసభలో వెల్లడించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్ తెలిపిన ప్రకారం, 2018 నుంచి ఈ ఏడాది జూలైవరకు హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన 743 మందిలో 93 మంది ఓబీసీలు (12.5 శాతం) మాత్రమే ఉన్నారు. పదవీవిరమణ చేసిన వెంటనే కొందరు న్యాయమూర్తులు పదవులలో నియమితులు కావడం పలు విమర్శలకు గురౌతోంది. ఆ విధంగా ప్రభుత్వ పదవులు పొందడం మంచి పద్ధతి కాదు. ఆ పదవులు ఆశించే,న్యాయమూర్తులు పదవిలో ఉండగా, ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు అనుకూలంగా తీర్పులుఇచ్చే అవకాశం ఉంటుందని ప్రజలు భావించే అవకాశంఉంది.మరోవైపు, రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయవ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోయేలా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులకు చెందిన 21 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు, 600 మంది న్యాయవాదులు గత ఏడాది ఏప్రిల్‌లో సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. అనవసర ఒత్తిళ్ల నుంచి న్యాయవ్యవస్థను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ ఏ విధమైన ఒత్తిళ్లకు లొంగకుండా న్యాయవ్యవస్థ పవిత్రత, స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవలసిన బాధ్యతను గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో, లోపాలను సరిదిద్దడంతోపాటు న్యాయవ్యవస్థ స్వతంత్రను కూడా కాపాడాలి. న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లకుండా ఉండేందుకు అటు రాజకీయ వ్యవస్థ, ఇటు న్యాయ వ్యవస్థ తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో, న్యాయవ్యవస్థ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, విశ్వసనీయతను పరిరక్షించడంలో పలువురు న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం నుండి ఎలాంటి పదవులు తీసుకోరాదని బహిరంగంగా ప్రతిన చేశారు. అలాగే, 21 మంది న్యాయమూర్తులు వారి ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఆ వివరాలను సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఇవన్నీ స్వాగతించదగినవే. ఈ విధంగా న్యాయవ్యవస్థ స్వీయ ప్రక్షాళన ఆవశ్యకత ఎంతో ఉంది. ●

# గుంటూరు వార్త



## ప్రతి మంగళవారం మహిళా గ్రీవెన్స్

### --మహిళా సాధికారతే లక్ష్యం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 8,ప్రభాతవార్త : స్థానిక పశ్చిమ నియోజకవర్గంలోని టిడిపి కార్యాలయంలో ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా "మహిళా గ్రీవెన్స్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో బుధవారం ఎన్డీఏ కూటమి మహిళా నేతలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న మహిళల సమస్యలను నేరుగా విని పరిష్కరించాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని,నియోజకవర్గంలోని ప్రతి మహిళా తన సమస్యను ధైర్యంగా ముందుకు తీసుకురావాలన్నారు.మంగళవారం జరిగే మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.మహిళా సాధికారతే నా ప్రాధాన్యం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వారికి అండగా నిలబడే నాయకులకే నిజమైన గుర్తింపు లభిస్తుందని గళ్ళా మాధవి స్పష్టంచేశారు.మహిళా సాధికారత,భద్రత,స్వయం సహాయక సంఘాల బలోపేతం వంటి అంశాలపై నిరంతరం పనిచేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

## కల్తీ మద్యానికి మూల విరాట్ జగన్

### --ఏపిఐడిసి చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 8,ప్రభాతవార్త : ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు నకిలీ మద్యం తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటుంటే,పలువురిని అరెస్టుచేసి చట్టపరిధి చర్యలపై ప్రభుత్వం కనిపెట్టకుండ అవలంభిస్తున్నదని ఏపిఐడిసి చైర్మన్ డేగల ప్రభాకర్ పేర్కొన్నారు.బుధవారం అర్బన్ టిడిపి కార్యాలయంలో విలేకర్లతో డేగల మాట్లాడారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టిడిపి నాయకులు దాసరిపల్లి జయచంద్రారెడ్డి,కట్టా సురేంద్ర నాయుడులను పార్టీ నుండి సస్పెండ్ చేసి,తగిన విచారణచేపట్టాలని నిర్ణయించడం జరిగిందని గుర్తుచేశారు.వైఎస్ఆర్ హయాంలో విజయవాడలో మీ పార్టీఎమ్మెల్యే మల్లాది విష్ణు కు సంబంధించిన బార్ లో కల్తీమద్యం వల్ల 6గురు చనిపోతే సమర్ధించలేదా జగన్ అని ప్రశ్నించారు.మల్లాది ని ఎందుకు సస్పెండ్ చేయలేదు? మీకు మద్యం మాఫియాలో భాగస్వాములు కాబట్టేకదా? కల్తీ మద్యంలో నిందితులుగా ఉన్న వైఎస్సీపీ ఎంపి మిథున్‌రెడ్డి,చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివైఎస్సీపీ నుంచి జగన్‌రెడ్డి ఎందుకు సస్పెండ్ చేయలేదు.జంగారెడ్డి గూడెంలోనే కల్తీ సారాతాగి 27మంది పేదల ప్రాణాలు పోతే చర్యలు తీసుకోకుండా సమర్ధించావు.జగన్ ఐదేళ్ల పాలనలో విషపూరిత మద్యం తయారుచేసి రూ.3500కోట్లు కొల్లగొట్టారు.మద్యం తాగినవారు నరాల వ్యాధి,కిడ్నీవ్యాధులు,కాలేయం వ్యాధులతో 30వేల మంది పేదలు మరణించారు.అలాగే విషపూరిత మద్యంవల్ల రాష్ట్రవ్యాప్తంగా 35లక్షల మంది ఆరోగ్యాలు ధ్వంసమయ్యాయి.జగన్ పాలనలో లక్షల సంఖ్యలో బెల్ట్ షాపులు నడిచాయి.కూటమి ప్రభుత్వంలో బెల్ట్ షాపులు నడిపిన వారిపై జరిమానా విధించి, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.



## 'సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటుదాడికి యత్నంఅత్యంత ఆందోళనకరం'

గుంటూరు కల్చరల్,అక్టోబర్ 8,ప్రభాతవార్త : దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పై సనాతన ధర్మ న్యాయం తలకెక్కించుకున్న న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన ఘటన అత్యంత ఆందోళనకర విషయమని అవగాహన సంస్థ ఖండిస్తుంది.సుప్రీంకోర్టులో ఒక కేసు సందర్భంగా వాదనలు జరుగుతుండగా మతతత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎటువంటి జంకు భయం లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వద్దకు దూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తిచేస్తుంది.రాజ్యాంగ రక్షణను అభిలషించే ప్రతి ఒక్కరూ చీఫ్ జస్టిస్ పై దాడిని ఖండించాలని అవగాహన సంస్థ ఖండిస్తుంది.

## కెఎల్ వర్సిటీలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు

తాడేపల్లి,అక్టోబర్ 8,ప్రభాతవార్త : ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం కెఎల్ యూనివర్సిటీలో మానసిక ఆరోగ్యం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ క్లినికల్ సైకాలజిస్టు జి.హరిత ముఖ్యఅతిధిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఫిజికల్ హెల్త్‌తోపాటు మానసిక ఆరోగ్యంపై శ్రద్ద తీసుకుంటే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా



చేరుకుంటారన్నారు.మానసిక ఆరోగ్యాన్ని విద్యార్థులు ఎలా అభివృద్ధి పరచుకోవాలో డాక్టర్ హరిత తెలియజేశారు.అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలియజేసి మానసికారోగ్యం పట్ల అవగాహన పెంపొందించారు.ఎఫ్ఇడి ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏ విద్యార్థులైతే మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించి..అభివృద్ధి చేసుకుంటారో వారు సరైనా నిర్ణయాలు తీసుకుని ఒతి డిని అధిగమించగలరని తెలిపారు.కార్యక్రమంలో వర్సిటీ విసి డాక్టర్ పార్ధసారధి వర్మ,ఆచార్య ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ రాజశేఖరరావు,డాక్టర్ ఎన్.వెంకటరామన్,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కె.ఆర్ఎస్ ప్రసాద్, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఏ.జగదీష్,ఎఫ్ఇడి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి,విభాగాధిపతి డాక్టర్ పవన్‌కుమార్,కి నికల్ సైకాలజీ ట్రైనీస్ నిఖిల్‌రెడ్డి,మాధురి,శిరీష,యూనివర్సిటీ సైకాలజిస్టులు శంకరి,శరీష,రాజేశ్వరీ,శ్రీనాథ్,మౌనిక,భాను,విజయరత్నం,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయ పంటల్లో అంటు కట్టె పద్ధతిపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం

తాడేపల్లి,అక్టోబర్ 8,ప్రభాతవార్త : కెఎల్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.హెయిర్‌లూమ్ కంపెనీ ద్వారా నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రధానంగా వివిధ కూరగాయల పంటల్లో అంటు కట్టె పద్ధతి దా్వరా కూరగాయల్లో నర్సరీని తయారు చేయడం నేర్పించారు. అంటుకట్టె రోబోట్లు ఏవిధంగా అంటుకట్టడంలో ఉపయోగించుకోవచ్చు అనే విషయంపై విద్యార్థులకు ప్రత్యేకంగా చూపించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ పార్ధసారధి వర్మ,ఆచార్య డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ రాజశేఖరరావు,డాక్టర్ ఎన్.వెంకట రామన్,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్,వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.రత న్నప్రసాద్,విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ పాల్గొన్నారు.





## 'చిల్లపల్లి' కుమార్తె వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 8: ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) ఛైర్మన్, మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇంఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు చాముండేశ్వరి, సాయి వివేక్ లను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.





జిల్లా ఎస్పీగా నియమితులైన వకుల్ జిందాల్ ని మర్యాద పూర్వకంగా కలుసుకొని,మొక్కను బహూకరించిన పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి (గుంటూరు క్రైమ్, పభాతవార్త)

## సిబార్‌లో దంత వైద్య కళాశాల్లో వైద్య వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు విద్య,అక్టోబర్ 8,ప్రభాతవార్త : సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవాలను పురస్కరించుకొని నేటినుంచి 15వ తేది వరకు దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తెలిపారు.కళాశాల్లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన



వివరాలను వెల్లడించారు.ఈ ప్రదర్శనతో ప్రజలకు,విద్యార్థులకు దంత వా్యధులు,నిరా్ధరణ ,నియంత్రణ,చికిత్సా విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు.దంత వైద్య సమస్యలు అధునాతన చికిత్సా విధానాలైన ఇంప్లాంట్స్,రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్,కాస్మెటిక్ డెంటిస్ట్రీ,లేజర్ ట్రీట్‌మెంట్ తదితరాలపై అవగాహన కల్పించబడును అని తెలిపారు.దంత వ్యాధుల మరియు వైద్యానికి సంబంధించిన వివిద సందేహాలను ప్రత్యేక స్పెషలిస్టులు నివృత్తి చేస్తారన్నారు.ఈ ప్రదర్శనను సందర్శించే ప్రజలకు ఉచిత పరీక్షలు,కాసె్మటిక్ చికిత్సలు మినహా అన్ని రకాల దంత వైద్య చికిత్సలు ఉచితంగా అందించబడాయన్నారు.ఈ సదవకాశాన్ని ప్రజలందరూ సది్వనియోగం చేసుకోవాలని కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ తెలిపారు.

## ఎస్సీలకు అత్యున్నత స్థానాలను జీర్ణించుకోలేకే సిజేఐ గవాయ్ పై దాడి

గుంటూరు విద్య,అక్టోబర్ 8,ప్రభాతవార్త : ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు అత్యున్నత స్థానాలను జీర్ణించుకోలేకే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ పై దాడికి ప్రయత్నం జరిగిందని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసుబాబు మాదిగ అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై రాకేష్ కిషోర్ అనే



న్యాయవాది బూటుతో దాడికి యత్నించడం ఒక ఉన్మాద చర్యగా అభివరి్ణంచారు.ఈ దాడిని భారతన్యాయ వ్యవస్థపై దాడిగా చూడాలన్నారు.ఎస్సీలు ఉన్నత స్థానాల్లో ఉండడాన్ని ఓర్వలేక వివక్ష,ద్వేషపూరిత భావంతో రాకేష్ కిషోర్ దాడికి ప్రయత్నించాడన్నారు.రాకేష్ కిషోర్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటుతో దాడి కి పాల్పడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుతున్నానంటూ వ్యాఖ్యలు చేయడం మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంలో భాగమేనన్నారు.న్యాయమూర్తి పై బూటుతో దాడి చేయడాన్ని సనాతన ధర్మం సమరి్ధస్తుందా అని ప్రశ్నించారు.దేశ ప్రజల దృష్టిని ఆకర్షించడం,సనాతన ధర్మం కాపాడుతున్నానంటూ, ప్రచారం చేసుకోవాలనే తప్పుడు ఆలోచనలతోనే సిజేఐ పై నిందితుడు దాడికి ప్రయత్నించాడన్నారు.సాటివారి పట్ల క్షమాగుణం,సహనం,ఓరు్ప ఉండాలని సనాతన ధర్మం సూచిస్తుందన్నారు.సనాతన ధర్మంలో నైతిక విలువలను గౌరవిస్తూ దాడికి ప్రయత్నించిన రాకేష్ కిషోర్‌ను క్షమించి విడిచి పెట్టాలని ఆదేశించి సిజేఐ గవాయ్ తన క్షమాగుణం,సహనం,హుందాతనాన్ని చూపించారన్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాకేష్ కిషోర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు.

## భారతీయ విద్యార్థులపై జరుగుతున్న దాడులపై కేంద్రం స్పందించాలి

గుంటూరు కల్చరల్,అక్టోబర్ 8,ప్రభాతవార్త : భారతీయ విద్యార్థులపై పెరుగుతున్న నేరాలు జాతి వివక్షదాడులు వారి భద్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని ఈ దాడులపై కేంద్రం మౌనంగా ఉండడం సహించరాని విషయమని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నారై పేరెంట్స్ సమావేశం ఆందోళన ప్రకటించింది.సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.వెంకట రత్నం మాట్లాడుతూ అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఒక భారతీయ మేనేజర్‌ను అత్యంత కిరాతకంగా శిరచ్ఛేదం చేసిన ఘటన,మాస్టర్ డిగ్రీ చదువుతున్న ఒక తెలుగు దంతవైద్యుని గ్యాస్ స్టేషన్‌లో కాల్చిచంపిన విషాద ఘటనను కేవలం వార్తలుగా చూడరాదని అమెరికాలో నివశిస్తున్న భారతీయ వలసదారులు ప్రమాదకర పరిస్థితులకు నిలువుటద్దం అన్నారు.ఎన్నారై పేరెంట్స్ సంఘం అధ్యక్షుడు సిరసవల్లి కృష్ణారావు,విద్యావేత్త ఎస్.రవిబాబు లు భారతీయ సమాజం సంఘటితంగా తమ భద్రతపై గళం విప్పాలని భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.





## ఆర్‌విఆర్ జేసి కళాశాల్లో యూనియన్ బ్యాంక్ నేతృత్వంలో సైబర్‌నేరాలపై అవగాహన

గుంటూరు విద్య,అక్టోబర్ 8,ప్రభాతవార్త : సైబర్ నేరాల రక్షణకు వ్యక్తిగత సమాచార గోప్యత అవసరమని యూనియన్ బ్యాంక్ గుంటూరు రీజియన్ చీఫ్ మేనేజర్ శ్రీకాంత్ పేర్కొన్నారు.ఆర్‌బిఐ ఆదేశాల మేరకు స్థానిక చౌడవరంలోని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల్లో యూనియన్ బ్యాంకు





ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు ముఖ్యఅతిధిగా శ్రీకాంత్ పాల్గొని మాటా్లడుతూ ఆధునిక డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరి జీవితంలో సాంకేతికత అనివార్యమైందని,దానితోపాటు సైబర్ మోసాలు కూడా వేగంగా పెరుగుతున్నాయన్నారు.బా్యంకింగ్ సంబంధిత సమాచారం ఎవరికి పంచుకోవద్దని విద్యార్థులకు సూచిస్తూ ఫిషింగ్,హ్యాకింగ్,మాల్వేర్ దాడులు వంటి ముప్పుల నుండి రక్షించుకునే మార్గాలపై ప్రాక్టికల్ ఉదాహరణతో విద్యార్థులకు అవగాహన కల్పించారు.డిజిటల్ మోసాలను నివారించేందుకు అవగాహన కల్పించడంలో బ్యాంకింగ్ రంగం ముందడుగు వేయడం అభినందనీయమని కళాశాల సెక్రటరీ రాయపాటి గోపాలకృష్ణ,ట్రెజరర్ డాక్టర్‌కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం,అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను తనిఖీచేసిన కలెక్టర్

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 8,ప్రభాతవార్త : నగరంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బుధవారం తనిఖీ చేశారు.కాకుమానుగూడ ప్రాంతం,బి.ఆర్.స్టేడియం,పివికే నాయుడు పెద్ద మార్కెట్,అంబేడ్కర్ భవన్ స్టడీ సెంటర్,కృష్ణనగర్ వెంకటేశ్వరస్వామి గుడి వద్ద ఆడిటోరియం,గోరంట్లలో నీటి పథకం,మానస సరోవరం,జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్,నల్లపాడు చెరువు,ఐటిసి రోడ్డుల్లో పలు





కార్యక్రమాలను పరిశీలించారు.మానస సరోవరం,నల్లపాడు చెరువు అత్యుత్తమ పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.నగరంలో చేపడుతున్న కార్యక్రమాలను జిఎంసి అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు,పర్యవేక్షక ఇంజనీర్ సుందర్రామిరెడ్డి లు వివరించారు.పివికే నాయుడు పెద్దమార్కెట్,జిఎంసి కార్యాలయం వీటన్నింటిని అధునీకరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఆంధ్రా ప్రెసిడెంట్ మరియు బిజినెస్ హెడ్ ఎం.వి.చారి ప్లాంట్ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

బి.ఆర్.స్టేడియంలో విద్యుద్దీపాల ఏర్పాటు,కాల్వల ఏర్పాటు అవసరం ఉందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నర్సింహారెడ్డి చెప్పారు.స్టేడియంలోకి వర్షపు నీరు ప్రవేశించడం వలన బురదమయంగా తయారవుతుందని తద్వారా ప్రజలు మార్నింగ్ వాక్ చేయడానికి అవకాశం ఉండడం లేదన్నారు.కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు,జిఎంసి సిటీ ప్లానర్ రాంబాబు,జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటరత్నం,తహాశీల్దార్ వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## 'హార్వెస్ట్ ఇండియా'ఉచిత వైద్యశిబిరం

తెనాలి టౌన్ అక్టోబర్ 8 (ప్రభాతవార్త): హార్వెస్ట్ ఇండియా సంస్థ అధినేత కత్తెర సురేష్,జిల్లా పరిషత్ చైర్మన్ హెనీ క్రిస్టినా దంపతుల తనయుడు డాక్టర్ డేవిడ్ యస్వంత్ పుట్టినరోజు సందర్భంగా,కాటూరి మెడికల్ కళాశాల అండ్ వైద్యశాల ఆధ్వర్యంలో,ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు.పట్టణంలోని ప్యాడిసన్ పేట లోగల పొట్టిశ్రీరాములు కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. తొలుత వైద్యశిబిరాన్ని కత్తెర సురేష్ కుమార్ హెనీక్రిస్టినా దంపతులు సందర్శించారు.కాటూరి వైద్యశాల నుంచి వచ్చిన వైద్య బృందం రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు,గుండెకు సంబంధిత, నరములు,ఎముకలు, ప్రసూతి, మూత్ర సంబంధిత రోగాలకు పరీక్షలు నిర్వహించారు.అవసరమైన రోగులకు ఎక్స్ రే,స్కానింగ్, ఈసీజీ,పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.సుమారు 300 మంది ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకున్నారు. అనంతరం జరిగిన డేవిడ్ యస్వంత్ జన్మదిన వేడుకల్లో, కెఎన్ఆర్ యూత్ ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.హార్వెస్ట్ ఇండియా సంస్థ సేవలునిరుపేదలకు అండగా నిలుస్తాయని, విపత్తులు సంభవించిన సమయాల్లో ఆదుకోవడంలో హార్వెస్ట్ ఇండియా సంస్థ ముందువరుసలో నిలుస్తుందని హార్వెస్ట్ ఇండియా సంస్థ మేనేజర్, మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు అన్నారు. సంస్థ నీడలో అనేకమంది పేద విద్యార్థుల ఉన్నత చదువులను అభ్యసించి మంచి ఉద్యోగాలు పొందారన్నారు.సంస్థ స్థాపించిన విద్యాలయాల ద్వారా అనేక మంది జీవనోపాధి పొందుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొండమూది బోస్, మాల మహానాడు అధ్యక్షులు జ్యోతుల బాబి,పరంజ్యోతి, ఆనె రవీంద్ర,రావూరి సతీష్, గండి కోటి,ఆంజనేయులు, కోట్ల దిలీప్,రాజేష్,పులిశౌరి, భాస్కర్,రవి,వర తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటిసరఫరా చేయాలి: కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 8 (ప్రభాతవార్త): పట్టణ ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా చేపట్టాలని,నీటిసరఫరాలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని,మున్సిపల్ కమీషనర్ రామ అప్పల నాయుడు అధికారులకు సూచించారు.బుధవారం పట్టణంలోని ఐతానగర్ లోని రక్షిత మంచినీటి కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి ల్యాబ్ లో నీటి నమూనాలు చూసి రికార్డులు పరిశీలించారు.పట్టణ ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేపట్టాలని నీటి సరఫరాల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని, మంచినీటి శుద్ధి విషయంలో అలసత్వం లేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట పట్టణ ఆరోగ్యాధికారి యం. ఏసుబాబు,డిఈ శ్రీనివాసులు, ఏఈ జానీభాష,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




## పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు:కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 8 (ప్రభాతవార్త): పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వం వీడాలని,మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు సూచించారు.బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు శానిటేషన్ సెక్రటరీలకు,శానిటరీ మేస్త్రీలకు మరియు ఇన్స్పెక్టర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పట్టణ పరిధిలోని పారిశుధ్య నిర్వహణపై కార్యాలయమునకు వస్తున్న ఫిర్యాదులపై మరియు పబ్లిక్ గ్రీవెన్స్ పై వెంటనే చర్యలు తీసుకొనవలసినదిగా, వార్డ్ శానిటేషన్ సెక్ర టరీలకు ఆదేశించారు .అనంతరం పట్టణంలో జరుగుతున్న డోర్ టు డోర్ కలెక్షనకు సంబంధించిన వివరములు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఏపీ టిడ్కో మరియు హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలోపట్టణ పరిధిలో జరుగుతున్న టిడ్కో మరియు హౌసింగ్ కార్యక్రమమునకు సంబంధించిన వివరములు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశములో,ఎంహెచ్ఓ ఎం. యేసుబాబు,మునిసిపల్ ఇంజనీర్ పి.శ్రీకాంత్,హౌసింగ్ ఈఈ వై. భాస్కర్,టిడ్కో డిఈఈ సేతు బాబు, మునిసిపల్ డిఈఈ లు మరియు హౌసింగ్ ఏఈ లు పాల్గొన్నారు.



## ఆధునిక జీవనవిధానానికి మూలం,ఆయుర్వేద వైద్యం

తెనాలి టౌన్ అక్టోబర్ 8 (ప్రభాత వార్త): ఆధునిక జీవనవిధానానికి మూలం ఆయుర్వేద వైద్యమని,ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్యసంఘం సభ్యులు పేర్కొన్నారు.బుధవారం పట్టణంలోని రామలింగేశ్వరపేటలోగల, ప్రముఖ ఆయుర్వేదవైద్యులు డాక్టర్ సత్యన్నారాయణ మూర్తి,వైద్యశాలలో,దేశీయ వైద్యుల నైపుణ్యత మరియు నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమమునకు గౌరవఅతిధిగా,రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి పాండురంగ విటల్ పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆయుర్వేద వైద్యులు వారి యొక్క నైపుణ్యత ను తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం వారికి వివరాలు తెలియ చేసి,దేశీయ వైద్య సంఘంలో నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ప్రధాన కార్యదర్శి నామాల శ్రీనివాసరావు,గుంటూరు జిల్లా దేశీయ వైద్య సంఘం ఉపాధ్యక్షులు గుత్తికొండ హనుమంతరావు,కార్యదర్శి కొల్లిపాక అంజిబాబు,డాక్టర్ సత్యనారాయణ మూర్తి,ప్రభాకర్ రెడ్డి,టి.శ్రీనివాసరావు, డాక్టర్ విష్ణు,రాధాకృష్ణ మరియు కమిటీ సభ్యులు, వివిధ ప్రాంతాలనుండి విచ్చేసిన వైద్యులు పాల్గొని, తమ యొక్క నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు దేశయ వైద్య సంఘం వారు ధన్యవాదాలు తెలియజేశారు.



9-10 Tera page-8 6_9-10 Tera page-8.qxd 10/9/2025 12:13 AM Page 1



# 'మాస్ జాతర' నుంచి మూడవ గీతం విడుదల



'మాస్ జాతర' చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే' గీతాలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకొని, సామాజిక మాధ్యమాల్లో ఉర్రూతలూగించాయి. తాజాగా చిత్ర బృందం, మూడవ గీతంగా 'హుడియో హుడియో' అనే సరికొత్త మెలోడీని ప్రేక్షకులకు అందించింది. మాస్ మరియు మెలోడీని అందంగా మిళితం చేసిన ఈ మనోహరమైన ట్యూన్, అందరినీ కట్టిపడేస్తోంది. ఈ గీతం సినిమా మరియు ఆల్బమ్ రెండింటికీ సరైన భావోద్వేగ లయను తాకుతుంది.

రెండు ఉత్సాహభరితమైన పాటలతో అందరినీ కాలు కదిపేలా చేసిన తర్వాత, ఇప్పుడు శ్రోతల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకునే ఓ మంచి మెలోడీతో వచ్చారు. మునుపటి మాస్ మహారాజా రవితేజను తిరిగి తీసుకొని వస్తున్నట్టుగా మాస్‌క్లాస్ కలిసిన ఆరా ఇందులో కనిపిస్తోంది. ఇక శ్రీలీల మరోసారి తెరపై వెలుగులు వెదజల్లారు. రవితేజ, శ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఈ అందమైన గీతానికి మరింత అందాన్ని తీసుకొని వచ్చింది. 'హుడియో హుడియో' గీతాన్ని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో శ్రావ్యంగా మరియు హుషారుగా ఉండేలా తనదైన శైలిలో అద్భుతంగా స్వరపరిచారు. మాస్ చిత్రానికి తగ్గట్టుగా ఓ సరికొత్త మెలోడీని అందించారు. ఈ సంగీత మాయాజాలానికి తోడు, సంగీత సంచలనం 'హేషమ్ అబ్దుల్ వహాబ్' తన మనోహరమైన స్వరంతో భీమ్స్‌తో కలిసి ఈ గీతాన్ని ఆలపించారు.

ఇది ఒక చిరస్మరణీయ సంగీత అనుభవాన్ని సృష్టించింది. దేవ్ రచించిన సాహిత్యం ఉల్లాసంగా, ఆకర్షణీయంగా ఉండి, శ్రావ్యమైన మాధుర్యంతో చుట్టబడి, పాట యొక్క మంచి అనుభూతిని సంపూర్ణంగా సంగ్రహిస్తుంది. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు, 'మాస్ జాతర' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. చిత్ర ప్రకటన వచ్చినప్పటి నుండి 'మాస్ జాతర'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలకు విశేష స్పందన లభించింది. తాజాగా విడుదలైన మూడవ గీతం 'హుడియో హుడియో' సినిమా పట్ల ఆసక్తిని మరింత పెంచుతోంది. ప్రేక్షకులకు పూర్తి స్థాయి మాస్ విందుని అందించడానికి అక్టోబర్ 31న 'మాస్ జాతర' చిత్రం థియేటర్లలో అడుగుపెట్టనుంది.

# 'అరి' ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది

## డైరెక్టర్ జయశంకర్



ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వి రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. లింగ గుణపనేని కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'పేపర్ బాయ్' చిత్రంతో ప్రతిభావంతమైన దర్శకుడుగా పేరు తెచ్చుకున్న జయశంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. 'అరి' సినిమా ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10వ తేదీన వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో ఈ సినిమా హైలైట్స్ తెలిపారు డైరెక్టర్ జయశంకర్.

సినిమాల మీద ప్యాషన్‌తో మంచి ఉద్యోగం వదులుకుని ఇండస్ట్రీకి వచ్చాను. 2014లో టాలీవుడ్ లో అడుగుపెట్టి నాలుగేళ్లకు 2018లో 'పేపర్ బాయ్' మూవీతో దర్శకుడిని అయ్యాను. తక్కువ టైమ్‌లోనే దర్శకుడివి అయ్యావు అన్నారు. నా మొదటి సినిమా తర్వాత పెద్ద సంస్థల నుంచి ఆఫర్స్ వచ్చాయి. అయితే కోవిడ్, ఇతర పరిస్థితుల వల్ల ఆ ప్రాజెక్ట్స్ మెటీరియలైజ్ కాలేదు. అప్పుడు బయటకు వచ్చి 2021లో 'అరి' మూవీకి వర్క్ చేయడం ప్రారంభించాను. నాకు చిన్నప్పటి నుంచి పురాణాలు, ఇతిహాసాలు అంటే ఆసక్తి. వాటి గురించి తెలుసుకుని, అవగాహన పెంచుకున్నాను. మన పురాణాల్లో అరిషడ్వర్గాలను జయించాలని అని చెప్పారే తప్ప ఎక్కడా వాటిని ఎలా జయించాలో చెప్పలేదు. 2016లో ఈ స్టోరీ ఐడియా వచ్చింది. హిమాలయాలకు వెళ్లి కొందరు యోగులను కలిసి అరిషడ్వర్గాల గురించి సినిమా చేయాలనే ఆలోచనను తెలిపాను. వారు మంచి ప్రయత్నమని చెప్పి అనేక విషయాలు వెల్లడించారు. అరిషడ్వర్గాలను జయించేందుకు వారి ద్వారా మార్గాలు, సూచనలు తెలుసుకున్నాను. వాటి ఆధారంగానే ఈ 'అరి' చిత్రాన్ని రూపొందించాను. ఇలాంటి కథల్ని పూర్తిగా సందేశాత్మకంగా కాకుండా ఎంటర్ టైనింగ్‌గా చెప్పాలి. ఆ ప్రయత్నంలో సఫలమయ్యాననే అనుకుంటున్నా. వైవా హర్ష కామెడీ బాగా నవ్విస్తుంది. 'అరి' లాంటి మూవీని స్టార్స్ కూడా చేయొచ్చు. అయితే పాత్రల కంటే వారి స్టార్ డమ్ రిఫ్లెక్ట్ అవుతుందని పాత్రలకు సరిపోయేలా సాయి కుమార్, అనసూయ, వైవా హర్ష ..ఇలాంటి వారిని తీసుకున్నాను. ఆరు ప్రధాన పాత్రల్లో నటించిన నటీనటుల పర్ ఫార్మెన్స్ హైలైట్‌గా నిలుస్తుంది. ఈ పాత్రలన్నీ మీకు బాగా గుర్తుండిపోతాయి. సందేశం ఇవ్వాలని ఈ మూవీ రూపొందించలేదు. నాకు ఉపేంద్ర గారి మూవీస్ బాగా ఇష్టం. ఆయన సినిమాలు కమర్షియల్‌గా ఉంటూనే ఒక మెసేజ్ ఉంటుంది. ఉపేంద్ర మూవీ చూసినప్పుడు అలా ఒక సినిమా తెరకెక్కించాలనే ఆలోచన కలిగింది. 'అరి' కథ చెప్పినప్పుడు మా మూవీలో నటించిన ఆర్టిస్టులంతా హ్యాపీగా ఫీలయ్యారు. ఇలాంటి సబ్జెక్ట్ తో మూవీ రాలేదని అన్నారు. మా 'అరి' మూవీలో వీఎఫ్‌ఎక్స్ ఆకర్షణగా నిలుస్తాయి. మాకున్న బడ్జెట్‌లో క్వాలిటీ విజువల్ ఎఫెక్టులు చేశాం. అలాగే ఎఐ టెక్నాలజీని కూడా ఉపయోగించాం. సినిమాలో రెండు సాంగ్స్ ఉంటాయి. ఆ సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మనిషి కోరికలన్నీ ఒకదానితో మరొకటి ముడిపడే ఉంటాయి. మనం కోరుకున్నది దక్కినప్పుడు అహం ఏర్పడుతుంది, అదే పక్కవారికి దక్కితే అసూయ కలుగుతుంది. అరిషడ్వర్గాలు అనే సబ్జెక్ట్ సాధారణ ప్రేక్షకులకు కూడా సులువుగా అర్థమయ్యే విధంగా అరి సినిమాను రూపొందించాను. ఈ కారణం వల్లే చిత్రీకరణ ఆలస్యమైంది. వీలైనంత సింపుల్ గా ఈ సబ్జెక్ట్ ను తెరకెక్కించాం. సెన్సార్ వాళ్లు సినిమా చూసి అప్రిషియేట్ చేశారు. హార్ట్ టచింగ్‌గా మూవీ రూపొందించారని ప్రశంసించారు. మా సినిమాకు మంచి ఓపెనింగ్స్ వస్తాయని ఆశిస్తున్నా. ఎందుకంటే మంచి సినిమాలను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు.

వెంకయ్య నాయుడు, మల్లాది, యండమూరి లాంటి వాళ్లు మా సినిమాను చూసి అభినందించారు. వెంకయ్య నాయుడు గారు 'అరి' సినిమా చూసి మోడరన్ భగవద్గీతలా ఉంది అన్నారు. పురణాలు, ఇతిహాసాలు చదవని యువత ఈ సినిమా చూస్తే వాటిలోని సారం తెలుస్తుంది అన్నారు. ఆయన మాటల్ని గొప్ప ప్రశంసగా తీసుకున్నాం. అశ్వనీదత్ గారు కూడా మా మూవీ చూసి అభినందించారు. మా మూవీని హిందీలో ఒక పెద్ద హీరో, కన్నడలో ఒక స్టార్ చూశారు. వారికి బాగా నచ్చింది. అన్నీ కుదిరితే వారితో ఆయా భాషల్లో 'అరి' రీమేక్ చేస్తా. 'అరి' లాంటి మూవీ చేయాలంటే నిర్మాతలకు అభిరుచితో పాటు ధైర్యం ఉండాలి. అలాంటి ప్రొడ్యూసర్స్ నాకు దొరకడం సంతోషంగా ఉంది. ఇది రెగ్యులర్ మూవీ కాదు, రిజల్ట్ ఎలా ఉంటుందో తెలియదు. షూటింగ్‌లో కొంత బడ్జెట్ పెరిగింది. అయినా ఇప్పటికీ వారు సపోర్ట్ చేస్తూనే వస్తున్నారు. ఏ సినిమా కూడా ప్రేక్షకులందరికీ యునానమస్‌గా నచ్చదు. మన దేశంలో పబ్బులకు వెళ్లేవాళ్లు ఎంతమంది ఉన్నారో, గుడికి వెళ్లేవారు కూడా అంతకంటే ఎక్కువే ఉన్నారు. అలా స్పిరిచువల్ ఆలోచనలు ఉన్నవారు మా సినిమాను చూసినా చాలు అనుకుంటున్నాం. 'అరి' సినిమా యూత్ ఆడియెన్స్‌కు కూడా బాగా కనెక్ట్ అవుతుంది. ప్రీ క్లైమాక్స్ వరకు మా మూవీ ఏం జరుగుతుంది నెక్ట్స్ అనే క్యూరియాసిటీ క్రియేట్ చేస్తుంది. క్లైమాక్స్ 20 నిమిషాలు మాత్రం ఎక్సలెంట్‌గా అనిపిస్తుంది. తమకు కావాల్సినది దక్కించుకునేందుకు కొందరు వ్యక్తులు ఏం చేశారు అనేది ఈ చిత్ర నేపథ్యం. జాక్వెలిన్ ఫెర్నాండేజ్‌తో ఓ సినిమా చేయబోతున్నా. డిసెంబర్ నుంచి ఆ మూవీ షూటింగ్ కు వెళ్తున్నాం అన్నారు

# 'మటన్ సూప్' చిత్రం పెద్ద విజయం సాధించాలి: డైరెక్టర్ వశిష్ట



డిఫరెంట్ కథా, కథనాలతో రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కించిన చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 10న థియేటర్లోకి రాబోతోంది. ఈక్రమంలో మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెన్సేషనల్ డైరెక్టర్ వశిష్ట ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. అనంతరం నిర్వహించిన ఈవెంట్‌లో.. డైరెక్టర్ వశిష్ట మాట్లాడుతూ.. 'మటన్ సూప్' టైటిల్ చాలా బాగుంది. ట్రైలర్ బాగుంది. ట్రైలర్ ఎంత బాగుందో.. సినిమా కూడా అంత పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్' అని అన్నారు. రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ.. మా కోసం వచ్చిన విశిష్ట అతిథి వశిష్ట గారికి థాంక్స్. 'మటన్ సూప్'ను ఎంతో ఇష్టపడి తీశాం. అక్టోబర్ 10న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి అని అన్నారు. హీరో రమణ్ మాట్లాడుతూ..'మటన్ సూప్'ని రామచంద్ర అద్భుతంగా తీశారు. ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి సినిమా కోసం పని చేశారు. నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. అక్టోబర్ 10న మా సినిమాను చూడండి అన్నారు. నిర్మాత మల్లిఖార్జున ఎలికా మాట్లాడుతూ.. 'మటన్ సూప్' సినిమాకు టీం ఎంతో సహకరించింది. జెమినీ సురేష్‌గారు మాకు ఇచ్చిన సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేం. వెంకీ వీణా ఇచ్చిన మ్యూజిక్ అద్భుతం. 'మటన్ సూప్' టైటిల్ వద్దని మొదట్లో చెప్పాను. కానీ కథ విన్న తరువాత ఆ టైటిల్ అయితేనే పర్ఫెక్ట్ అని తెలిసింది. అక్టోబర్ 10న మా చిత్రం ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. రామచంద్ర ఈ సినిమాను ఎంతో గొప్పగా చిత్రీకరించారు. మా మూవీని ఆడియెన్స్ చూసి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ.. 'మటన్ సూప్' సినిమాను నేను చూశాను. చాలా అద్భుతంగా ఉంది. ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది అని అన్నారు. నిర్మాత రామకృష్ణ సనపల మాట్లాడుతూ.. ..మా 'మటన్ సూప్' టైటిల్ చూసి నాకు చాలా ఆశ్చర్యమేసింది. కానీ ఈ మూవీకి, ఈ కథకు ఆ టైటిల్ కరెక్ట్‌గా సెట్ అవుతుంది. మన చుట్టూ జరిగే కథల్నే ఈ సినిమాలో రామచంద్ర అద్భుతంగా చూపించారు. ఈ మూవీ ప్రతీ ఒక్కరికీ నచ్చుతుంది. ఈ మూవీలో స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటుంది. ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకంగా చెబుతున్నాను అని అన్నారు. నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ.. 'మటన్ సూప్'టైటిల్ విచిత్రంగా, బాగుందని అనిల్ రావిపూడి గారు మెచ్చుకున్నారు. ఈ మూవీ కూడా చాలా చిత్రంగాఉంటుంది. మా చిత్రాన్ని అందరూ చూసి సపోర్ట్ చేయండి అన్నారు.



# 'శ్రీ చిదంబరం' పెద్ద హిట్ అవ్వాలి

## టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సత్యదేవ్

శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి హీరో సత్యదేవ్, దర్శకులు వశిష్ట, వెంకటేష్ మహా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ టీజర్‌ను గమనిస్తే.. ఓ అందమైన ప్రేమ కథా, వింటేజ్ విలేజ్ డ్రామాను ఎంతో అందంగా చూపించబోతోన్నట్టుగా కనిపిస్తోంది. 'శ్రీ చిదంబరం' కథను నాకు ముందు చెప్పారు. వినయ్ రత్నం మంచి కథను అద్భుతంగా చూపించారు. వంశీ తుమ్మల అద్భుతంగా నటించారు. సంధ్య ఎంతో సహజంగా కనిపిస్తున్నారు. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలన కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు వశిష్ట మాట్లాడుతూ..శ్రీ చిదంబరం టీజర్ చాలా బాగుంది. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని, టీంకు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను అని అన్నారు. వెంకటేష్ మహా మాట్లాడుతూ.. 'ఈ మూవీని నేను దాదాపు పూర్తిగా చూశాను. హీరో వంశీ చక్కగా నటించారు. సంధ్య అయితే ఎంతో సహజంగా నటించారు. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధిస్తుందని నాకు నమ్మకం ఉంది అన్నారు. నిర్మాత గోపాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. 'శ్రీ చిదంబరం' కథను వినయ్ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. గ్లామర్ కంటే గ్రామర్‌కే ఇంపార్టెన్స్ ఇచ్చి కొత్త ఆర్టిస్టులతో సినిమాను తీశాం. ఈ మూవీని మీడియానే ముందుకు తీసుకు వెళ్లాలి అని అన్నారు. హీరో వంశీ తుమ్మల మాట్లాడుతూ.. 'వినయ్‌తో నా జర్నీ స్కూల్ నుంచే స్టార్ట్ అయింది. మా ఇద్దరికీ కూడా సినిమాల్లోకి రావాలనే కల ఉండేది. మా టీజర్ అందరికీనచ్చి ఉంటుందని భావిస్తున్నాను. సినిమా అందరికీ నచ్చుతుందని, పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను అన్నారు. దర్శకుడు వినయ్ రత్నం మాట్లాడుతూ.. 'రెండేళ్లు నేను ఈ కథను పట్టుకుని అన్ని ప్రొడక్షన్ కంపెనీల చుట్టూ తిరిగాను. అప్పుడు వినీషాగారి వద్దకు మాకథవెళ్లింది. గోపాలకృష్ణ రెడ్డిగారు మాకు అండగా నిలిచారు అన్నారు.

# 'ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్' ఫైనల్ ట్రైలర్ విడుదల




ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్' ఫైనల్ ట్రైలర్‌ను అధికారికంగా విడుదల చేసింది. డైరెక్టర్ డాన్ ట్రాచ్టెన్‌బర్గ్ ఈ ఐకానిక్ ఫ్రాంచైజీకి కొత్త బోల్డ్ విజన్‌ను అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఎక్స్‌ప్లోసివ్ సెట్ పీసెస్, అనూహ్యమైన అలయన్సెస్, ప్రెడేటర్ వర్సెస్ ప్రెడేటర్ బ్యాటిల్స్ లాంటివి ప్రేక్షకులు ఇంతకు ముందు చూడని విధంగా టీజ్ చేస్తున్నాయి. భవిష్యత్తులో 'మోస్ట్ డేంజరస్ ప్లానెట్' పై సెట్ చేయబడిన ఈ చిత్రంలో తన క్లాన్ నుంచి బహిష్కరించబడిన యంగ్ ప్రెడేటర్ (ఢుస్టర్‌కోలోమాటంగి)కు, హాఫ్ డిస్ట్రాయ్డ్ ఆండ్రాయిడ్ థియా (ఫానింగ్)తో అనూహ్యమైన అలయన్స్ ఏర్పడుతుంది. వీరిద్దరూ కలిసి అల్టిమేట్ అడ్వర్సరీని వెతుకుతూ ప్రమాదకరమైన జర్నీకి బయలుదేరుతారు. డెడ్లీ న్యూ క్రీచర్స్, రైవల్ ప్రెడేటర్స్‌తో తమ బలం, లాయల్టీ, సర్వైవల్‌ను పరీక్షించుకుంటారు. డాన్ ట్రాచ్టెన్‌బర్గ్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ చిత్రం, జిమ్ థామస్, జాన్ థామస్ సృష్టించిన క్యారెక్టర్ల ఆధారంగా తీర్చిదిద్దబడింది. జాన్ డేవిస్, డాన్ ట్రాచ్టెన్‌బర్గ్, మార్క్ టోబెరాఫ్, బెన్ రోజెన్‌బ్లాట్, బ్రెంట్ ఓఖికానర్ నిర్మాతలు.

# 'డ్యూడ్' అందరూ రిలేట్ చేసుకునేలా ఉంటుంది

## హీరో ప్రదీప్ రంగనాథన్



వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పాన్ ఇండియా మూవీ 'డ్యూడ్'తో అలరించడానికి రెడీ అవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. 'డ్యూడ్' అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా తిరుపతిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్‌మీట్‌లో హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ.. 'డ్యూడ్' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. చాలా రిలేటబుల్ క్యారెక్టర్. మైత్రి మూవీ మేకర్స్‌తో కలిసి పని చేయడం హ్యాపీగా ప్రౌడ్‌గా ఉంది. డైరెక్టర్ గారు ఈ కథ చెప్తున్నప్పుడే తనలోని కాన్ఫిడెన్స్ కన్విక్షన్ చాలా నచ్చింది. తిరుపతి నుంచి ప్రమోషన్స్ స్టార్ట్ చేయడం అనేది ఒక ఆశీర్వాదంగా భావిస్తున్నాను. తిరుపతిలో ఒక పాజిటివ్ వైబ్ ఉంటుంది. సినిమా మీద చాలామంది జీవితాలు ఆధారపడి ఉంటాయి. దయచేసి పైరసీని ఎవరూ కూడా ఎంకరేజ్ చేయకూడదని కోరుకుంటు న్నాను. డ్యూడ్ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. అందరూ థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు.

# 'గత వైభవ' డిఫరెంట్ మూవీ

## సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో ఎస్ఎస్ దుష్యంత్

ఎస్ఎస్ దుశ్యంత్, అశికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎపిక్ ఫాంటసీ డ్రామా 'గత వైభవ'. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్‌పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నవంబర్ 14న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి వర్ణమాల సాంగ్‌ని లాంచ్ చేశారు.సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో దుశ్యంత్ మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు అంటే నాకు చాలా ఇష్టం. ఈ సినిమాతో మీ అందరికి ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. డైరెక్టర్ సుని గారితో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన కన్నడలో చాలా విజయవంతమైన సినిమాలు అందించారు. గత వైభవ అద్భుతమైన స్క్రిప్టు. హిస్టరీ మైథాలజీ సనాతన ధర్మ ఎలిమెంట్స్ అన్నీ అద్భుతంగా కుదిరిన స్క్రిప్ట్ ఇది.ఆశిక రంగనాథన్ తన కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మన్స్ ఈ సినిమాల్లో చేశారు. శాండీ గారు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఆయన బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో సినిమా నేను నెక్స్ట్ లెవెల్ తీసుకువచ్చారు. ఇది చాలా పెద్ద ప్రాజెక్టు. మా నిర్మాత ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా గ్రాండ్ స్కేల్ లో తీశారు. టీజర్ సాంగ్ రిలీజ్ చేసాము. ఇంకా మున్ముందు కంటెంట్ రిలీజ్ చేయబోతున్నాము. నవంబర్ 14న కన్నడ తెలుగులో గత వైభవ సినిమా రిలీజ్ అవుతుంది అన్నారు. హీరోయిన్ అశిక మాట్లాడుతూ.. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో చాలా డిఫరెంట్ సినిమా ఇది. ఈ సినిమాలో నాలుగు డిఫరెంట్ స్టోరీస్ ఉన్నాయి. డైరెక్టర్ సుని గారు సినిమాని చాలా అద్భుతంగా తీశారు. తెలుగు ప్రేక్షకులకు ఆయన స్టైల్ ఆఫ్ ఫిలిం మేకింగ్ ఇష్టపడతారని నమ్ముతున్నాను. డైరెక్టర్ సునీ మాట్లాడుతూ అందరికీ నమస్కారం.ఇది ఫాంటసీ మైథిలాజికల్ మూవీ. నవంబర్ 14న రిలీజ్ అవుతుంది. మీరందరూ థియేటర్స్‌లో చూస్తారని కోరుకుంటున్నాను. ప్రొడ్యూసర్ దీపక్ మాట్లాడుతూ... ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాము. కంటెంట్ నచ్చితే తప్పకుండా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సింగర్ అనురాగ్ కులకర్ణి మాట్లాడుతూ.. ఈ పాట చాలా అద్భుతంగా వచ్చింది. చాలా ఇంట్రెస్టింగ్సినిమా ఇది. మంచి సినిమాని సెలబ్రేట్ చేయడం మన తెలుగు ప్రేక్షకు అలవాటు. అదే ప్రేమ ఈ టీముకు కూడా ఇస్తామని ఆశిస్తున్నాను. మ్యూజిక్ డైరెక్టర్ శాండీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మ్యూజిక్ దేవుడిచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నాను. గత వైభవ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అన్నారు.



# డిసెంబర్ 5న వస్తున్న 'వా వాదియార్'



స్టార్ హీరో కార్తి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'వా వాతియార్' రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ సినిమాను డిసెంబర్ 5న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు. 'వా వాదియార్' చిత్రాన్ని ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా హీరో కార్తి నటిస్తున్న 'వా వాదియార్' సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా టీజర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. కార్తి కెరీర్ లో ఒక ప్రత్యేకమైన చిత్రంగా "వా వాదియార్' నిలుస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి.

# 'పెద్ది' పుణేలో సాంగ్ షూటింగ్ ప్రారంభం



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా పెద్ది చిత్రీకరణ శర వేగంగా జరుగుతోంది. బుచ్చి బాబు సనా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రం భారీ స్థాయిలో చిత్రీకరణ జరుపుకుంటోంది. రేపు పూణేలో ప్రారంభమయ్యే నెక్స్ట్ షూటింగ్ షెడ్యూల్ కోసం టీం సిద్ధమవుతోంది. ఈ షెడ్యూల్‌లో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్‌పై అద్భుతమైన పాటను చిత్రీకరించనున్నారు. అకాడమీ అవార్డు విన్నర్ మాస్ట్రో ఎఆర్ రెహమాన్ అదిరిపోయే సాంగ్‌ని కంపోజ్ చేశారు. ఈ సాంగ్ కి స్టార్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉండనుంది. సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా సైమల్టేనియస్ కొనసాగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం సినిమా పూర్తయ్యేలా టీమ్ పాషన్‌తో పనిచేస్తోంది. రామ్ చరణ్ తన పాత్ర కోసం కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం వర్క్ చేస్తోంది. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27, 2026న పెద్ది గ్రాండ్ పాన్‌ఇండియా థియేట్రికల్ విడుదలకు సిద్ధంగా ఉంది.

## మహిళలు,విద్యార్థినులు తప్పని సరిగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

పిట్టలవానిపాలెం,అక్టోబర్8,ప్రభాతవార్త: మహిళలు, విద్యార్థినిలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి మొబైల్ యాప్ ను వినియోగించుకొని పోలీస్ శాఖ తక్షణ సహాయం పొందవచ్చునని చందోలు ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు. చందోలు జెడ్ పి హైస్కూల్ విద్యార్థులకు బుధవారం శక్తి మొబైల్ యాప్ ఆవశ్యకత, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు ఇతర మహిళా సంబంధిత నేరాలపై ఎస్ఐ శివకుమార్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అనుకోని అపద ఎదురైతే ఏ విధంగా ఎదుర్కోవాలి, ఏ విషయాన్ని ఎవరితో పంచుకోవాలి, మొదట ఎవరికీ చెప్పాలి, పోలీసులు సహాయం ఎలా తీసుకోవాలి అనే



విషయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. గుడ్ టచ్ గురించి, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థినిలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి మొబైల్ యాప్ ను వినియోగించుకొని పోలీస్ శాఖ తక్షణ సహాయం పొందవచ్చునన్నారు. అత్యవసర పరిస్థితిలో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే, నిమిషాల వ్యవధిలోనే సంబంధిత పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకొని సహాయం అందిస్తారన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలకు, విద్యార్థినిలకు అత్యంత ఉపయోగంగా ఉండే శక్తి యాప్ ను ప్రతి ఒక్కరు వారి మొబైల్ ఫోన్ లలో నిక్షిప్తం చేసుకోవాలన్నారు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

బాపట్ల,అక్టోబర్8,ప్రభాతవార్త: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల సురేష్ అన్నారు. బాపట్ల పట్టణం క్రిస్టియన్ పేటకు చెందిన కూరపాటి అశోక్ అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా వైద్య ఖర్చులకోసం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బత్తుల సురేష్ మాట్లాడుతూ కిడ్నీ



వ్యాధితో బాధపడుతున్న అశోక్ కు తమ వంతు సహకారం అందించామని, వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడే వారికి దాతలు సహాయం చేయడం వలన అతను పూర్తిగా మెరుగైన వైద్యం చేయించుకుని కోలుకుంటారన్నారు. ప్రతిరోజు ఎన్నో డబ్బులు వృధా చేస్తున్నామని ఆ డబ్బులను ఇలాంటి వారికి అందజేయడం ద్వారా సేవా కార్యక్రమం చేయడంతో పాటు అనారోగ్యంతో ఉన్నవారు మెరుగైన వైద్యం అందించుకొని పూర్తిగా ఆరోగ్యం వంతులుగా మిగులుతారు అన్నారు. పలువురు దాతలు ముందుకు వచ్చి అశోక్ కు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, కోశాధికారి జోగి సువర్ణరాజు, సభ్యులు అక్కి శీను, యలవల శ్రీనివాసరావు,పండు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యు నూతన వీసిగా సత్యన్నారాయణ రాజు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు8, ప్రభాతవార్త: ఏఎన్‌యు నూతన రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌గా ఆచార్య సామంతపూడి వెంకట సత్యన్నారాయణ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వర్సిటీ చాన్సలర్, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆదేశాలతో ఉన్నత విద్యాశాఖ సెక్రటరీ టు గవర్నమెంట్ కోన శశిధర్ జీ.ఓ యం.ఎస్.నెంబరు 91 విడుదల చేశారు.



ఆచార్య సత్యన్నారాయణ రాజు 3సంవత్సరాలు రెగ్యులర్ వీసిగా విధులు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఏడాదిన్నగా తాత్కాలిక వీసిగా విధులు నిర్వహిస్తున్న గంగాధరరావును తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్ తగు ఏర్పాట్లు చేయాలని జీఓలో పేర్కొన్నారు. నూతన వీసి ఆచార్య సత్యన్నారాయణ రాజు బెనారస్ హిందూ యూనివర్సిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌లో ఎంటమాలజీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2017లో ఎన్విరాన్‌మెంటల్ కన్జర్వేషన్ అవార్డు, మహిమ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, బెస్ట్ ఏఎన్ఓ అవార్డు, 2018లో డాక్టర్ ఆనంద్ ప్రకాష్ అవార్డ్, ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డు ఫెలో ఆఫ్ ఎంటమాజికల్ సొసైటీ, 2019లో అగ్రికల్చరిస్ట్ అచీవ్‌మెంట్ అవార్డ్‌లను పొందారు.

### బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు ఏఎన్‌యు వీసి పదవి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు8, ప్రభాతవార్త: ఏఎన్‌యు నూతన వీసి పదవి బెనారస్ హిందూ యూనివర్సిటీ (వారణాసి) ప్రొఫెసర్‌కు వస్తుందని ప్రభాతవార్త ఆగస్ట్ 19న ప్రచురించింది. వర్సిటీ సెర్చ్ కమిటీ ముగిసిందని, అందులో బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ పేరు ముందు వరుసలో ఉందని ప్రచురించింది. ఇప్పటికే రెక్టార్ పదవికి ఆచార్య శివరాం ప్రసాద్ వస్తారని, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఆచార్య రత్నషీలామణి పదోన్నతి పొందుతారని ముందుగానే ప్రభాతవార్త అంచనావేసింది. వర్సిటీలో నిత్యం వార్త ప్రచురిస్తున్న కథనాలతో పాఠకుల్లో సానుకూల దృక్పదాన్ని ఏర్పరచుకుంది. నూతన వీసి త్వరలో పదవీ బాధ్యతలు తీసుకోనున్నారు.

### అమేజాన్ ఇండియా ఆఫర్లు

అమరావతి, ఆక్టోబర్ 8, ప్రభాతవార్త : సెప్టెంబర్ 22న ప్రారంభమైన అమేజాన్ గ్రేటిండియన్ ఫెస్టివల్ 2025లో ఏపి వినియోగదారులు, సెల్లర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారని కొనుగోలులో శక్తివంతమైన వృద్ధి కనిపించిందని అమేజాన్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. ఇప్పుడు దీపావళి ప్రత్యేకం" డీల్స్‌లో స్మార్ట్ ఫోన్ పై 40శాతం వరకు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, బ్యూటీ, హోమ్ కిచెన్, అవుట్ డోర్స్ పై 80 శాతం వరకు, గృహోపకరణాలపై 65 శాతం వరకు, నిత్యావసరాలపై 70 శాతం వరకు తగ్గింపు పొందాలన్నారు. అమేజాన్ ఫ్రెష్ అలెక్సాతో ఇకో, ఫైర్ టీవీ అండ్ కిండిల్ ఇంకా ఎన్నో వాటిపై 50 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు.

### దివాలీ స్పెషల్ డీల్స్


విజయవాడ, ఆక్టోబర్ 8, ప్రభాతవార్త: ఇండియన్ ఫెస్టివల్ 2025, తన దివాలీ స్పెషల్ స్టర్ ఫింట్తో కద్వాచౌత్, ధన్తేరస్, ఇంకా దీపావళి సందర్భంగా 1 లక్షకు పైగా ఉత్పత్తులను, అత్యుత్తమ డీల్స్‌లో పొందాలని అమేజాన్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. సామ్సంగ్, యాపిల్, ఇంటెల్, టైటన్, లోరియేల్ వంటి అగ్రశ్రేణి బ్రాండ్లకు చెందిన 30,000లకు పైగా కొత్త ఉత్పత్తులను పొందాలన్నారు. అదనపు జీఎస్టీ లాభాలు జీఎస్ట్ బచత్ ఉత్సవ్2025 ద్వారా అందుకోవాలన్నారు.

### సురక్షితంగా షాపింగ్ చేయండి

విజయవాడ, అక్టోబర్ 8, ప్రభాతవార్త : పెద్ద పండుగలు షాపర్లకు పెద్ద చిట్కాలు సిద్ధం చేసుకునేందుకు స్ఫూర్తిని ఇస్తే, మోసగాళ్ళకు పెద్దద అవకాశాలు ఇస్తాయి. మీ సీజనల్ షాపింగును ఏదో ఒక ముఖ్యమైన ప్రయాణంగానే భావించండని పలువురు నిపుణులు పేర్కొన్నారు. మార్గం ప్లాన్ చేసుకోండి, విశ్వసనీయమైన రోడ్లను ఉపయోగించండి, అమూల్యమైన మీ వస్తువులను భద్రంగా ఉంచుకోండి, ఈ క్రింద ఒక ఆచరణాత్మకమైన, నిపుణుల తరహా చెక్స్ ఉన్నది. ఇది విశ్వజనీనమైన భద్రత కోసం ఉత్తమమైన పద్ధతులను, అమెజాన్ లాంటి కంపెనీలు ఏ విధంగా తమ సురక్షాకవచాలను పటిష్టపరుచుకుని మీరు తక్షణం ఉపయోగించుకునేందుకు టూల్సును ఆఫర్ చేస్తున్నాయో తెలిపే ఉదాహరణలతో మేళవిస్తుందన్నారు.

## శాసన వ్యవస్థ కమిటీలకు అధికారులు జవాబుదారీతనం వహించాలి

విజయవాడ, అక్టోబర్ 8, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో ఏడు ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై సమీక్షించి ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించిన కమిటీఖర్చు చేసే ప్రతి పైసా గురించి



ప్రభుత్వ రంగ సంస్థలు శాసన వ్యవస్థకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని ప్రభుత్వ రంగ సంస్థల సంఘం చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏడు ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన పియుసి చైర్మన్, సభ్యులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ శ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పియుసి చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ సొసైటీలతో కలిపి రాష్ట్రంలో సుమారు 236 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయని చెప్పారు. వీటికి సంబంధించిన వార్షిక ఆడిట్ నివేదికలు, ఆదాయ, వ్యయాలు, వాటి ఖాతాల (అకౌంట్స్) పై కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. శాసన వ్యవస్థ స్టాట్యూటరీ కమిటీలలో ప్రభుత్వ లెక్కల సంఘం (పిఎసి), అంచనాల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల సంఘం (పియుసి) ఉన్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ శ, ప్రభుత్వ రంగ సంస్థల సంఘం సభ్యులైన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, అయితా బత్తుల ఆనందరావు,వర్ల కుమార్ రాజా, తెనాలి శ్రావణ్ కుమార్, వసంత కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, శాసనసభ సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి నాగ మునెయ్య, విభాగాధికారి సతీష్, విజయవాడ ఆర్డీవో చైతన్య, డిఆర్ఓ ఎం. లక్ష్మీ నరసింహం, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలి

పిట్టలవానిపాలెం,అక్టోబర్8,ప్రభాతవార్త: వస్తు సేవ పన్ను తగ్గింపుతో ఉత్పత్తులు పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అన్నారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన పఠాన్ ఆయేషా కు ప్రథమ బహుమతి లభించగా, సుమియా కౌశిక్ కు ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతిని రేష్మానిషా కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి బాగా చదువుకుని ఉన్నత



లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన వైపు సాగాలన్నారు. విద్యార్థులు సామాజిక స్పృహతో ఎదగాలన్నారు. ప్రజలకు సేవ చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగంతోనే వీలువదుతుందన్నారు. ప్రభుత్వంలో ఉన్నతాధికారి ఉద్యోగాన్ని సాధించడమే మీ లక్ష్యంగా ఉండాలని విద్యార్దులకుసూచించారు. ఈ కళాశాలలోని విద్యార్థులంతా గ్రూప్1 అధికారులు కావాలని ఆయన ఆకాంక్షించారు. సబ్జెక్టులపై అవగాహన పొందుతూ ఇష్టంతో చదివితే విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. నేను పదో తరగతిలో 580 మార్కులతో కర్ణాటక రాష్ట్రంలో ఐదవ ర్యాంకు సాధించానని తన అనుభవాలను పంచుకున్నారు. ప్రజలకు మరింతగా సేవలందించాలంటే ఐఏఎస్ ద్వారానే సాధ్యమని గుర్తించి, ఆ దిశగా ప్రణాళిక మార్చుకున్నానని ఆయన తెలిపారు. మీరు ఉన్నత భావాలతో విజ్ఞానం పెంపొందించుకోవాలని మీరు ఎంచుకున్న లక్ష్యానికి చేరుకోవాలంటే కృషి, పట్టుదల ఉండాలన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అన్ని వస్తువుల ధరలు తగ్గడం ద్వారా కొనుగోలు, అమ్మకాలు పెరుగుతాయని తద్వారా ఉపాధి మెరుగుపడుతుందన్నారు.. ప్రజలకు ఎంతో ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు చేసిందన్నారు. జీఎస్టీ పన్ను తగ్గింపు ఎలా ప్రయోజనం అవుతుందో తెలుసుకోవాలన్నారు. వస్తు సేవ పన్ను తగ్గించడం ద్వారా నిత్యవసర వస్తువుల ధరలపై భారం తగ్గిందని వాణిజ్య పనుల శాఖ డిడి జి.మురళీకృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఖజానాకు అన్నిటికంటే 70 పన్నుల ద్వారానే ఆదాయం వస్తుందని ,ప్రస్తుతం జీఎస్టీ తగ్గించడం ద్వారా ప్రభుత్వానికి నష్టం వచ్చినా, ప్రజలకు మేలు చేయాలని అమలు చేస్తుందన్నారు. ప్రస్తుతం ఐదు, 18 శాతం మాత్రమే పన్నులు వర్తిస్తున్నాయన్నారు. విద్యా వ్యవస్థ బాగుంటేనే అన్ని రంగాలు బాగుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాఖ సహాయ కమిషనర్ జి గ్లోరికుమారి, నోడల్ ఆఫీస్ గౌరీదేవి, కళాశాల ప్రధానాచార్యులు ఆదిలక్ష్మి, ఉప ప్రధాన ఆచార్యులు సుబ్బారావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

బాపట్ల,అక్టోబర్8,ప్రభాతవార్త: జిల్లా కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కువ గా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు అందరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. స్దానికి కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తరుచుగా వర్షాలు కురుస్తున్నాయని, వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువుగా ఉందన్నారు.ప్రజలు కొన్ని ముఖ్య మైన జాగ్రత్తలు పాటించడం వల్ల సీజనల్ వ్యాధుల బారీ నుండి రక్షిచుకోవచ్చునన్నారు. ప్రజలు తమ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ప్రతి నిత్యం చేతులను సబ్బుతో చేతులు కడుకోవాలన్నారు. ప్రతి సారి నీరు త్రాగే ముందు నీటిని వేడి చేసిన త్రాగాలని ఈ పద్ధతులు పాటించడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాంగా ఉండవచ్చునని ఆయన తెలిపారు.

## ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు చేరువ చేయటంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

బాపట్ల,అక్టోబర్8,ప్రభాతవార్త: ప్రభుత్వ పథకాల అమలులో అన్ని విభాగాలలో బాపట్ల జిల్లాను రాష్ట్రస్థాయి లో మూడవ స్థానంలో ఉంచే విధంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.స్థానిక కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై బుధవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు ప్రతి మండలంలో ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. నోడల్ అధికారి వసతి గృహాలను దత్తత తీసుకొని పర్యవేక్షణ చేయాలన్నారు. వసతి గృహాల అభివృద్ధిలో కావలసిన మౌళిక వసతుల కల్పనలో పూర్వ విద్యార్థులను మమేకం చేసుకొని వారి ద్వారా వసతి గృహాలను మెరుగుపరచాలన్నారు. సంక్షేమ వసతి గృహాలలో లోపల బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు.సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ప్రతిరోజు నిర్దేశించిన కార్యక్రమాలను అధికారులు చిత్తశుద్ధితో పూర్తి చేయాలన్నారు.. జీఎస్టీ తగ్గుదలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించి వాటి డాక్యుమెంట్లను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ విషయమై వివిధ కార్యక్రమాల ఏర్పాటుకు షెడ్యూల్ తయారుచేయలన్నారు. మహాత్మా గాంధీ చెప్పిన విధంగా ప్రతి అధికారి గ్రామాలకు వెళ్లి అక్కడ నాణ్యమైన పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై మండల స్థాయి ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలని ఆయన తెలిపారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ లో భాగంగా రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు సంబంధించిన యంత్రాలపై ఎగ్జిబిషన్లు, వర్క్ షాప్ లు, జీఎస్టీ తగ్గుదల రేట్ల వివరాలు, ఒక జిల్లా ఒక ఉత్పత్తి, ద్విచక్ర వాహనాలపై ర్యాలీలు, సమావేశాల ఏర్పాటు, సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు, పెయింటింగ్ మొదలగు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందించే పలు పథకాలను ప్రజలకు చేరువ చేయుటలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. అధికారుల వద్దకు వచ్చే ప్రజల సమస్యలపై వారు సానుకూలంగా స్పందించి, అర్జీ దారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు.గ్రామస్థాయి అధికారులు ప్రజలను కలిసేటప్పుడు గుర్తింపు కార్డులు ధరించాలన్నారు. ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు, ఏఎన్ఎంలు ఎఫ్ఆర్ఎహాజరు నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్యాధికారులు జిల్లాలోని ప్రతి పీహెచ్సీ సెంటర్ ను తనిఖీ చేసి తనిఖీ నివేదికను తయారు చేయాలని సూచించారు. వైద్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ ప్రతినిధులని ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలో ఉద్యోగులు ప్రజలతో మమేకమై పనిచేసినప్పుడు వారి నుండి సానుకూల స్పందన వస్తుందని ఆ దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలన్నారు. జిల్లాలో స్వామిత్వ సర్వేని వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని 205 రెవెన్యూ గ్రామాలలో స్వామిత్వ కార్యక్రమం నూరు శాతం పూర్తి చేయాలన్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో వచ్చే అర్జీల ఆడిటింగ్, ఈ క్రాప్ నమోదు, సిసిఆర్సి కార్డుల జారీ విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మరియు ఇన్చార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, ఏ ఏ ఓ అనురాధ, డిపిఓ ప్రభాకర్, ఇన్చార్జి పీ డి డి ఆర్ డి ఏ లవన్న, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కనక ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రకాష్ రావు, వీక్షణ సమావేశం ద్వారా ఆర్డీవోలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మూడు నెలలకు రాజనీయ పార్టీల నాయకులతో ఈవిఎం భద్రపర్చి గోదాముల పరిశీలన

బాపట్ల,అక్టోబర్08,ప్రభాతవార్త: జిల్లాకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద 24 గంటలు పటిష్టమైన భద్రత ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు.జిల్లా రెవిన్యూ అధికారి మరియు ఇంచార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్,వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలసి స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో భద్రపరిచిన ఈవీఎంల



గోదామును జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు, మేరకు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఈవీఎంల గోదాములను తనిఖీ చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో గోదామును ఓపెన్ చేసి గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బి యు లు, సి యు లు, వివి ప్యాట్ లను, క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకులు సమక్షంలో ఈవీఎం గోదాములను క్లోజ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ.పి.గ్లోరియా, తహశీల్దార్ సలీమా షేక్, కలెక్టరేట్ డి సెక్షన్ ఎలెక్షన్ పర్యవేక్షకులు సఫీ అహ్మద్ , ఎలక్షన్ డిటి శ్రీనివాసులు , ఎలక్షన్ సెల్ నుంచి ప్రశాంత్,దుర్గ, బిజెపి నుంచి జిల్లా జనరల్ సెక్రటరీ కె.వి.రామకృష్ణ , బి ఎస్ పి నుంచి జి.రాజారావ్,సి పి యం నుంచి జిల్లా కార్యదర్శి చి. హెచ్. గంగయ్య, తెలుగుదేశం పార్టీ నుంచి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్.కె.ఫారీద్ మస్తాన్, వైఎస్సార్ పార్టీ నుంచి మాల్యాద్రి, ఆమాద్మీ పార్టీ నుంచి జిల్లా అధ్యక్షుడు అట్ల బాలాజీ రెడ్డి, జనసేన పార్టీ నుంచి విజయ్ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి హయాంలో నకిలీ మద్యం ఎరులై పారింది: తెదేపా విమర్శ


తెనాలి టౌన్ అక్టోబర్ 8 (ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎక్కడ ఏ అసాంఘిక చర్య జరిగిన దాని మూలాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటున్నాయని తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. బుధవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ, గత



ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యం ఏరులై పారిందని, సామాన్య వైసిపి కార్యకర్త స్థాయి నుండి ఎమ్మెల్యేలు మంత్రులు ముఖ్యమంత్రి వరకు ఈ మద్యం కుంభకోణంలో భాగస్వాములుగా ఉన్నారని, ప్రజలకు నకిలీ మద్యాన్ని అంటగట్టి,అనేకమంది ప్రాణాలను బలి తీసుకున్నారని విమర్శించారు.అక్రమ మద్యం వ్యాపారంతో వైసిపి నాయకులు కోట్లకు పడగనిత్తారని,వారికి ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని, మద్యం కుంభకోణంపై ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న దర్యాప్తులో భాగంగా నిందితులందరూ కూడా వైసిపి కోవర్టులేనన్నారు.ప్రజల ప్రాణాలతో చలగాటమాడే నకిలీమద్యం కేసులో ఎంతటి వారున్నా కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదన్నారు.ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్,రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్,తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర పూర్ణచంద్,తెదేపా పట్టణ కార్యదర్శి వసంతం అశోక్, పార్టీ సీనియర్ నాయకులు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు అక్కిసెట్టి వెంకటేశ్వరరావు, శ్యామ్,సుభాష్ బాబు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భారీవర్షానికి పట్టణంలో చెరువులను తలపిస్తున్న రోడ్లు

తెనాలి టౌన్ అక్టోబర్ 8 (ప్రభాతవార్త): పట్టణంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి,రోడ్లన్నీ చెరువులుగా మారాయి.దాదాపు గంటపైన కురిసిన భారీవర్షానికి పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ నీటిలో మునిగిపోయాయి. ప్రధానంగా బోసురోడ్డు,బుర్రి పాలెం రోడ్డు,అలాగే శివాజీ చౌక్ నుండి చినరావూరు పార్కు కు వెళ్లే ప్రధాన రహదారులన్నీ మోకాలిలోతు నీరు నిలిచిపోయింది.చిట్టి



ఆంజనేయస్వామి గుడి వద్ద రైతుబజార్లోకి వర్షపు నీరు చేరింది.ముఖ్యంగా పాత గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, తహసిల్దార్ కార్యాలయం రోడ్డులతో పాటు బాలాజీ రావుపేట,చినరావూరు ఇంకా పట్టణంలోని అనేక ప్రాంతాల్లో భారీవర్షంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీనితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీవర్షానికి తోడు ఉరుములు మెరుపులతో ప్రజలు ఆందోళనపడ్డారు. సాయంత్రం వేళ పాఠశాలలు, కార్యాలయాలు వదిలే సమయంలో భారీ వర్షం కురవటంతో, విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచింది.కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

## వ్యవసాయ క్షేత్రాలను ప్రశంసించిన బ్రెజిల్ బృందం






కొల్లిపర,అక్టోబరు 8 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆద్వర్యంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు వారం రోజులు నుండి బ్రెజిల్,శ్రీలంక యుఎఈ దేశాలకు చెందిన 30 మందితో బృందం రాష్ట్రంలో పర్యటించింది. బుధవారం మంగళగిరి మండలం నూతక్కి,కొల్లిపర మండలం అత్తోట గ్రామాల్లో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి ఆద్వర్యంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పసుపు, అరటి,వరి పంటలను పరిశీలించారు.కార్యక్రమంలో స్టేట్ టీమ్ వాణిశ్రీ,ఆదనపు డీపీఎం సత్యన్నారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


వేమూరు అక్టోబరు 8 (ప్రభాతవార్త) : మార్కెట్ యార్డు ద్వారా అమలవుతున్న రైతుబంధు పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి తెలియజేశారు. బుధవారం వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ



రైతు బంధు పథకం ద్వారా ప్రభుత్వం యార్డ్‌లో నిర్వహించిన పంటలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తుందన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగపరుకునే విధంగా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. అదే విధంగా మార్కెట్ యార్డులో ఎరువులు పురుగు మందులు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. వేమూరు మార్కెట్ యార్డు పరిధిలో కొత్తగా అనంతవరం, ఇంటూరు, చదలవాడ గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా మార్కెట్ యారు్డ గోదాముల మరమ్మత్తులు చేసేందుకు సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో యార్డు కార్యదర్శి అజిత్‌సింగ్, రేపల్లె ఏడిఏ లక్ష్మీ, యార్డు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసగా మారి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దు

బాపట్ల,అక్టోబర్8,ప్రభాతవార్త: విద్యార్థి దశ నుండే చట్టాల పట్ల అవగాహన కలిగివుండాలని తద్వారా సమాజంలో ఎంతో మెరుగైన వ్యక్తులుగా తయారవుతారని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు,కళాశాలలో బుధవారం విద్యార్థులకు పోలీస్ అధికారులు ప్రత్యేక



అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చట్టాల గురించి, మత్తు పదార్థాల వలన జరిగే పర్యవసానాలు గురించి, సైబర్ నేరాల గురించి అక్కడ విద్యార్థులలో చైతన్యం నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని సైబర్ నేరస్తులు వారి పందాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటు న్నారన్నారు. వాటిని నివారించాలంటే ప్రజల్లో చైతన్యం పెంచుకోవడమే ముఖ్యమని, అదేవిధంగా విద్యార్థి దశలో మాదకద్రవ్యాల ఉచ్చులో చిక్కుకుంటే వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని సమాజంలో చిన్న చూపుకు గురవుతారన్నారు. సైబర్ నేరం జరిగిందని గుర్తించి గోల్డెన్ అవర్ లో పోలీస్ శాఖకు సమాచారం అందిస్తే బాధితుల సొమ్ము సైబర్ నేరస్థుల పాలు కాకుండా కాపాడడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

## రాజకీయ స్వార్థంతో జగన్ కుట్ర: చీఫ్‌విప్ జీవీ



వినుకొండ,అక్టోబర్8,ప్రభాతవార్త: జగన్ తన స్వప్రయోజనాల కోసం ప్రతి అంశాన్ని రాజకీయం చేసి లబ్ది పొందాలని చూస్తున్నారని అందులో భాగంగానే వైద్య కళాశాలలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో నాణ్యత పెంచి,ప్రజలకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పీపీపీ విధానం అనుసరిస్తుందన్నారు. జగన్‌రెడ్డికి పీపీపీ విధానంకు ప్రైవేటీకరణకు తేడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం అవాస్తవాలు ప్రచారం చేయడమే జగన్ పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. పీపీపీ విధానంలో ఏర్పాటు కానున్న కాలేజీల్లో సీట్లు,ఫీజులు పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ అంశము ఉండదని స్పష్టం చేశారు. విశాఖపట్నం ప్రపంచ పెట్టుబడులకు కేంద్రం స్థానంగా మారడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. జగన్ విశాఖపట్నం పర్యటన పూర్తిగా రాజకీయ హడావుడి మాత్రమే అన్నారు. జగన్ చేస్తున్న విష ప్రచారాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని సరైన సమయంలో కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని పేర్కొన్నారు.

## మినుము రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి: ఏవో వరలక్ష్మి



వినుకొండ, అక్టోబర్ 8, ప్రభాతవార్త: మండలంలోని నరసనాయుని పాలెం,కొప్పు కొండ గ్రామాల్లోని మినుము పంట పొలాలను మండల వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి,ఏఈఓ ఆరిఫ్ బుధవారం పరిశీలించారు. పంటకు తెగులు రాకుండా ఉండేందుకు అనుసరించాల్సిన సస్యరక్ష చర్యలను సాగుదారులైన రైతులకు తెలియజేశారు. పల్లాకు తెగులు నివారణకు వేప గింజల కషాయం లేదా వేప నూనె,ఏసీపేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తెల్ల దోమ నివారణకు పసుపు రంగు అట్టలను ఎకరానికి పది చొప్పున పైరుకి మూర ఎత్తులో పెట్టాలని చెప్పారు.

## సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



గురజాల, అక్టోబరు 8 ప్రభాతవార్త ః గురజాల నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలల్లో బుధవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందించారు. 11 విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. గురజాల జీఎస్టీ నోడల్ ఆఫీసర్ చాణిక్య, కమిషనర్ వైవిఎల్ శివన్నారాయణ, ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 994.36 ఎకరాల్లో పత్తిసాగు: ఏవో సంధ్యారాణి



పిడుగురాళ్ల, అక్టోబరు 8 ప్రభాతవార్త ః పిడుగురాళ్ల మండల పరిధిలోని 994.36 ఎకరాల్లో పత్తి సాగు జరిగినట్లు ఏవో సంధ్యారాణి తెలిపారు. బుధవారం ఆమె పత్తి పొలాలను పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు ఎక్కడా కూడా పత్తి పంట నీట మునగలేదన్నారు. పత్తి పంటను మే నెలలో రైతులు సాగు చేశారన్నారు. ఆగష్టు, సెప్టెంబరు నెలల్లో 10 నుంచి 12 క్వింటాల దిగుబడి తీశారన్నారు. ప్రత్తి పంటను పీకివేసి మొక్కజొన్న పంటలు సాగు చేస్తామని రైతులు తెలిపారన్నారు. అలాగే ఉద్యానవన శాఖాధికారి అంజలిబాయి మిరప పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలకు పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపాలన్నారు. పలు తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు చేశారు.

## కొత్తపల్లి రోడ్డుకు మోక్షం!
## - నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు!



విజయపురిసౌత్, అక్టోబరు 8 ప్రభాతవార్త: మాచర్ల నుంచి విజయపురిసౌత్ వయా కొత్తపల్లి, కొప్పునూరు, చింతలతండా గ్రామాలను కలుపుతూ పోయే ప్రధాన రహదారి విస్తరణకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ నిధులు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల్లో భాగంగా కొత్తపల్లి జంక్షన్ నుంచి విజయపురిసౌత్ వరకు దాదాపు 11 కిలో మీటర్లకుపైగా ఉండే ఈ రోడ్డుకు రూ.5 కోట్ల నిధులు కేటాయించింది కూటమి ప్రభుత్వం. దీనిపై కొత్తపల్లి మీదుగా పోయే పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీఆర్‌డీసీలో అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయపురిసౌత్, అక్టోబరు 8 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ విజయపురిసౌత్ ఏపీఆర్‌డీసీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.నయీమ్‌భాను తెలిపారు. గణితం 1, జువాలజీ 1 పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో కచ్చితంగా 55 శాతం మార్కులు ఉండాలి. యూజీసీ నెట్, ఏపీ సెట్, పీహెచ్‌డీ, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంగ్లీషుమీడియంలో బోధించాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో 14న ఉదయం 10 గంటలకు కాలేజీలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రెజ్యూమ్‌ను పీడీఎఫ్‌లో మెయిల్ చేయాలన్నారు. వివరాలకు 8688169290 నంబరులో సంప్రదించాలన్నారు.

## అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం
### - రేషన్ షాపులను తనిఖీ చేసిన రెవెన్యూ అధికారులు



కారంపూడి, అక్టోబరు 8 ప్రభాతవార్త: ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం మాఫియాకు కారంపూడి అడ్డాగా మారింది. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని మంగళవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారంపూడిలోని వివిధ రేషన్ దుకాణాల్లో ఉన్న బియ్యం లారీ ద్వారా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు బియ్యం లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీలో 90 బియ్యం గోతాలు ఉండగా కొన్ని ప్రభుత్వం అందించే గోతాలు కూడా ఉన్నాయి. లారీని ఎస్సై వాసు పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోతున్నాయని పోలీసులు లారీని స్వాధీనం చేసుకోవడంతో రెవెన్యూ అధికారులు బుధవారం రేషన్ షాపులను తనిఖీ చేశారు. బియ్యం స్టాకు ఎంతమంది లబ్ధిదారులకు అందించారని రికార్డులను డిప్యూటీ తహశీల్దారు విద్యాసాగర్ సిబ్బంది పరిశీలించారు.

## కొండవీడు రెవిన్యూ పరిధిలో మూడు శాఖల అధికారుల క్షేత్రస్థాయి భూముల పరిశీలన



యడ్లపాడు, అక్టోబర్ 8, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండవీడు రెవిన్యూ పరిధి కొండ్రుపాడు గ్రామ సమీపంలో గతంలో ప్రభుత్వ ప్రైవేటు సంస్థకు విక్రయించిన భూమిని రెవిన్యూ, అటవీ, సర్వే శాఖ అధికారులు బుధవారం ఉమ్మడి పరిశీలన నిర్వహించారు. కొండవీడు రెవిన్యూ పరిధిలోని కొండ్రుపాడు గ్రామ జాతీయ రహదారి సమీపంలోని సుమారు 28ఎకరాల భూమిని గతంలో ఓ ప్రైవేటు సంస్థ కొనుగోలు చేసింది. సదరు భూమిని అప్పగించాలని సంస్థ ఇటీవల ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో అధికారులు బృందం క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించారు. భూమి హద్దులు గుర్తించి సర్వే చేశారు. ఉమ్మడి సర్వేలో పరిశీలించిన అంశాలతో సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ అటవీ శాఖ అధికారి హిమశైలజ, ఆర్డీవో మధులత, తహశీల్దార్ విజయశ్రీ, అటవీశాఖ రేంజ్ అధికారులు వెంకటరమణ, పోతురాజు, సర్వే ఇన్స్పెక్టర్ శేషగిరిరావు, మండల సర్వేయర్ సురేంద్రనాథ్, గ్రామ సర్వేయర్ దేవేంద్ర, ఆర్ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఎస్ఎస్ఎన్ కళాశాలలో జిఎస్‌టి పై అవగాహన సదస్సు



నరసరావుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : ఎస్ఎస్ఎన్ కళాశాలలో జిఎస్‌టి పై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. పల్నాడు జిల్లా జాయింట్ కమిషనర్ జాన్‌స్టీవెన్‌సన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, అధికారులు ఎం.రామారావు, రంగయ్య, జిఎస్‌టి ఆఫీసర్ బి.పున్నారెడ్డి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించే దిశగా ప్రజలకు జిఎస్‌టి మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ముఖ్యమైన నిత్యావసర వస్తువులు, గృహ ఉపయోగ వస్తువులపై జిఎస్‌టిని తగ్గించామన్నారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు సూపర్ జిఎస్‌టితో సూపర్ సేవింగ్స్ తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబానికి కనీసం రూ.4 వేలు జిఎస్‌టి తగ్గింపుతో లాభం చేకూరుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాససాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు తిరస్కరించినా వైకాపాకు బుద్ధి రాలేదు : కొమ్మాలపాటి

నరసరావుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : రాష్ట్రంలో ప్రజలు తిరస్కరించినా వైకాపాకు బుద్ధి రాలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జిల్లా పార్టీ తెలుగుయువత అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి, తెలుగుయువత అధికార ప్రతినిధి రఫీ పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యల కంటే రాజకీయ లబ్ది వైకాపాకు కావాలన్నారు. వైద్య కళాశాలలపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. వైద్య విద్యలో నాణ్యత పెంచేందుకు పిపిపి విధానాన్ని తీసుకువస్తుంటే వక్రీకరించడం దారుణమన్నారు. వాస్తవాలు ప్రజలకు చెప్పకుండా వైకాపా ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఐదేళ్ళ పాలనలో ఒక్క ప్రాజెక్ట్ కూడా వైకాపా తీసుకురాలేదని గుర్తు చేశారు. రాజకీయ నాటకాలను ఆపాలని కొమ్మాలపాటి శ్రీధర్ హెచ్చరించారు.



## బంగారు వర్తకుల రోడ్‌షోతో అవగాహన




నరసరావుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : బంగారు వర్తకులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్‌షోలతో అవగాహన కల్పిస్తున్నామని రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ అన్నారు. భీమవరంలో బుధవారం బంగారు, వెండి వర్తకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్‌షోను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రత్యేక నగల ప్రదర్శనకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ బంగారు, వెండి వస్తువులతో పాటు వజ్రాల విక్రయాలపై వ్యాపారులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిఎస్‌టి తగ్గింపుతో అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గాయని, వీటిని గమనించాలన్నారు. వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు ముందుంటామని కపలవాయి విజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

## రెండు చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్



నరసరావుపేట క్రైం, అక్టోబర్ 8 ప్రభాతవార్త : రెండు చోరీ కేసుల్లో నిందితులను వన్‌టౌన్ సి.ఐ. విజయ్‌చరణ్ బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్.ఐ. పి.వంశీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. రెండు వేర్వేరు దొంగతనాల కేసులలో విచారణ జరిగిందన్నారు. ఆగస్టు నెలలో వన్‌టౌన్‌లో దాసరి ప్రణీత తమ ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ జరిగాయని ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు. నిందితురాలు వాళ్ళ ఇంటి పనిమనిషి భూలక్ష్మిగా పోలీసులు గుర్తించి సాంకేతిక ఆధారాలతో బంగారం అమ్మేందుకు వచ్చిన సమయంలో కాపుకాసి తమ సిబ్బంది పట్టుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా ఏడుకొండలు సెప్టెంబర్ 4న చిత్రాలయ సెంటర్‌లో తన జేబు నుండి రూ.50 వేలు దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు ఇచ్చారన్నారు. నిందితుడు షేక్.బాజీ రద్దీగా ఉన్న సమయంలో జేబు నుండి రూ.50 వేలు కాజేసినట్లు సిసి పుటేజ్ ఆధారంగా కనిపెట్టడం జరిగిందన్నారు. పోలీస్ సిబ్బందిని సి.ఐ. విజయ్‌చరణ్ అభినందించారు.

## పల్నాడు జిల్లా వైకాపా సమావేశం



నరసరావుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా వైకాపా విస్తృతస్థాయి సమావేశాన్ని పట్టణంలో బుధవారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రాజ్యసభసభ్యులు వై.వి.సుబ్బారెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు పూనూరి గౌతమ్‌రెడ్డి, మాజీమంత్రి విడుదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పాలన మోసాలమయం అన్నారు. రాష్ట్రాన్ని వైకాపా అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్‌పరం చేస్తూ తమవారికి దోచిపెడుతుందన్నారు. నకిలీ మద్యం తయారు చేస్తూ ప్రజల ప్రాణాలను తీస్తున్నారని విమర్శించారు. ప్రతి రోజూ రూ.45 కోట్ల నకిలీ మద్యం తయారు చేసి బెల్టుషాపుల ద్వారా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు రూ.5200 కోట్ల అక్రమ మద్యంతో పేద కుటుంబాల కష్టాన్ని దోచుకున్నారని విమర్శించారు. ప్రశ్నించడానికి రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కళ్యాణ్ అక్రమ మద్యంతో ప్రాణాలు పోతుంటే కనీసం నోరు మెదపడం లేదన్నారు. తాను అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వ భూములు తమ వారికి కట్టబెడుతూ ప్రజల ఆస్థిని లూటీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. నమ్మి ఓటు వేస్తే అందరిని మోసం చేశారన్నారు. ఇప్పుడు ప్రజలు జగన్ ఉండి ఉంటే తమకు బాగుండేదని అంటున్నారని తెలిపారు.ఖచ్చితంగా కార్యకర్తలను వేధించే వారికి డిజిటల్ బుక్ ద్వారా రాబోయే రోజుల్లో సరైన సమాధానం చెప్తామన్నారు. పోలీస్‌శాఖను తమ పర్సనల్ డిపార్ట్‌మెంట్‌గా మార్చివేశారని, పోలీసులను చూసి భయపడే రోజులు పోయాయని తెలిపారు.

## ఈశ్వర్ విద్యార్థుల సేవా కార్యక్రమాలు

నరసరావుపేట టౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త : ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కనుపర్రు గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్షులు షేక్.కరీమ్, హెచ్ఎం మోహన్‌రెడ్డి, ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ నీరజ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. మొక్కలు నాటి వాటిని పెంచడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. భవిష్యత్తు తరాలకు ఇచ్చే ఆస్థి ఏమైనా ఉంటే అవి మొక్కలేనని తెలిపారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ షేక్.మస్తాన్‌షరీఫ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పిఎన్‌సి అండ్ కెఆర్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ఫిరంగిపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త : పిఎన్‌సి అండ్ కెఆర్ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలను బుధవారం నిర్వహించారు. దివీస్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ ప్రతినిధులు వివిధ కళాశాలల నుండి వచ్చిన 52 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారిలో 20 మంది విద్యార్థులకు అన్ని విభాగాలలో ప్రతిభ చూపడంతో ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల కార్యదర్శి ప్రేమ్‌చంద్ తెలియజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.5 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందని కార్యదర్శి శ్రీనివాసప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేజర్ వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రా బ్యాంక్ వద్ద చోరీ

సత్తెనపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త : పట్టణంలోని ఆంధ్రా బ్యాంక్ వద్ద బుధవారం చోరీ సంఘటన చోటు చేసుకుంది. సత్తెనపల్లి చెక్‌పోస్ట్ సెంటర్‌లో ఎరువులు కొనుగోలు చేసేందుకు బైక్ కవర్‌లో రూ.3 లక్షలు ఉంచారు. అయితే క్షణాల్లో ఆ నగదు మాయమైందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పెద్ద మొత్తంలో బ్యాంక్‌ల వద్ద చోరీలు జరుగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 'రాజకీయాల్లో రామ్‌విలాస్ పాశ్వన్ చెరగని ముద్ర'



సత్తెనపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త : భారత రాజకీయాలలో రామ్‌విలాస్ పాశ్వన్ చెరగనిముద్ర వేసుకున్నారని లోక్ జనశక్తిపార్టీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ అన్నారు. రామ్‌విలాస్ పాశ్వన్ 5వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పరివర్తన ఆశ్రమంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. న్యాయవాది అయిన పాశ్వన్ 8 పర్యాయాలు రాజ్యసభకు ఎంపికయ్యారన్నారు. ఆరుగురు ప్రధాన మంత్రుల వద్ద కీలక మంత్రి పదవులను అలంకరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, గంగరాజు, షేక్.సుభాని, కిషోర్, రాబర్ట్ పాల్గొన్నారు.

## 'న్యాయవాదులకు ఇచ్చిన రుణాలను మాఫీ చేయాలి'



సత్తెనపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త : న్యాయవాదులకు ఇచ్చిన రుణాలను మాఫీ చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు నరిశేటి వేణుగోపాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోవిడ్ సమయంలో అప్పటి ప్రభుత్వం రూ.10 వేలు, రూ.20 వేలు న్యాయవాదులకు లోను రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. అయితే న్యాయవాదులు తిరిగి వాటిని చెల్లించలేని పరిస్థితులలో ఉన్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల పేరిట అన్ని వర్గాల ప్రజలకు వేల రూపాయల డబ్బులను ప్రజలకు ఇస్తున్నారన్నారు. న్యాయవాదులకు ప్రభుత్వం న్యాయం చేయాలని నరిశేటి వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి ముస్తాబు

రాజుపాలెం, అక్టోబరు 8 ప్రభాతవార్త : మండల కేంద్రమైన రాజుపాలెంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని తిరిగి ముస్తాబు చేస్తున్నారు. విగ్రహ పరిసరాలను చదును చేసి సిమెంట్ కాంక్రీట్‌తో ఫ్లోరింగ్ చేసినట్లు గ్రామ సర్పంచ్ పి.అశోక్ తెలియజేశారు. అదే విధంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి చుట్టూ ఫ్లోరింగ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, రమేష్, కె.శ్రీనివాసరావు, డి.రామారావు, పి.అంకమ్మరావు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ ఈదా సాంబిరెడ్డికి అభినందన




పెదకూరపాడు, అక్టోబరు 8 ప్రభాతవార్త : మండలంలోని 75 తాళ్ళూరు గ్రామానికి చెందిన ఈదా సాంబిరెడ్డి వైకాపా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌గా ఎన్నికైన ఆయనను తన నివాసంలో అభిమానులు అభినందించారు. ఈదా గతంలో పెదకూరపాడు ఎంపీపీగా, క్రోసూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా పని చేశారు. పార్టీ కోసం అహర్నిశలు పని చేసినందుకు అధిష్ఠానం ఈ అవకాశం ఇచ్చిందని సాంబిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనుముక్కల సుధాకర్‌రావు, ఇనుముక్కల అచ్చేశ్వరరావు, భూతం బాబూరావు, భూతం నరసయ్య, సర్పంచ్ ఇనుముక్కల ముసలయ్య పాల్గొన్నారు.

## మండల వ్యవసాయ అధికారి స్పందన: -'వార్త' ప్రభావం



పెదకూరపాడు, అక్టోబరు 8 ప్రభాతవార్త : పెదకూరపాడులో వర్ష భీభత్సం అనే "వార్త కథనం" పై అధికారులు స్పందించారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. తక్కువ కాల పరిమితితో వర్షం పడి వెళ్ళిన తర్వాత ఉండే పంటలను సాగు చేయాలన్నారు. అధిక వర్షం వలన వచ్చిన వాగులు, కాలువల పక్కన ఉన్న పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపాలన్నారు. అక్కడక్కడ పల్లపు ప్రాంతాలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపిన తర్వాత యూరియా 30 కేజీలు, పొటాష్ 15 కేజీలు ఎకరాకు చొప్పున వెదజల్లుకోవాల్సిందిగా సూచించారు. పత్తిలో ఆకుమచ్చ, బ్యాక్టీరియా తెగుళ్ళు వృద్ధి చెందకుండా ఆక్సిక్లోరైడ్, స్టెప్టో సైక్లిన్ మందులను పిచికారి చేసుకోవాలన్నారు.

## ఆర్టీసీ బస్సు పై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం




అమరావతి, అక్టోబరు 8 ప్రభాతవార్త : మండలంలోని ఎండ్రాయి గ్రామం బ్రిడ్జి వద్ద బుధవారం సాయంత్రం 33 కేవీ కరెంటు స్తంభం విరిగిపోయి బస్సు పై పడింది. వర్షం కారణంగా నేల నాని ఉండటంతో స్తంభం ఒక్కసారిగా బస్సుపై కూలింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు, వాహన దారులకు ఎలాంటి ఆటంకం కలుగలేదని స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారంతో విద్యుత్ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కిలో మీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న అమరావతి ఎస్.ఐ. రాజశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ప్రజలు అధైర్యపడవద్దని ఎలాంటి ప్రమాదం లేదని ప్రయాణికులకు సూచించారు.

## పిఎన్ కళాశాలలో జిఎస్టి 2.0 పై అవగాహన



పెదనందిపాడు అక్టోబర్ 8. (ప్రభాతవార్త) పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జిఎస్టి ( గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్)2.0 రిఫార్మ్స్ పై విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కామర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సెమినార్ నిర్వహించడం జరిగినది. ఈ సెమినార్ లో పాల్గొన్న వివిధ శాఖలకు చెందిన అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులకు జిఎస్టి లోని పలు స్లాబ్ లు మరియు జిఎస్టి 2.0 రిఫార్మ్స్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు జీఎస్టి పై ఉపన్యాసం, వ్యాసరచన మరియు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ మరియు ప్రైజులు ఇవ్వడం జరిగినది. ఉపన్యాసం నందు సీనియర్ సి.ఈ.సి చదువుతున్న జె.సింధు ప్రియా ప్రథమ స్థానంలో నిలవగా టీ కృపా అమృత ద్వితీయ స్థానంలో నిలిచారు. వ్యాసరచన పోటీలలో ప్రథమ బి.ఎస్సి లో సి.హెచ్ లక్ష్మీ ప్రణతి ప్రథమ స్థానంలోనూ, జూనియర్ సీ.ఈ. సీ లో నాగ శ్రీరామ్ ద్వితీయ స్థానంలోనూ మరియు సీనియర్ సి.ఈ.సి లో జి అమ్ములు తృతీయ స్థానంలో నిలిచారు. చిత్రలేఖనం పోటీలలో సీనియర్ ఎం.పీ.సీ పి వైష్ణవి ప్రథమ స్థానంలో, ప్రథమ బీ.ఎస్సీ లో వాసిమల్ల రాజి మరియు ప్రథమ బీ.కాంలో జి యశస్విని తృతీయ స్థానంలో నిలిచినారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి వీర రాఘవయ్య , వైస్ ప్రిన్సిపాల్ కె ప్రతాప్ కుమార్ , ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్, ఇన్చార్జి సూపర్నెంట్ డి లక్ష్మీ నారాయణ. అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తి మృతికి కారణమైన ఆటో గుర్తింపు..పోలీసుల అదుపులో డ్రైవర్



యడ్లపాడు, అక్టోబర్ 8, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం నుండి చెంఫీస్కాన్‌పేట మార్గంలో చోటుచేసుకున్న వ్యక్తి మృతికి సంబంధించిన ఆటోను గుర్తించి, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవటం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు టౌన్ సంగడిగుంట కాలనీకి చెందిన షేక్ సైదాకు నలుగురు కుమారులని, ఇందులో చిన్నవాడు షేక్ రహీం(47) ఒకడని, అయితే రహీం తన స్నేహితుడు చెంఫీస్కాన్‌పేట చెందిన రాళ్లబంది శివ నాగేంద్ర బాబుతో కలసి ఎపి 39యూజి 7847నంబర్ గల ఆటోలో చెంఫీస్కాన్‌పేట బయలుదేరారని, మార్గమధ్యలో శివనాగేంద్రబాబు ఆటోను అతి వేగంగా మరియు అజాగ్రత్తగా నడపడం వల్ల ఆటో తిరగబడిందని, ఈప్రమాదంలో షేక్ రహీం తీవ్ర తల గాయాలతో సంఘటనా స్థలంలోనే మరణించటం జరిగిందన్నారు. రహీం కుటుంబ సభ్యులు చిలకలూరిపేట ప్రభుత్వ అసుపత్రికి వెళ్లి మృతుడిని నిర్ధారించుకున్నారని, మృతుడి తండ్రి షేక్ సైదా ఇచ్చిన ఫిర్యాదు అధారంగా కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో మరియు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించటం జరిగిందన్నారు.

## అత్యున్నత న్యాయస్థానంపై దాడి ప్రయత్నం హేయమైన చర్య : ఎంఐఎం

ఫిరంగిపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త : దేశ అత్యున్నత న్యాయస్థానంపై దాడి ప్రయత్నం హేయమైన చర్య అని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు మౌలాలి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశ లౌకిక పునాదిని కూల్చివేసి న్యాయ వ్యవస్థను మతపరమైన బొమ్మగా మార్చేందుకు ప్రయత్నిస్తున్న శక్తులకు ఇది పరాకాష్ట అన్నారు. న్యాయమూర్తి గవాయిపై చెప్పుతో దాడికి ప్రయత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

MN 9_9-10Pg5.qxd 10/8/2025 10:00 PM Page 1



# మద్రాసు హైకోర్టు తీర్పుపై సుప్రీంలో విజయ్ సవాల్

## సిట్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నదని ఆరోపణ

**చెన్నై, అక్టోబరు 8:** తమిళనాడులోని కరూర్‌లో టీవీకే చీఫ్ విజయ్ నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 60 మందికిపైగా గాయపడ్డారు. ఇక ఈ ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీవీకే పార్టీ సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. సిట్ దర్యాప్తును దేశ అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. ఐపీఎస్ అధికారి అశ్రా గార్గ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను టీవీకే సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఘటనపై దర్యాప్తునకు హైకోర్టు రాష్ట్ర పోలీసు అధికారులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తమ పార్టీ పట్ల సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాపు జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. కాగా, కరూర్ ఘటన విషయంలో విజయ్ తీరును మద్రాసు హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టిన విషయం తెలిసిందే. తొక్కిసలాట జరిగిన వెంటనే టీవీకే అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ అక్కడ నుంచి మాయం కావడం, ఆయనపై ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పు పట్టింది. ఇదేం రాజకీయ పార్టీ అంటూ టీవీకేని విమర్శించిన జస్టిస్ ఎన్ సెంథిల్‌కుమార్ తొక్కిసలాట మరణాల తర్వాత అక్కడి నుంచి ఆ పార్టీకి చెందిన బాధ్యులందరూ పారిపోయారని, ఎవరూ బాధ్యతను తీసుకోలేదని మండిపడ్డారు.

ముఖ్యంగా పిల్లలు, మహిళలు మరణించడాన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి టీవీకే వ్యవహార శైలిని ఖండించారు. దుర్ఘటన పట్ల టీవీకే కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని, ఆ పార్టీ నాయకుడి మానసిక స్థితికి ఇది అద్దం పడుతుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తును కోరుతూ దాఖలైన పిటిషన్‌ని తిరస్కరించిన కోర్టు సీనియర్ ఐపీఎస్ అధికారి, నార్త్ జోన్ ఐజీ అస్రా గర్గ్ నేతృత్వంలో సిట్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. ఘటనపై 'సిట్' దర్యాప్తు మొదలైంది. సిట్‌లో తనతోపాటు మరో ఇద్దరు ఐపీఎస్ స్థాయి అధికారులు సహా 11మంది పోలీసు అధికారులు ఉన్నారని సిట్ ప్రధాన అధికారి గార్గ్ చెప్పారు. ఘటనాస్థలాన్ని సిట్ అధికారులు పరిశీలించారు.

# దీపావళికి కాలిఫోర్నియాలో ప్రభుత్వ సెలవు



**కాలిఫోర్నియా, అక్టోబరు 8:** భారత్‌లో ఎంతో పవిత్రంగా జరుపుకునే దీపావళి పండుగకు అమెరికాలోని కాలిఫోర్నియాలో గుర్తింపు దక్కింది. దీపావళిని రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఆ రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించింది. ఈ మేరకు ఏబీ-268 బిల్లుపై కాలిఫోర్నియా గవర్నర్ గ్యావిన్ న్యూసమ్ సంతకం చేశారు. దీపావళిని రాష్ట్ర పండుగగా గుర్తించాలని ప్రతిపాదిస్తూ గతంలోనే ఆ దేశ కాంగ్రెస్‌లో ఓ బిల్లును తీసుకొచ్చారు. ఇప్పుడు దానికి ఆమోదం లభించింది. తాజాగా ఈ బిల్లును గవర్నర్ కూడా ఆమోదించడంతో ఇది చట్టంగా మారింది. 2026 జనవరి 1వ తేదీ నుంచి ఇది అమలులోకి రానుంది. దీని ప్రకారం కాలిఫోర్నియా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి రోజు వేతనంతో కూడిన సెలవు లభిస్తుంది. అలాగే పాఠశాలలు, కమ్యూనిటీ కాలేజీలకు కూడా సెలవు ఇవ్వొచ్చు. అయితే కోర్టులకు మాత్రం ఈ సెలవు వర్తించదని నిబంధనలు చెబుతున్నాయి. ఇప్పటికే అమెరికాలోని పెన్సిల్వేనియా, కనెక్టికట్ రాష్ట్రాలు దీపావళిని రాష్ట్ర పండుగగా గుర్తించాయి. ఇప్పుడు ఈ జాబితాలో మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. కాగా, అమెరికాలో భారతీయ సంస్కృతికి ఇది గొప్ప గుర్తింపు అని సాంస్కృతిక వైవిధ్యానికి గౌరవం తెలిపే చారిత్రక అడుగు అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఎగుమతుల స్థాయికి చేరిన మేడిన్ఇండియా 4జిస్టాక్

## ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** టెలికాం రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని అందుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన మేడ్‌ఇన్‌ఇండియా 4జీ స్టాక్ ఇప్పుడు ఎగుమతికి సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రకటించారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2025 ప్రారంభ సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు ఇది నిదర్శనమని అన్నారు. గత దశాబ్ద కాలంలో దేశ టెలికాం రంగం అద్భుతమైన పురోగతి సాధించిందని ప్రధాని గుర్తుచేశారు. ఒకప్పుడు 2జీ నెట్‌వర్క్ కోసం ఇబ్బంది పడిన స్థాయి నుంచి నేడు దేశంలోని దాదాపు అన్ని జిల్లాలకు 5జీ సేవలు విస్తరించాయని ఆయన తెలిపారు. ఒకప్పుడు వెనుకబడిన మనం, ఇప్పుడు చాలా దూరం ప్రయాణించాం. నేడు దేశం నలుమూలలా 5జీ అందుబాటులో ఉందని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా లక్ష టవర్ల ఏర్పాటు ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని, భారీ టెలికాం మౌలిక సదుపాయాలను నిర్మించడంలో మన సామర్థ్యాన్ని ఇది రుజువు చేసిందని పేర్కొన్నారు. ఈ కొత్త 4జీ టెక్నాలజీ ద్వారా వేగవంతమైన ఇంటర్నెట్, నమ్మకమైన సేవలు, అంతరాయం లేని కనెక్టివిటీ సాధ్యమవుతాయని, ఇది టెక్నాలజీలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని మోదీ చెప్పారు. 2014 నుంచి దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగిందని, మొబైల్ ఫోన్ల తయారీ 28 రెట్లు పెరిగిందని ప్రధాని మోదీ గణాంకాలతో వివరించారు. ఇదే సమయంలో మొబైల్ ఎగుమతులు ఏకంగా 127 రెట్లు పెరిగాయని చెప్పడం గమనార్హం. ఈ ఘనత వెనుక స్టార్టప్‌ల ఆవిష్కరణలు, యువత శక్తి ఉన్నాయని ఆయన ప్రశంసించారు. డిజిటల్ ఇన్నోవేషన్ స్క్వేర్, టెలికాం టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ వంటి పథకాలు కొత్త ఆలోచనలకు నిధులు అందించి ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఆధునిక చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరమని ప్రధాని నొక్కి చెప్పారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఇప్పుడు ఆసియాలోనే అతిపెద్ద డిజిటల్ టెక్నాలజీ ఫోరంగా ఎదిగిందని, ఇది దేశ ప్రతిభకు, ఆవిష్కరణలకు ప్రపంచ వేదికగా నిలుస్తోందని మోదీ అన్నారు.

# జుబిన్‌గార్గ్ కజిన్ సందీపన్‌గార్గ్ అరెస్ట్

**గువాహతి, అక్టోబరు 8:** అసోంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ మృతి కేసులో ఆయన కజిన్, అసోం పోలీస్ సర్వీస్ అధికారి సందీపన్ గార్గ్‌ను అరెస్టు చేశారు. జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జుబీన్ గార్గ్ మృతి చెందిన సమయంలో సందీపన్ ఆయనతోనే ఉన్నారు. ఈ మృతిపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ వరుస విచారణలు జరిపిన అనంతరం సందీపన్‌ను అదుపులోకి తీసుకుంది. జుబీన్ గార్గ్ ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించగా, వారి ఖాతాల్లో దాదాపు రూ. 1 కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్ట్ కోసం జుబీన్ గత నెలలో సింగపూర్ వెళ్లారు. సెప్టెంబర్ 19న యాట్ పార్టీలో భాగంగా ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు.





# బీహార్ కూటముల్లో సీట్ల తకరారు

## అడిగిన సీట్లు ఇవ్వాల్సిందే - లేదంటే మా దారి మాదే

### తేల్చి చెబుతున్న చిన్నపార్టీలు - తలపట్టుకుంటున్న కూటమి నేతలు

### కొలిక్కిరాని సీట్ల సర్దుబాటు - రేపే తొలి దశ నోటిఫికేషన్

**పాట్నా, అక్టోబర్ 8:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదునుపెడుతున్నారు. శుక్రవారం 10వ తేదీన తొలి దశ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా, సీట్ల సర్దుబాటుపై పార్టీలు దృష్టి సారించాయి. అధిక బీహార్‌లో ఎన్‌డీఏ, మహాఘట్ బంధన్ కూటములు ఉన్న విషయం తెలిసిందే. ఈ కూటముల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. శుక్రవారం తొలి దశ నోటిఫికేషన్ రానుంది. ఈ నేపథ్యంలో కూటముల్లోని ఆయా పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుకు ప్రాథమిక చర్చలు ప్రారంభమయ్యాయి. కూటముల్లోని చిన్న పార్టీలు ఈసారి తమకు గతం కంటే ఎక్కువ స్థానాలు పట్టుబడుతున్నాయి. అధికార ఎన్‌డియే కూటమిలో సీట్ల పంపకాలపై ఇప్పటికే నేతల మాటల యుద్ధం జరుగుతోంది. కీలక భాగస్వామి, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఈ సారి తమకు 45-50 స్థానాలు ఇవ్వాల్సిందే, లేదంటే తమ దారి తాము చూసుకుంటామని బిజెపి పెద్దలకు తేల్చిచెప్పారు. మరో కేంద్ర మంత్రి, హెచ్‌ఏఎం అధినేత జితన్ రామ్ మాంజీ కూడా కూటమి నేతలకు అల్టిమేటమ్ జారీ చేశారు. తమకు 15 సీట్లకు తక్కువ కాకుండా చూడాలని ప్రతిపాదించారు. అయితే, బిజెపి అగ్రనాయకత్వం మాత్రం ఆచితూచి అడుగులేస్తోంది. ఎన్‌డియేలో కీలక భాగస్వామ్య పార్టీలైన బిజెపి- జెడియులు చెరో 103, 102 స్థానాల్లో పోటీ చేయాలని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. మిగిలిన 38 స్థానాలను కూటమిలోని పార్టీలకు సర్దుబాటు చేయడానికి బిజెపి పెద్దలు, సిఎం నితీశ్ కుమార్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చిరాగ్‌కు 20 సీట్లు, మాంజి, ఉపేంద్ర కుష్వాహకు 10, 8 సీట్లు కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించి నట్లు ఎన్‌డియే వర్గాలు తెలిపాయి. రెండు మూడు రోజుల్లో కూటమి నేతల మధ్య చర్చలు కొలిక్కి వస్తాయని, సీట్ల సర్దుబాబుపై ప్రకటన ఉంటుందని బిజెపి నేతలు చెబుతున్నారు. ఇప్పటికే చిరాగ్‌తో తమ పార్టీ అగ్రనాయకత్వం చర్చలు జరుపుతోందని, అంతా సర్దుకుంటుం దని అభిప్రాయం వ్యక్తం చేశారు. అటు మహాఘట్ బంధన్‌లో కూడా సీట్ల సర్దుబాటుపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. అయితే, మహాఘట్ బంధన్‌లోని ఆయా పార్టీల సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో ప్రచారం ప్రారంభించాలని ఆదేశించినట్లు పార్టీ వర్గాల సమాచారం. అనధికారిక సమాచారం ప్రకారం, ఆర్‌జెడీ ఈసారి 130 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయనుందని, కాంగ్రెస్ 50 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టే అవకాశ ముంది. వామపక్ష పార్టీలు సిపిఐ, సిపిఐ(ఎంఎల్), సిపిఐ(ఎం) మొత్తం 35 స్థానాలు, లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి) పరాస్ వర్గానికి 2 సీట్లు, జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) 6 సీట్లు లభిస్తాయని మహాఘట్‌బంధన్ వర్గాలు తెలిపాయి. కూటమిలో అతిపెద్ద పార్టీగా ఆర్‌జెడి అత్యధిక సీట్లలో పోటీ చేయనుంది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్ బరిలో దిగనున్నారు. ఈసారి రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు ఆర్‌జెడి వర్గాలు తెలిపాయి. కొంతమంది కాంగ్రెస్ నాయకులు మొదట్లో 70 సీట్లకు పైగా డిమాండ్ చేయగా, రాహుల్ గాంధీ - తేజస్వి యాదవ్ మధ్య జరిగిన సమావేశం తర్వాత 50 సీట్లకు అంగీకారం కుదిరిందని సమాచారం. గత ఎన్నికల్లో దాదాపు 9శాతం ఓట్లతో కాంగ్రెస్ 19 సీట్లు గెలుచుకుంది. ఈ సారి తమకు ఎక్కువ స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు వాదించినట్లు తెలుస్తోంది. కానీ మహాఘట్ బంధన్‌లో ఐక్యతను కాపాడటానికి, కాంగ్రెస్ పార్టీ రాజీ ఫార్ములాకు అంగీకరించాలని నిర్ణయించుకుని ఉండవచ్చు అని సమాచారం. గత ఎన్నికల్లో సిపిఐ(ఎంఎల్) అత్యుత్తమ ఫలితాలు సాధించడంతోపాటు, ఆర్‌జెడి, కాంగ్రెస్‌కు అనేక నియోజకవర్గాల్లో సహాయ పడింది. దాంతో ఈసారి మహాఘట్ బంధన్‌లో వామపక్షాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఈసారి సిపిఐ (ఎంఎల్) 20 స్థానాల్లో, సిపిఐ 8, సిపిఎం 7 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. సీమాంచల్, మగధ్, తిర్హుట్ ప్రాంతాల్లో మహాపక్షాలకు పటిష్టమైన కేడర్‌తోపాటు గతంలో ఎన్‌డియేలో భాగమైన ముఖేష్ సాహ్ని వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) ఈసారి మహాఘట్‌బంధన్‌తో చేతులు కలిపింది. విఐపికి 20 స్థానాలు కేటాయించే అవకాశ ముంది. జెఎంఎం సీమాంచల్, జార్ఖండ్ సరి హద్దులోని ఆరు స్థానాల్లో పోటీ చేయనుంది. పశుపతి కుమార్ పరాస్ వర్గమైన లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి-ఆర్‌వి)కి రెండు సీట్లు దక్కనున్నాయి. ఇదిలా ఉండగా, మహాఘట్ బంధన్‌లోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుకు సంబంధించిన రెండు రోజుల్లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి, తుది నిర్ణయం తీసుకుంటామని ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. కూటమిలోని పార్టీల మధ్య సీట్లకు సంబంధించి ఎలాంటి తకరారు లేదని, ఒకసారి అంతా కూర్చుని మాట్లాడుకుంటే సర్దుకుంటుందని పేర్కొన్నారు. మరోవైపు ప్రశాంత్ కిశోర్, అసదుద్దీన్, అరవింద్ కేజ్రీవాల్ కూటములతో సంబంధం లేకుండా ఒంటరిగా బరిలోకి దిగనున్నాయి. కేజ్రీవాల్ ఇప్పటికే 'ఆప్' తరఫున 11 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. ఎంఐఎం అధినేత మాత్రం ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పోటీ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఏదిఏమైనా రెండు మూడు రోజుల్లో కూటముల మధ్య సీట్ల సర్దుబాటుకు సంబంధించి ప్రకటన వెలువడే అవకాశముంది.

# హైవేపై 65 కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్‌జామ్

**పాట్నా, అక్టోబరు 8:** దేశంలోని అత్యంత రద్దీ జాతీయ రహదారుల్లో ఒకటైన ఢిల్లీకోల్‌కతా హైవే (ఎన్‌హెచ్19)పై ప్రయాణం నరకంగా మారింది. బీహార్‌లో గత నాలుగు రోజులుగా ఏకంగా 65 కిలోమీటర్ల పొడవునా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వందలాది వాహనాలు రోడ్లపైనే నిలిచిపోవడంతో డ్రైవర్లు, ప్రయాణికులు తిండి, నీళ్ల లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే, బీహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో గత శుక్రవారం కురిసిన కుండపోత వర్షాల కారణంగా ఈ దుస్థితి తలెత్తింది. జాతీయ రహదారి 19పై ఆరు వరుసల రహదారి నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మళ్లింపులు, సర్వీస్ రోడ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారి, నీరు నిలిచిపోయింది. వాహనాలు బురదలో కూరుకుపోతుండటంతో ట్రాఫిక్ గంటగంటకు మరింత తీవ్రమవుతోంది. రోహ్‌తాస్ జిల్లాలో మొదలైన ఈ ట్రాఫిక్ జామ్ దాదాపు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఔరంగాబాద్ వరకు విస్తరించింది. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, వాహనాలు 24 గంటల్లో కేవలం 5 కిలోమీటర్లు కూడా ముందుకు కదలడం లేదు. గత 30 గంటల్లో మేము కేవలం 7 కిలోమీటర్లే ప్రయాణించాం. టోల్, రోడ్ ట్యాక్స్‌లు అన్నీ కడుతున్నా గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నాం. ఇక్కడ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) సిబ్బందిగానీ, స్థానిక అధికారులుగానీ కనిపించడం లేదని ప్రవీణ్ సింగ్ అనే ట్రక్కు డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా ట్రాఫిక్‌లోనే ఉన్నాం. ఆకలి, దాహంతో అల్లాడుతున్నాం. కొన్ని కిలోమీటర్లు దాటడానికే గంటలు పడుతోందని సంజయ్ సింగ్ అనే మరో డ్రైవర్ వాపోయారు. ఈ ట్రాఫిక్ జామ్ వల్ల పండ్లు, కూరగాయల వంటి త్వరగా పాడైపోయే సరుకులను రవాణా చేస్తున్న డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. అత్యవసర సేవలు అందించే అంబులెన్సులు, పర్యాటక వాహనాలు, పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించాలని



ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ రంజిత్ వర్మను కోరగా, ఆయన కెమెరా ముందు మాట్లాడటానికి నిరాకరించారు. స్థానిక యంత్రాంగం గానీ, నిర్మాణ సంస్థ గానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# వద్దన్నా వినకుండా విహారయాత్రకు వెళ్లిన పంజాబీ గాయకుడు మృతి!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** పంజాబీ గాయకుడు రాజ్‌వీర్ జవాండా (35) బుధవారం మృతి చెందారు. భార్య వద్దన్నా విహారయాత్రకు వెళ్లిన ఆయనకు ఇటీవల ప్రమాదం జరిగింది. దీంతో 11 రోజులుగా వెంటిలేటర్‌పై ఉన్న ఆయన బుధవారం ప్రాణాలు కోల్పోయారు. జవాండా తన మోటార్ సైకిల్‌పై ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాకు విహారయాత్రకు బయలుదేరారు. సోలన్ జిల్లా సమీపంలో అడ్డుగా వచ్చిన పశువులను ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఆయన తల, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అక్కడి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో మొహాలీలోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. దాదాపు 11 రోజులుగా ఆయన వెంటిలేటర్ పైనే ఉన్నారు. ఈ క్రమంలో తాజాగా ఆయన ప్రాణాలు కోల్పోయారు. అయితే విహారయాత్రకు వెళ్లవద్దని జవాండా భార్య ముందుగానే హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆమె మాటలు జవాండా వినలేదని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఇక, గాయకుడి మృతిపై ఆప్ నేత మనీష్ సిసోడియా సహా పలువురు ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. జవాండా లుధియానా జాగ్రావ్‌లోని పోనా గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన పంజాబీలో పలు పాటలు పాడారు. పాటలు పాడటమే కాకుండా సుబేదార్ జోగిందర్ సింగ్, 'జింద్ జాన్, మిండో తసీల్‌దర్ని' వంటి చిత్రాల్లోను నటించారు.

# అమెరికాలో కాల్పులు: మరో భారతీయుడు బలి

**పిట్స్‌బర్గ్, అక్టోబరు 8 :** అమెరికాలో కాల్పుల మోతకు మరో భారతీయుడు బలయ్యాడు. పెన్సిల్వేనియాలోని పిట్స్‌బర్గ్‌లో మోటెల్ వ్యాపారి రాకేశ్ ఎహగబన్ (51)ను ఓ వ్యక్తి పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో తలపై గన్‌తో కాల్చాడు. ఈ ఘటనలో రాకేశ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గత శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాకేశ్ ఎహగబన్ పిట్స్‌బర్గ్‌లోని రాబిన్సన్ టౌన్‌షిప్‌లో మోటెల్ నడిపిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం తన మోటెల్ బయట గొడవ జరుగుతుండటంతో దాన్ని ఆపేందుకు రాకేశ్ బయటకు వెళ్లాడు. ఎందుకు గొడవ పడుతున్నారని అడగడంతో నిందితుడిని తన దగ్గర ఉన్న గన్‌తో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు మోటెల్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రాకేశ్‌పై కాల్పులు జరిపిన వ్యక్తిని స్టాన్లీ యుజెన్ వెస్ట్(37)గా పోలీసులు గుర్తించారు. రాకేశ్ తర్వాతే అక్కడే ఉన్న మరో యువతిపైనా నిందితుడు కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు.

# పురుషులకంటే మహిళల్లోనే డిప్రెషన్ ఎక్కువ!

**మెల్‌బోర్న్, అక్టోబరు 8:** ఆరోగ్యపరంగా వైద్యపరిభాషలో మనం పిలుచుకునే కుంగుబాటు అంటే డిప్రెషన్ రుగ్మతలు పురుషులతో పోలిస్తే మహిళల్లోనే ఎక్కువ కనిపిస్తున్నదని ఎందుకు డిప్రెషన్ ఎక్కువగా కనిపిస్తుందనే ప్రశ్నలకు కూడా శాస్త్రవేత్తలు కీలక సమాధానం కనుగొన్నారు. దీని వెనుక బలమైన జన్యుపరమైన కారణాలు ఉన్నాయని ఆస్ట్రేలియా పరిశోధకులు తమ తాజా అధ్యయనంలో తేల్చారు. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో డిప్రెషన్ చికిత్స విధానంలో విప్లవాత్మక మార్పులకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. క్యూఐఎంఆర్ బెర్గోఫర్ మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే అతిపెద్ద అధ్యయనాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా లక్షలాది మంది డీఎన్‌ఏను విశ్లేషించారు. పురుషులతో పోలిస్తే మహిళల డీఎన్‌ఏలో డిప్రెషన్‌కు కారణమయ్యే జన్యుపరమైన లోపాలుదాదాపు రెట్టింపు సంఖ్యలో ఉన్నాయని ఈ బృంద ం గుర్తించింది. ఈ పరిశోధన వివరాలను సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బ్రిటనీ మిచెల్ వెల్లడించారు. సాధారణంగా మహిళలు తమ జీవితకాలంలో పురుషుల కన్నా రెండు రెట్లు ఎక్కువగా డిప్రెషన్‌కు గురవుతారని మాకు తెలుసు. అయితే దీనికి గల కచ్చితమైన కారణాలపై ఇప్పటివరకు స్పష్టత లేదు. మా అధ్యయనంలో స్త్రీ, పురుషులిద్దరిలో డిప్రెషన్‌కు కారణమయ్యే సుమారు 7,000 జన్యు మార్పులను గుర్తించాం. వీటికి అదనంగా, కేవలం మహిళల్లో మాత్రమే డిప్రెషన్‌కు దారితీసే మరో 6,000 జన్యు మార్పులను కనుగొన్నామని ఆమె తెలిపారు. మరో పరిశోధకురాలు డాక్టర్ జోడి థామస్ మాట్లాడుతూ, మహిళల్లో డిప్రెషన్ లక్షణాలు భిన్నంగా ఉండటానికి కూడా ఈ జన్యువులే కారణమని వివరించారు. మహిళల్లో డిప్రెషన్‌కు సంబంధించిన జన్యువులు, వారి శరీరంలోని జీవక్రియలకు (బరువు పెరగడం లేదా తగ్గడం, నీరసం వంటివి) సంబంధించిన జన్యువులతో ముడిపడి ఉన్నట్టు మేము గమనించాం. అందుకే డిప్రెషన్‌తో బాధపడే మహిళల్లో ఇలాంటి శారీరక లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయని ఆమె పేర్కొన్నారు.

ఈ పరిశోధన ఫలితాలు 'నేచర్ కమ్యూనికేషన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

స్త్రీ, పురుషుల్లో డిప్రెషన్‌కు గల జన్యుపరమైన తేడాలను అర్థం చేసుకోవడం ద్వారా, ఒక్కొక్కరికీ సరిపోయే ప్రత్యేకమైన చికిత్సలను అందించేందుకు ఈ అధ్యయనం మార్గం సుగమం చేస్తుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంక్షిప్తంగా..

## ఆడంబరంగా విడాకుల వేడుక



**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** సమాజంలో విడాకులు తీసుకోవడం అనేది ఎంతో బాధాకరమైనఅంశంగానే హైందవసాంప్రదాయంలో భావిస్తారు. కానీ, ఓ వ్యక్తి మాత్రం తన విడాకులను ఒక పండగలా జరుపుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. భార్య నుంచి విడాకులు మంజూరు కావడంతో ఏకంగా కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నాడు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీరాదర్ డీకే అనే వ్యక్తికి ఇటీవల తన భార్య నుంచి చట్టపరంగా విడాకులు లభించాయి. ఈ ఆనందాన్ని పంచుకోవడానికి అతను వినూత్నంగా వేడుకలు జరుపుకున్నాడు.

## రష్యాకోసం యుద్ధంలో పనిచేసిన భారత్ వ్యక్తి అరెస్టు



**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారత సంతతి వ్యక్తి, 22 ఏళ్ల మజోతి సాహిల్ మొహమ్మద్ హుస్సేన్‌ను ఉక్రెయిన్ దళాలు అరెస్టు చేశారు. గుజరాత్‌లోని మోర్బీకి చెందిన ఆ వ్యక్తి రష్యా ఆర్మీకి విధులు నిర్వహిస్తున్నట్లు ఉక్రెయిన్ ఆరోపించింది. అయితే సాహిల్ అరెస్టు విషయంలో భారతీయ అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. తొలుత చదువు కోసం హుస్సేన్ రష్యాకు వెళ్లాడని, ఆ తర్వాత అతన్ని రష్యా ఆర్మీలో చేర్చుకున్నారని తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు చెందిన 63వ మెకనైజ్డ్ బ్రిగేడ్ ఓ వీడియో రిలీజ్ చేశారు. రష్యాలో డ్రగ్ సంబంధిత నేరంలో దొరికిన హుస్సేన్ ఏడేళ్ల జైలుశిక్ష అనుభవిస్తున్నాడని ఆ బ్రిగేడ్ పేర్కొన్నారు. జైలులో ఉన్న సమయంలో రష్యన్ ఆర్మీలో చేరాలని హుస్సేన్‌తో కాంట్రాక్టు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యా స్పెషల్ మిలిటరీ ఆపరేషన్ కోసం సైనికుల్ని రిక్రూట్ చేస్తున్నది.

## భారత్‌లో అమెరికా రాయబారిగా సెర్జియోగోర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారత్‌కు అమెరికా తదుపరి రాయబారిగా డొనాల్డ్ ట్రంప్ అత్యంత సన్నిహితుడు, విశ్వాసపాత్రుడు అయిన సెర్జియో గోర్ (38) నియామకం ఖరారైంది. అమెరికా సెనేట్‌లో జరిగిన ఓటింగ్‌లో ఆయన నియామకానికి ఆమోదముద్ర లభించింది. దీంతో భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేయనున్న అత్యంత పిన్నవయస్కుడిగా సెర్జియో గోర్ రికార్డు సృష్టించనున్నారు. ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌కు కూడా ఆయన అత్యంత సన్నిహితుడు. గతంలో ట్రంప్ పరిపాలనలో 4,000కు పైగా కీలక నియామకాలను పర్యవేక్షించిన వైట్ హౌస్ ప్రెసిడెన్షియల్ పర్సనల్ ఆఫీస్ డైరెక్టర్‌గా గోర్ పనిచేశారు. ఆగస్టు 22న తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా గోర్ పేరును ట్రంప్ ప్రతిపాదించారు. "ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న ప్రాంతానికి, నా ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు నేను పూర్తిగా విశ్వసించగల వ్యక్తి అవసరం. సెర్జియో ఒక అద్భుతమైన రాయబారి అవుతారు" అని ట్రంప్ ఆనాడు పేర్కొన్నారు.

## జావేద్ హబీబ్, అతని ఫ్యామిలీపై 20 కేసులు నమోదు

**లక్నో, అక్టోబరు 8:** దేశవ్యాప్తంగా పేరుగాంచిన ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ జావెద్ హబీబ్, ఆయన కుటుంబ సభ్యులు తీవ్రమైన మోసం ఆరోపణల్లో చిక్కుకున్నారు. కుటుంబంతో కలిసి ఒక గ్యాంగ్‌లా ఏర్పడి ప్రజలను కోట్ల రూపాయల మేర మోసగించారనే ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ పోలీసులు వారిపై ఏకంగా 20 కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారం సెలబ్రిటీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ కేసు వివరాలను సంభల్ జిల్లా ఎస్పీ కృష్ణ బిష్ణోయ్ మీడియాకు వెల్లడించారు. జావెద్ హబీబ్, ఆయన భార్య, కుమారుడు కలిసి సుమారు రూ.7 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 35 మంది బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేశారని ఆయన పేర్కొన్నారు. 'ఫాలికల్ గ్లోబల్ కంపెనీ' అనే సంస్థ పేరుతో ఈ మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తమ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

## రూ60 కోట్లు డిపాజిట్ చేస్తే వెళ్లొచ్చు: శిల్పా దంపతులకు హైకోర్ట్ షాక్



**ముంబయి, అక్టోబరు 8:** బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్తకు బాంబే హైకోర్టులో గట్టి షాక్ తగిలింది. ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేశారన్న కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ దంపతులు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కోరగా, న్యాయస్థానం వారి పిటిషన్‌ను తిరస్కరించింది. ఒకవేళ దేశం విడిచి వెళ్లాలనుకుంటే, ముందుగా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ.60 కోట్లను డిపాజిట్ చేయాలని కఠిన షరతు విధించింది. ఈ ఆదేశాలను పాటించిన తర్వాతే వారి విజ్ఞప్తిపై తదుపరి విచారణ జరుగుతుందని స్పష్టం చేసింది. శిల్పాశెట్టి దంపతులపై రూ.60 కోట్ల ఆర్థిక మోసం కేసు విచారణలో ఉంది. ఈ కేసు నేపథ్యంలో ముంబయి పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) వీరికి వ్యతిరేకంగా లుకౌట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేసింది.

9-10pg6exHMNWJQE 10_9-10pg6exHMNWJQE.qxd 10/8/2025 11:58 PM Page 1





ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షులు శరత్‌చంద్ర ఆహ్వానం అందిస్తున్న కలిమిశ్రీ

## సాంస్కృతిక ఉత్సవాలకు రండి

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో 22, 23 తేదీలలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నాం, ఆ ఉత్సవాలకు రావాలంటూ తెలుగు సాంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్‌డి విల్సన్‌ను ఉత్సవాల కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ ఆహ్వానించారు. బుధవారంనాడు మంగళగిరిలోని తెలుగు సంస్కృత అకాడమీ కార్యాలయంలో ఆర్.డి.విల్సన్ కలిసి ఈమేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. తెలుగు భాష పరిరక్షణ కోసం, భాష, కళలు, సాహిత్యం, సంస్కృతుల పునర్ వైభవం కోసం ఇలాంటి సాంస్కృతిక ఉత్సవాలు ఎన్నో జరగాల్సిన అవసరముందని ఆర్‌డి విల్సన్ అభిప్రాయపడ్డారు. విల్సన్‌ను కలిసిన వారిలో కలిమిశ్రీతో పాటు ఉత్సవాల కమిటీ బాధ్యులు చొప్పా రాఘవేంద్రశేఖర్, వై.డి. ఆనంద్, విష్ణుభొట్ల రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## రైతు కష్టాలపై సర్కార్ మొసలి కన్నీరు

### రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు



**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో అక్టోబర్ 8, ప్రభాత వార్త:** ఆరుగాలం శ్రమించి పండించిన టమాటాకు కనీస మద్దతు ధర కాదు కదా అగాధంలో కూరుకు పోయే పరిస్థితి వుందని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు అన్నారు. ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి మొసలి కన్నీరు కారుస్తుందని ధ్వజమెత్తారు. మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వంత జిల్లా చిత్తూరులో రైతుల వద్దకు వెళ్ళే దమ్ము ఉందా అంటూ ప్రశ్నించారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు చిత్తూరు జిల్లా పర్యటించాలని సవాల్ విసిరారు. రైతుల కష్టాలు తెలుసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## సిజెఐ గవాయ్ పై దాడి రాజ్యాంగంపై దాడే

### బరవే ప్రధాన కార్యదర్శి తంగిరాల సోని

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజెఐ బి.ఆర్. గవాయ్ పై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమే అని బహుజన రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగమే అందరికీ రక్షణ అని, అటువంటి రాజ్యాంగం పరంగా ఎన్నుకోబడిన సిజెఐ గవాయ్‌పై న్యాయవాది బూట్ విసరడం అంటే రాజ్యాంగాన్ని అవహేళన చేయటం, రాజ్యాంగాన్ని లెక్క చేయకపోవడమే అని, రాజ్యాంగం పట్ల నమ్మకం లేకపోవడమే వీటన్నిటికీ కారణమని అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




## లాయర్ జ్యోత్స్నకు నివాళి

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త:** బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ భార్య గుళ్ళపల్లి జ్యోత్స్న మరణం న్యాయవాదులకే కాదు మహిళలందరికీ కూడ తీరని లోటని బెజవాడ బార్ అధ్యక్షులు ఎకె బాషా అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి, న్యాయవాది, మహిళా హక్కుల ఉద్యమ నేత జ్యోత్స్న మొదటి వర్ధంతి సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్‌లో బుధవారం ఆమె చిత్రపటానికి పూమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె చేసిన ఎన్నో సాంఘిక సేవా కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి బార్ కౌన్సిల్ మెంబరు సుంకర రాజేంద్రప్రసాద్ వారి కుటుంబ సభ్యులు, బిబిఏ గవర్నింగ్ బాడీ, సీనియర్ జూనియర్ న్యాయవాదులు సప్పా రమేష్, బొమ్మసాని రవి, క్రాంతి, చిలువేరు మార్కండేయ తదితరులు పాల్గొని ఆమెకు నివాళి అర్పించారు.

# పకడ్బందీగా ప్రధాని పర్యటన ఏర్పాట్లు

- 16న కర్నూలు జిల్లాకు రాక
- శ్రీశైలంలో జ్యోతిర్లింగం దర్శనం
- శక్తిపీఠ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు
- ఓర్వకల్లులో జిఎస్‌టి సంస్కరణల ఉత్సవ్ సభకు నరేంద్రమోడీ హాజరు
- ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ నెల 16వ తేదీన రాష్ట్ర పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఈ సమీక్షలో మంత్రులు నారా లోకేష్, బిసి జనార్ధన్ రెడ్డి, అనగాని, కందుల దుర్గేష్ పాల్గొన్నారు. సిఎస్, డిజిపిలు సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ క్రమంలో అమరావతి, విశాఖల్లో ప్రధాని పాల్గొన్న కార్యక్రమాలను మించిన స్థాయిలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటనను సక్సెస్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తన పర్యటన సందర్భంగా ప్రధాని శ్రీశైల భ్రమరాంబ, మల్లిఖార్జున స్వామిని దర్శనం చేసుకోనున్నారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే బహిరంగ సభకు హాజరు కానున్నారు. కేంద్రం తెచ్చిన జిఎస్‌టి 2.0 సంస్కరణలను స్వాగతించి.. దేశంలోనే తొలిసారిగా అసెంబ్లీలో అభినందనల తీర్మానం చేసింది ఏపీ ప్రభుత్వం. అలాగే జిఎస్‌టి సంస్కరణల ఉత్సవ్ పేరుతో దసరా నుంచి దీపావళి వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. ఈ క్రమంలో జిఎస్‌టి సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని పాల్గొనే ఈ సభను విజయవంతం చేసేలా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ సభ నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రధాని పర్యటన సందర్భంగా వాతావరణ పరిస్థితులను చూసుకుని.. దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రధాని సభకు వచ్చే సభికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని, ఆహారం, తాగునీరు సౌకర్యం కల్పించాలని, సభకు వచ్చే అప్రోచ్ రోడ్లను పూర్తి చేయాలని, పార్కింగ్ నిమిత్తం ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



అమరావతి ప్రెస్ క్లబ్ వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

### అమరావతి ప్రెస్ క్లబ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

అమరావతి జర్నలిస్టులు రూపొందించిన ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి ప్రెస్ క్లబ్ కమిటీకి, జర్నలిస్టులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాజధాని ప్రాంతంలోని జర్నలిస్టులు అంతా కలిసి ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి ఏర్పాటు చేసుకోవడంతో పాటు నేడు వెబ్ సైట్‌ను రూపొందించుకోవడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. అమరావతి నిర్మాణంలో ముఖ్యమంత్రి ఆలోచనల స్ఫూర్తితోనే 2018లో ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావత్తి పురుడుపోసుకుందని కమిటీ సభ్యులు చెప్పారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ముఖ్యమంత్రిని కోరగా... ఆయన సానుకూలంగా స్పందించారు. రాజధానిలో మీడియా అవసరాలు తీర్చడానికి సహాయ సహకారాలు అంది స్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అప్పాజీ, జనరల్ సెక్రటరీ సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ నారాయణ, ట్రెజరర్ కె.పూర్ణచంద్రరావు, జాయింట్ సెక్రటరీ మహేష్, కమిటీ సభ్యులు శ్యామ్ సుందర్, మల్లేశ్వర రావు, శ్రీనివాస్, కె.గాంధీబాబు, అనిల్ పాల్గొన్నారు.



# వదలని వర్షం

- మరో రెండు రోజులు తప్పని తిప్పలు
- విజయవాడలో కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రహదారులపై నిలిచిన వరద
- భారీగా ట్రాఫిక్ జామ్

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షం ఏపీని వదిలిపెట్టేటట్లు లేదు. బుధవారం రాత్రి విజయవాడ నగర వ్యాప్తంగా భారీగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో రహదారులన్నీ జలమయ్యమయ్యాయి. ప్రధాన రహదారులైన బందరు రోడ్డు, పాలీక్లినిక్ రోడ్డుతో పాటు వన్ టౌన్‌లో ప్రాంతంలో రహదారులపై నీరు నిలవటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో డ్రైనేజీ, కాలువలు పొంగిపొర్లాయి. ప్రధాన రహదారులపై నిలిచిన ట్రాఫిక్‌ను సరిదిద్దడానికి పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి గల్ఫ్ మన్నార్ వరకు తెలంగాణ, రాయలసీమ, అంతర్ తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో రెండు రోజులపాటు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు.

గురువారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో విశాఖ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో మధురవాడ మార్కెట్ జలమయం అయ్యింది. మార్కెట్ అంతా నీరు చేరడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడ్డారు. కుండపోతగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. రోడ్లపై వెళ్లే వాహనదారులు వర్షానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. చిన్న చినుకు పడినా మధురవాడలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, రెండు మూడు రోజులు వర్షపు నీరు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీలైనంత త్వరగా వర్షపు నీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# రైల్వే ఆదాయం అదుర్స్

### తొలి అర్ధ సంవత్సరంలో రూ.9606.24 ఆర్జన

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 8, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం, తొలి అర్ధ సంవత్సరం ఏప్రిల్ -సెప్టెంబర్ మధ్యకాలంలో రూ.9,606.24 కోట్లు ఆర్జించింది. ఇందుకు సంబంధించి డివిజన్ల వారీగా ఆర్జించిన స్థూల ఆదాయం వివరాలు ఇలా ఉన్నాయి. సరుకు రవాణా విభాగంలో: సికింద్రాబాద్ డివిజన్‌లో 39.576 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడం ద్వారా రూ.3732.47 కోట్ల మేర ఆదాయం లభించగా,

విజయవాడ డివిజన్‌లో 21.621 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.2114.62 కోట్లు, గుంతకల్లు డివిజన్‌లో 7.374 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడం ద్వారా రూ.418.13 కోట్లు, గుంటూరు డివిజన్‌లో 1.662 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.173.41 కోట్లు, హైదరాబాద్ డివిజన్‌లో 0.668 సరుకు రవాణా ద్వారా రూ.116.73 కోట్లు, నాందేడ్ డివిజన్‌లో 0.242 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.54.46 కోట్ల చొప్పున మొత్తం 71.142 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడం ద్వారా రూ.6609.82 కోట్ల రూపాయల ఆదాయాన్ని దక్షిణ మధ్య రైల్వే ఆర్జించింది.

ప్రయాణికుల విభాగంలో: సికింద్రాబాద్ డివిజన్‌లో అత్యధికంగా 40.99 మిలియన్ల ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.1,058.42 కోట్ల ఆదాయం లభించగా, విజయవాడ డివిజన్‌లో 36.84 మిలియన్‌ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.734.92 కోట్లు, గుంతకల్లు డివిజన్‌లో 22.18 మిలియన్‌ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.534.65 కోట్లు, నాందేడ్ డివిజన్‌లో 18.15 మిలియన్ల ప్రయాణికుల ద్వారా రూ.272.43 కోట్లు, హైదరాబాద్ డివిజన్‌లో 14.39 మిలియన్ల ప్రయాణికుల ద్వారా రూ.267.21 కోట్లు, గుంటూరు డివిజన్‌లో 9.85 మిలియన్ల ప్రయాణికుల ద్వారా రూ.128.80 కోట్ల ఆదాయం దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆర్జించింది.

సరుకు రవాణా విభాగంలో రూ.6609.82 కోట్లు, ప్రయాణికుల విభాగంలో రూ.2,996.42 కోట్లు వెరసి మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ సంవత్సరంలో రూ.9606.24 కోట్ల రూపాయల ఆదాయాన్ని దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆర్జించింది.

# ప్రతి ఇంటికి జిఎస్‌టి 2.0 ఫలాలు అందాలి




- సంస్కరణలతో దేశాభివృద్ధికి బాటలు
- నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**నెల్లూరు రూరల్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జిఎస్‌టి 2.0 సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేస్తాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిఎస్‌టి సంస్కరణలతో ప్రతి ఇంట్లో దీపావళి కాంతులు వెల్లివిరుస్తున్నాయని పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జిఎస్‌టి 2.0 అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు, వ్యాపారులకు కలిగే మేలును ఆయన వివరించారు. జిఎస్‌టి 2.0పై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరి పరిధిలో వారు.. వీలైనంత మందికి జిఎస్‌టి 2.0పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరు మరో 10 మందికి అవగాహన కల్పిస్తే.. వారు మరికొందరికి అవగాహన కల్పించేలా చూడాలన్నారు. తమకు అందుతున్న మేలును వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఈ సంస్కరణలను స్వాగతిస్తూ, రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జాయింట్ కమిషనర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిఎస్‌టి 2.0పై ఇప్పటికే క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిఎస్‌టి వల్ల ప్రజలకు ఎంతో లబ్ధి కలుగుతోందని పేర్కొన్నారు. రంగాలవారీగా జిఎస్‌టి లబ్ధిని ఆయన సభ ముందుంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేల్స్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్, ప్రోగ్రాం కన్వీనర్ కృష్ణమోహన్, మదీన వాచ్ అధినేత ఇంతియాజ్, ఎసిసి రాష్ట్ర అధ్యక్షులు రంగయ్యనాయుడు, నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్ల సేవలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**బుచ్చి (నెల్లూరు), అక్టోబరు 8 ప్రభాతవార్త:** రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవన్నీ ఆలోచించకుండా ఆటోవాలలకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున అకౌంట్లు వేశారని నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలో ఆటో డ్రైవర్ల సేవలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు, ఎంకె లేవుట్ నుండి నారాయణాద్రి లేవుట్ వరకు భారీ స్థాయిలో ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఎంపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ముందు చూపుతు ఆటో కార్మికులందరికి న్యాయం చేయాలని ఆయన రూ.15 వేలు ఆటో కార్మికుల ఖాతాలు వేశారని తెలిపారు. అనంతరం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... ఉచిత బస్సు పెట్టినందు వల్ల ఆటో కార్మికులు నష్టపోకూడదని ఒక్కొక్కరి అకౌంట్‌లో ముఖ్యమంత్రి రూ.15 వేలు వేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామిని నెరవేరస్తు ముందుకు పోతుందని వివరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, పుట్టా సుబ్రమణ్యంనాయుడు, నాయకులు కమలాకర్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, ఎం.వి శేషయ్య, మోర్ల మురళీ, వింజం రామానాయుడు, వైస్ చైర్మన్ పుట్టా శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పటాన్ నస్రీన్, కౌన్సిలర్లు శ్రీదేవి, రాచూరు సత్యనారాయణ, మౌళి, యూత్ నాయకులు వింజ మహేష్‌నాయుడు, బుచ్చి రూరల్ బ్యాంకు అధ్యక్షులు ఏటూరు శివరామకృష్ణారెడ్డి, చింతం శ్రీనివాసులురెడ్డి, దొడ్ల కోదండరామిరెడ్డి, తిరువాయి పాటి నందకుమార్, ఇమ్మడిశెట్టి మల్లికార్జున, తాళ్ళ నరసింహస్వామి, కోవూరు మండల నాయకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.



డిఆర్‌ఎంకు వినతిపత్రం అందజేసిన సిపిఐ ప్రతినిధి బృందం

## తిమ్మనచర్ల రైల్వే స్టేషన్‌లో పిట్ లైన్‌లు నిర్మించాలి

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 8, ప్రభాతవార్త:** గుంతకల్లు రైల్వే డివిజనల్ కేంద్రంలో రైలు బోగీల మరమ్మతుల నిర్వహణ నిమిత్తం తిమ్మనచర్ల రైల్వే స్టేషన్‌లో అదనంగా పిట్ లైన్‌లు ఏర్పాటు చెయ్యాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను కోరారు. బుధవారం గుంతకల్లు రైల్వే డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యులు జగదీష్ అధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, పట్టణ, గ్రామీణ కార్యదర్శులు ఎస్.గోపీనాథ్, రాము ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్యలతో కూడిన ప్రతినిధులు డిఆర్ఎం గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గుంతకల్లు రైల్వే స్టేషన్లో అదనపు పిట్ లైన్‌లను నిర్మించేందుకు సరిపడా స్థలం లేనందున గూడ్స్ రైలును ఆపడానికి వెస్ట్ గుంతకల్లు స్టేషన్‌లో పెట్టి క్లీనింగ్ చేయిస్తున్నారు. అదే పద్ధతిలో ప్యాసింజరు రైళ్ళను పట్టణ శివారులోని తిమన్నచర్ల స్టేషన్‌లో అదనంగా ఐదు పిట్ లైన్‌లను ఏర్పాటు చేస్తే రైళ్ళ మరమ్మతులను నిర్వహించాలన్నారు. అలాగే హనుమాన్ సర్కిల్ ప్రాంతంలో ఉన్న రైల్వే సమీపంలో రోడ్డు చాలా దెబ్బతిన్నది, అందువల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. కావున రైల్వేగేటు రైల్వే స్థలంలో రోడ్డు మరమ్మతులు చేయుటకు తగిన ఆదేశాలు ఇవ్వాలని, కసాపురం రైల్వే వంతెన కింద కూడా రోడ్డు మరమ్మత్తులు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని, గుంతకల్లు పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులను వెంటనే చేపట్టాలని వారు డిఆర్‌ఎంను కోరారు.



## వీరశైవ లింగాయత్‌లను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి

**ఉరవకొండ, అక్టోబరు 8 ప్రభాతవార్త:** ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ అంశాల్లో చాలా వెనుకబడిన వీరశైవ లింగాయత్, లింగ బలిజ సమాజముల స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జాబితాలో చేర్చేలా కృషి చేయాలని అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు దండిన శివానంద కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో శైవ క్షేత్రాల్లో వీరశైవులకు ప్రాధాన్యత కల్పిస్తామని, శ్రీశైలం, శ్రీకాళహస్తి క్షేత్రాల పాలక మండళ్లకు అధ్యక్షులుగా వీరశైవ లింగాయత్‌లను మాత్రమే నియమిస్తామని హామీ ఇచ్చారని అయితే ఇప్పుడు ప్రకటించిన పాలక మండళ్లలో అధ్యక్షులుగా, సభ్యులుగా ఒక్క వీరశైవుడు, జంగమ మహేశ్వరులను నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్రశాఖ విచారం వ్యక్తం చేసో_ందన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు లింగాయత్ సమాజమును ఓబీసీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, ఆయనకు అఖిల భారత వీరశైవ మహాసభ, వీరశైవ లింగాయత్ సమాజము ధన్యవాదాలు తెలియజేస్తున్నదన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సమాజం ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షులు పాటిల్ నాగన్నగౌడ్, అఖిల భారత వీరశైవ మహాసభ డైరెక్టర్లు గంగాధర్, మణికంఠ, సురేష్‌గౌడ్, గుంతకల్లు జంగమ లింగాయత్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, ఉరవకొండ నాయకులు పి.నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జిఎస్‌టిపై అవగాహన ర్యాలీ

## పేదల సంక్షేమానికే కూటమి మొగ్గు

**శ్రీకాళహస్తి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** నిరుపేదలకు ధరలు అందుబాటులో ఉంచటానికే కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వ్యాపార సంస్థలు వెలసిన నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధుల్లోని దుకాణాల వద్దకు వెళ్ళి 'జిఎస్‌టిపై' అవగాహన నిర్వహించారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అనే కరపత్రాలను అందిస్తూ జిఎస్‌టి ఎందుకు తగ్గించాల్సి వస్తుందనే అంశాన్ని వ్యాపారులకు వివరించారు. ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టికి సంబంధించి ఉత్పత్తి దారులు, వ్యాపారులు సహాకరించాలన్నారు. వస్త్రదుకాణాలు, మందుల షాపులు, పాదరక్షలు, ఎలక్ట్రానిక్ తదితర వ్యాపారసంస్థల వద్దకు వెళ్ళి యజమానులను చైతన్యవంతుల్ని చేసారు. ఎమ్మెల్యేతో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, జనసేనకు చెంది ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టేసాయి, తెలుగుదేశం నాయకులు విజయకుమార్ నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు, కాసరం రమేష్, సుబ్బయ్య, కంఠా రమేష్, అంజూరు చక్రధర్, మల్లీశ్వరి, బి.రేణుకమ్మ, ఢిల్లిబాబు, వాకచర్ల గుర్రప్పశెట్టి, బషీర్, నెమళ్లూరు బుజ్జి తదితరులు హాజరయ్యారు.

## సమర్థవంత పాలన అవసరం

**శ్రీకాళహస్తి, అక్టోబరు 8 ప్రభాతవార్త:** భారత దేశ భవిష్యత్తును రూపొందించటంలో సమర్థవంతమైన పరిపాలన వ్యవస్థ ఎంతో అవసరమని ఉద్యమ వ్యవస్థాపకుడు, ప్రజా విధాన నిపుణుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. తిరుపతి ఐఐటిలో ఏర్పాటు చేసిన 'ఇండియా రోడ్ అహెడ్' కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సమావేశానికి తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెషర్ కె.ఎన్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ... నేడు సామాజిక పరిస్థితిని బట్టి మార్పులు రావాల్సి ఉందన్నారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ క్రమశిక్షణ, చట్టపాలన, విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలను తీర్చటానికి ఎందుకు అవసరమో వివరించారు. పరిపాలన, సంస్కరణలలో తన అపార అనుభవం నుంచి స్థిరమైన సమానమైన సమాజానికి పాలన ఎలా వెన్నుముకగా పని చేస్తుందో వివరించారు. స్థిరమైన సమ్మిళిత వృద్ధి అనేది సమాన అభివృద్ధిని నిర్ధారించటానికి సమాజంలోని వివిధ వర్గాల మధ్య అభ్యంతరాన్ని తగ్గించటానికి రెండు స్తంభాలని జయప్రకాష్ నారాయణ వివరించారు.

# బొగ్గు కొనుగోలుకు ఇక విద్యుత్ జెన్కోలకు రుణాలు

**నిబంధనలు సడలింపునకు చర్యలు**

**10 నుండి 15 శాతం దిగుమతుల పెంపు**

**పవర్ ఫైనాన్స్ సంస్థపై విద్యుత్ మంత్రిత్వ శాఖ ఒత్తిడి**

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** విద్యుత్ ఉత్పత్తి అవసరమైన బొగ్గు కొనుగోలు, దిగుమ తులకు సంబంధించి రుణ సౌకర్యం కల్పించాలని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. జనరేటర్లైన జెన్కోలకు నిర్దిష్ట బొగ్గు రుణాలు అందించడం ఇదే మొదటిసారి. దిగుమతి చేసుకున్న బొగ్గు కోసం విద్యుత్ ఉత్పత్తి సంస్థ లకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందిం చడానికి డిస్పెన్సేషన్‌తో కూడిన మార్గదర్శకాలను విద్యుత్ మంత్రిత్వ శాఖ రూపొందిస్తోంది. దీంతో త్వరలో బొగ్గు దిగుమతులకు విద్యుత్ జెన్కోలకు సులభమైన రుణాలు లభించనున్నాయి.

ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ రిటైలర్ల నుండి చెల్లింపులు అందకపోవడంతో దిగుమతి చేసుకున్న బొగ్గును కొనుగోలు చేయడానికి తమ వద్ద డబ్బు లేదని వివిధ రాష్ట్రాలకు చెందిన జెన్కోలతో పాటు, ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు కేంద్రా నికి ఇప్పటికే తెలిపాయి. విద్యుత్ సంస్థలకు రుణాలు ఇవ్వడానికి, ముఖ్యంగా బ్లెండింగ్ ప్రయోజనాల కోసం దిగుమతి చేసుకున్న బొగ్గును కొనుగోలు చేయడానికి, దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత ప్లాంట్లను నడపడానికి వీలుగా అవసరమైన నిబంధనలను సడలించాలని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌పై కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వత్తిడి తెస్తోంది.

విద్యుత్ డెవలపర్లు బొగ్గును దిగుమతి చేసుకోవడానికి ఆసక్తిగా ఉండడంతో పాటు, అందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి ప్రభుత్వం నుండి ఫైనాన్సింగ్ విధానాన్ని కోరుతుండడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే విద్యుత్ ప్లాంట్లకు పంపిణీ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం 1.03 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక విద్యుత్ ప్లాంట్లలో దాదాపు 20 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు మాత్రమే ఉండగా, ఇవి దాదాపు ఎనిమిది రోజుల పాటు ఉంటాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి సంస్తలకు బొగ్గు అవసరం తప్పనిసరి అయ్యింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు నిల్వలను నిర్మించడానికి మరియు అధిక డిమాండ్ మధ్య ప్రాజెక్టులను కొనసాగించడానికి, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు బొగ్గు దిగుమతుల కోసం అవసరమైన రుణాలను మంజూరు చేసేందుకు రుణదాతల ద్వారా కేంద్రం సులభతరం చేస్తుంది. ప్రధానంగా విద్యుత్ సంక్షోభాన్ని నివారించడానికి వర్షాకాలం ముందు నిల్వలను నిర్మించడానికి బొగ్గును దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం ఉత్పత్తి సం స్థలపై ఆధారపడుతోంది. అన్ని ఉత్పత్తి ప్రాజె క్టులు వాటి అవసరంలో 10 శాతం దిగుమతి చేసుకోవాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉత్పత్తి సంస్థలు 22 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతులు చేసుకుంటాయి. అలాగే ప్రైవేట్ కంపెనీలు మరో 16 మిలియన్ టన్నులు తీసుకు వస్తాయి. విద్యుత్ మంత్రిత్వ శాఖ బుధవారం ఇచ్చిన ఆదేశాల్లో బొగ్గును దిగుమతి చేసుకోని ప్లాంట్లకు వాటి లక్ష్యాలను ప్రస్తుత 10 శాతం నుండి 15 శాతానికి పెంచుతామని తెలిపింది.

# ముమ్మట్టి, దుల్కర్‌ల ఇళ్లలో ఇడి సోదాలు



**తిరువనంతపురం, అక్టోబరు 8:** భూటాన్ లగ్జరీ కార్ల స్మగ్లింగ్ కుంభకోణం కేసు మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ప్రముఖ నటులు మమ్ముట్టి, ఆయన కుమారుడు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చక్కలక్కల్ నివాసాలతో పాటు మొత్తం 17 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) ఉల్లంఘనల ఆరోపణలపై ఈడీ ఈ చర్యలు చేపట్టింది. భూటాన్, నేపాల్ మార్గాల ద్వారా టయోటా ల్యాండ్ క్రూయిజర్, ల్యాండ్ రోవర్ డిఫెండర్ వంటి ఖరీదైన వాహనాలను అక్రమంగా దిగుమతి చేస్తున్న ఓ ముఠాపై తమకు కచ్చితమైన సమాచారం అందిందని ఈడీ అధికారులు తెలిపారు. ఈ ముఠా భారత సైన్యం, అమెరికా రాయబార కార్యాలయం, విదేశాంగ మంత్రి త్వశాఖ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అక్రమంగా వాహన రిజిస్ట్రేషన్లు పొందినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత ఈ కార్లను సినీ ప్రముఖులతో సహా పలువురికి తక్కువ ధరకు విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ఆపరేషన్ నుమ్‌ఖోర్ కింద కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న తన కారును విడుదల చేయాలని కోరుతూ దుల్కర్ సల్మాన్ కేరళ హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి పొందిన మరుసటి రోజే ఈడీ దాడులు జరగడం గమనార్హం. దుల్కర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, ఆ కారును 2004లో రెడ్ క్రాస్ కోసం చట్టబద్ధంగా దిగుమతి చేశారని, ఆ తర్వాత తాము కొనుగోలు చేశామని కోర్టుకు తెలిపారు. అయితే, కేసు విచారణ కొనసాగుతున్నందున కారును సీజ్ చేసే హక్కు తమకుందని కస్టమ్స్ అధికారులు వాదించారు. కేరళలో ఇలాంటి అక్రమ దిగుమతి కార్లు 150కి పైగా ఉన్నాయని, వాటిలో ఇప్పటికే 40 వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. ఈడీ రంగంలోకి దిగడంతో ఈ కేసు విచారణ మరింత వేగవంతం కానుందని, మరికొంతమంది ప్రముఖుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# 20 కేజీల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్,అక్టోబరు 8, ప్రభాతవార్త :** నాలుగు బ్యాగుల్లో గంజాయిని నింపుకొని, ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వచ్చే వోల్వో బస్సులో లోని లగేజ్ బాక్స్‌లోను పెట్టి దర్జాగా లోపల ఏసి బస్సులో కూర్చొని హైదరాబాద్‌కు వస్తున్న ఒడిశాకు చెందిన నాభి నాయక్ అలియాస్ హరి కి సంబంధించిన 20.600 కేజీల గంజాయిని రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ టీం పట్టుకున్నారు. గతంలో భారీగా గంజాయి స్మగ్లింగ్ చేస్తూ హైదరాబాద్ రాయదుర్గం ప్రాంతంలో ఎస్‌ఓటి పోలీసులకు పట్టుబడిన నాభిన్ నాయక్ అలి యాస్ హరి ఒరిస్సా నుంచి నాలుగు బస్తాల్లో 20 కేజీలకు పైగా గంజాయిని తీసుకువస్తూ ఉన్నాడనే సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఏఈఎస్ జీవన్ కిరణ్ సిఐలు సుభాష్ చందర్ ఇతర సిబ్బందిని కలిసి రామోజీ ఫిలిం సిటీ వద్ద బస్సును నిలిపి తనిఖీలు నిర్వహించి అందులో ఉన్నటువంటి గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు.గంజాయిని తూకం వేయగా 20.600 కేజీలుగా ఉన్నట్లు గుర్తించారు. పట్టుకున్న గం జాయి విలువ రూ.11 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు.గంజాయిని పట్టుకున్న టీంలో ఏఈఎస్ జీవన్ కిరణ్, సిఐలు సుభాష్ చందర్ బాలరాజు, ఎస్ఐలు వెంకట్,రవి,అ ఖిల్‌తో పాటు ఏక్సైజ్‌శాఖ సిబ్బంది ఉన్నారు.

# మద్యం దుకాణాలకు పెరుగుతున్న దరఖాస్తులు

**హైదరాబాద్,అక్టోబరు 8, ప్రభాతవార్త :** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తెలంగాణలో కొత్త మద్యం షాపులకు పిలిచిన దరఖాస్తుల ఆహ్వానంలో భాగంగా ఈ నెల 7వ తేదీ నాటికి 1581 దర ఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలి పారు.మద్యం షాపులకు దరఖాస్తులు రోజు రోజు పెరుగుతూ వస్తున్నాయని,గత రెండేళ్ల క్రితం పిలిచిన మద్యం షాపులకు దరఖాస్తులకు కంటే ఈ సారి మద్యం షాపుల కోసం దరఖాస్తులు ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

తెలం గాణలోని 2620 మద్యం దుకాణాలకు 1581 దదఖాస్తులు ఈ నెల 7 వరకు వచ్చాయి. బుధ వారం దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు.ఓపెన్ క్యాటగిరిలో 1834 మద్యం దుకాణాలకు 992 దరఖాస్తులు,గౌడ్‌లకు కేటా యించిన 393 దుకాణాలకు 223 దరఖాస్తులు ఎస్సీలకు కేటాయించిన 262 మద్యం దుకా ణాలకు 55,ఎస్టీలకు కేటాయించిన 131 షాపులకు 13 మొత్తంగా 2620 మద్యం షాపు లకు 1581 దరఖాస్తులు రాగా చివరి మూడు రోజులు భారీగా దరఖాస్తులు వచ్చె అవకాశాలు ఉండడంతో తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. అబ్కారీ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ దరఖాస్తులు వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా,అనుమానాలను నివృత్తి చేయడానికి హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేశారు.

# కాన్పూర్ మిశ్రీగంజ్‌లో భారీ పేలుడు

**మహిళ సహా ఆరుగురికి తీవ్రగాయాలు**

**పార్కింగ్‌చేసిన స్కూటర్లలో పేలుడు**



**కాన్పూర్, అక్టోబరు 8:** నగరంలోని మిశ్రీ బజారులో బుధవారం సాయంత్రం రెండు పార్కింగ్‌చేసిన స్కూటర్లలో అమర్చిన బాంబులు పేలడంతో భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ పేలుడులో కనీసం ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులను వెంటనే సమీపంలోని ఉర్సులా ఆసుపత్రికి తరలించారు. రాత్రి 7.15 గంటల ప్రాంతంలో మిశ్రీ బజార్ ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. జెసిపి అశుతోష్‌కుమార్ మాట్లాడుతూ రెండు స్కూటర్లనుంచి ఈ పేలుడు సంభవించిందని మహిళ సహా ఆరుగురు గాయపడినట్లు చెప్పారు. మాఫోరెన్సిక్ బృందాలు సంఘటనా స్థలాలో వివరాలు సేకరిస్తున్నాయని అన్నారు. పేలుడు సంభవించిన స్కూటర్‌ను గుర్తించామని, ఇందుకు సంబంధించి అన్ని కోణాలనుంచి దర్యాప్తు జరుగుతోందని అశుతోష్ వెల్లడించారు. ఇది ప్రమాదమా లేక కుట్రపూరితమా అన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతున్నట్లు జెసిపిఅశుతోష్ చెప్పారు. పోలీస్, బాంబు నిర్వీ ర్యంచేసే బృందాలతోపాటుఫోరెన్సిక్ టీమ్‌లు కూడా వెంటనే ప్రమాదస్థలానికి చేరుకున్నాయి. అంతేకాకుండా చెల్లాచెదురయిన ఈ ప్రాంతాన్ని మొత్తం సీజ్‌చేసి పేలుడుకు సంబంధించిన మొత్తం వివరాలను పరిశీలనచేస్తున్నారు.



**చిన్నారుల మరణాలకు కారణమైన**

# దగ్గుమందు ఇతర దేశాలకు ఎగుమతి చేశారా?

**భారత్‌ను ప్రశ్నించిన డబ్ల్యూహెచ్ఓ**

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** దగ్గు మందుతో చిన్నారుల మర ణాల ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి కలిగిం చింది. మధ్య ప్రదేశ్ లో కోల్డ్‌రిఫ్ దగ్గు మందు కారణంగా పలువురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందించింది. ఈ ఔషధం ఎగుమతులపై భారత్‌ను ఆరా తీసినట్లు తెలుస్తోంది. చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్‌రిఫ్ దగ్గుమందును ఇతర దేశాలకు ఎగుమత చేశారా అని డబ్ల్యుహెచ్ఓ భారత్‌ను అడిగింది. సంబంధిత అధికారుల నుంచి వివరణ వచ్చిన తర్వాత ఈ ఔషధంపై గ్లోబల్ మెడికల్ ప్రొడక్ట్స్ అలర్ట్ జారీ చేయాలా? వద్దా? అనే దానిపై అంచనా వేయనుంది అని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ దగ్గుమందు కారణంగా చిన్నారుల మరణాలు పెరుగుతుండటం కలవరపెడుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో మృతుల సంఖ్య 20కి చేరింది. ఒక్క చింద్వాడాలోనే 17 మంది ప్రాణాలు కోల్పోయినట్లు మధ్యప్రదేశ్ ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా వెల్లడించారు.

మరో అయిదుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇలాంటి కల్తీ దగ్గుమందు తాగి రాజస్థాన్‌లోనూ కొందరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కోల్డ్‌రిఫ్ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ తయారు చేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు ఈ సిరప్‌పై ఇప్పటికే పలు రాష్ట్రాలు నిషేధం విధించాయి.

**ఫోన్‌ట్యాపింగ్ కేసు**

## 14కు వాయిదా

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మరింత వేగంగా కొనసాగుతుంది. ఈ మేరకు ప్రభుత్వం సుప్రీం కోర్టులో ప్రధాన నిందితుడు మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేసింది. అయితే బుధవారం విచారణ చేపట్టి ఇరుపక్షాల వాదనలు జరిగాయి. ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఫోరెన్సిక్ నివేదికలో కీలకమైన ఆధారాలు లభించాయని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ మహ దేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిం చారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నుంచి అందిన నివేది కలో, డిజిటల్ ఫోరెన్సిక్ ప్లాట్‌ఫామ్ ద్వారా అత్యంత ముఖ్యమైన ఆధారాలు సేకరించినట్లు ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆధారాలు కేసు దర్యాప్తులో కీలకం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో జరిగిన విచారణ సందర్భంగా, ప్రభాకర్ రావు దర్యాప్తునకు ఏమాత్రం సహకరించడం లేదని ప్రభుత్వం కోర్టుకు ఫిర్యాదు చేసింది. దీంతో దర్యాప్తు అధికారులకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా బలమైన ఫోరెన్సిక్ ఆధారాలు లభించిన నేపథ్యంలో ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం గట్టిగా వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తదుపరి విచారణను అక్టోబర్ 14కి వాయిదా వేసింది.

## ఘనంగా డాక్టర్ బాలగోపాల్ 16వ వర్ధంతి

పొన్నూరు, అక్టోబరు 8,ప్రభాతవార్త: మానవ హక్కుల వేదిక కార్యాలయంలో బుధవారం డాక్టర్ బాలగోపాల్ 16వ వర్ధింతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలుగు నేలకు,



హక్కుల ప్రజానీకానికి పరిచయం అవసరం లేని పేరు బాలగోపాల్ అని చెప్పారు. హక్కుల దిక్సూచిగా, ప్రజల న్యాయవాదిగా ఆయన ఎన్నో విజయాలు సాధించారన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తుమాటి రాజారావు, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు జిఎస్ రాయెల్, కెవిపిఎస్ నాయకుడు శ్రీనివాస్ తోడేటి, గుడిసెవాసుల సంఘం నాయకుడు బలగాని వెంకటేశ్వర్లు, షేక్ సుబాని, చుక్కా వెంకటేశ్వర్లు, గేరా మున్నీ తదితరులు పాల్గొని బాలగోపాల్‌కు జోహార్లు అరి ్పంచారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి

పొన్నూరు, అక్టోబరు 8,ప్రభాతవార్త: ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. పొన్నూరు పట్టణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. అయినప్పటికీ కొంత మంది మాత్రమే తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తూ ప్లాస్టిక్ విక్రయాలను దొంగచాటుగా విక్రయిస్తున్నారన్నారు. ఇది సరైన విధానం కాదన్న విషయాన్ని విక్రయదారులు గుర్తించాలన్నారు. పట్టణంలోని 24వ వార్డులో మోహన్ అనే వ్యక్తి భారీగా ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, డిస్పోజబుల్ గ్లాసులు వినియోగిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, సచివాలయాల సిబ్బంది, మేస్త్రీలు సంయుక్తంగా వెళ్ళి దాడి చేశారు. ఈ దాడిలో 80కిలోల క్యారీబ్యాగులు, 25కిలోల డిస్పోజబుల్ గ్లాసులను సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తికి రూ.2వేలు పెనాల్టీ విధించారు. రాబోయే రోజుల్లో భారీ ఎత్తున పెనాల్టీలు విధించడంతోపాటు కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

## ఘనంగా ఎయిర్‌ఫోర్స్ దినోత్సవ వేడుకలు

పొన్నూరు, అక్టోబరు 8,ప్రభాతవార్త: లయన్స్‌క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళ ఆధ్వర్యంలో బుధవారం లయన్స్ సర్వీస్ దినోత్సవాన్ని, ఎయిర్ ఫోర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, దేశానికి సేవలు చేస్తున్న, చేసిన పలువురు అధికారులను క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ



సందర్భంగా లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీ రాణి మాట్లాడుతూ దేశానికి సేవ చేసిన వ్యక్తులను, అదేవిధంగా సమాజానికి సేవ చేసిన వ్యక్తులను సత్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇటీవల పొన్నూరును ఉత్తమ మునిసిపాలిటీగా కీర్తి వచ్చేటట్లు చేయడంతోపాటు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం స్వర్ణపురి పట్టణానికి మణిహారమన్నారు. రిటైర్డ్ ఆర్మీ ఎయిర్‌ఫోర్స్ అధికారి షేక్ సుబాని, ఎయిర్ వైస్ మార్షల్ సిహెచ్ శివకుమార్‌శర్మ, జెజడ్ఓ సార్జంట్ మస్తాన్‌వలి, షేక్ షాన్‌లను క్లబ్ తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళాక్లబ్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాము రిటైర్డ్ అయినప్పటికీ ఇలాంటి సత్కారాలను నిర్వహించడం ద్వారా తమ బాధ్యత మరింత పెరిగినట్లుగా భావిస్తున్నామన్నారు. మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు మాట్లాడుతూ ఉత్తమ పురపాలక సంఘంగా గుర్తింపు తేవడంలో తమ సిబ్బందితో పాటు ప్రజల యొక్క సహకారం కూడా మరువలేనిదన్నారు. రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి, క్లబ్ కార్యదర్శి జి. శోభా కలూష, కోశాధికారి పి.నిర్మలాదేవి, మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, పరాశరం శేషుకుమారి, బి.నాగమంజరి, ఎస్.జీవహింస, ఎన్.శ్రీలక్ష్మి, ఎ.విమల, కె.విజయలక్ష్మి, బి.శబలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



పొన్నూరు, అక్టోబరు 8,ప్రభాతవార్త: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వస్తున్న సమాచారాన్ని చాలా గోప్యంగా ఉంచారు. వైద్యశాలకు వచ్చే వరకు వైద్యులకు కానీ, సిబ్బందికి కానీ తెలియదు. కలెక్టర్ ఒక్కసారిగా రావడంతో సిబ్బంది అలర్ట్ అయ్యారు. వైద్యశాలలో రోగులకు అందిస్తున్న చికిత్సలకు సంబంధించి అడిగి తెలుసుకొన్నారు. స్వయంగా రోగులు ఉన్న వార్డుకు వెళ్ళి సేవలు సక్రమంగా అందుతున్నాయా..?లేవా..?వైద్యులు ఏ విధంగా వ్యవహరిస్తున్నారు...?మందుల ఇస్తున్నారా..? ప్రభుత్వ వైద్యం పట్ల మీరు సంతృప్తిగా ఉన్నారా..? అంటూ కలెక్టర్ అన్సారియా ప్రశ్నించి సమాధానాలను రాబట్టారు. వైద్యశాల మొత్తం కలియ తిరిగారు. వైద్యశాల పరిసరాలు పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి ఉండడాన్ని గుర్తించారు. వైద్యశాలలో శానిటేషన్‌ను మెరుగు పరచాలని ఆదేశించారు. వైద్యశాలకు గైనకాలజిస్ట్ లేరని, అంబులెన్స్ కూడా లేదని వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్ తక్షణమే అంబులెన్స్, గైనకాలజిస్టను నియమిస్తామని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలో ఎక్కువగా కాన్పులు జరిగే విధంగాచూడాలన్నారు. అందుకు ప్రజల్లో అవగాహనా సదస్సులు నిర్వహించి వారిలో చైతన్యం తేవాలని ఆదేశించారు. ఈసీజీ, ఎక్సరే, తదితర పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌ను పరిశీలించారు. రోగులకు సంబంధించిన అన్నీ పరీక్షలు ప్రభుత్వ వైద్యశాలల్లోనే నిర్వహించే విధంగా సంబంధిత వైద్యాధికారి దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో నాణ్యమై వైద్య సేవలు అందిస్తే ప్రభుత్వ వైద్యశాలల పట్ల, వైద్యుల పట్ల, ప్రభుత్వం పట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలకు ఎక్కువగా పేదలు వస్తుంటారని, వారికి వైద్యులు మెరుగైన నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వ వైద్యశాలల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు.

## వైకాపా రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జలను కలిసిన డాక్టర్ రూత్‌రాణి



పొన్నూరు, అక్టోబరు 8,ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఇటీవల వైకాపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలుగా నియామకమైన డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి బుధవారం మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై అడిగి తెలుసుకొన్నారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. ఎస్ఈసి సభ్యురాలుగా నియమించడం పట్ల రూత్‌రాణి సజ్జలకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండాలని సజ్జల సూచించారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్‌గా, పార్టీ ఉపాధ్యక్షురాలుగా, బాపట్ల నియోజకవర్గ పరిశీలకురాలుగా పనిచేసిన అనుభవంతో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సజ్జల డాక్టర్ రూత్‌రాణికి సూచించారు.



బుధవారం సునీత రావు అధ్యక్షతన గాంధీభవన్‌లో జరిగిన మహిళకార్యవర్గ సమావేశం

## ఓట్ చోరీతో మూడోసారి ప్రధాని అయిన మోడీ

**సంతకాల సేకరణ చేసిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు**


**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** దేశంలో ఓట్‌చోరీ చేసి మూడోసారి మోడీ ప్రధాని అయ్యా రని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆరోపించారు. ఆమె అధ్యక్షతన బుధవారం మహిళ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగింది. మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో ఓట్ చోరికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్య్ర కమాన్ని చేపట్టారు. రాహుల్‌గాంధీ ఓట్ చోర్ విషయంలో అన్ని రకాలుగా ఆధారా లతో బయటపెట్టడంతో మోడీ, బిజెపి బెంబేలెత్తిందని అన్నారు.మోడీ మూడోసారి ప్రధాన మంత్రి అయ్యేందుకు ఎన్నికల కమిషన్‌ను వాడుకు న్నారని ఆరోపించారు. అన్ని రకాలుగా ఆధారా లతో రాహుల్ గాంధీ ఎన్నికల అక్రమాలను, ఓట్ చోర్ లను చూపించినా కూడా ఎన్ని కల కమిషన్ ఏ మాత్రం స్పందించలేదని విమ ర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా మహిళా కాం గ్రెస్ పెద్ద ఎత్తున సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి రాహుల్‌గాంధీ న్యాయపోరాటానికి మద్ద తుగా నిలవాలని సునీతరావు అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు,జనరల్ సెక్రెటరీలు, సెక్రటరీలు, కాన్స్టిట్యువెన్సీ, బ్లాక్, మండల్, బూత్, టౌన్ స్థాయి నాయకులు భారీగా పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆదేశాలు తక్షణమే అమలు

**-ప్రభుత్వాసుపత్రికి సమకూరిన అంబులెన్స్ వాహనం**

పొన్నూరు, అక్టోబరు 8,ప్రభాతవార్త: నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలకు అంబులెన్సు సౌకర్యం లేదని....గైనకాలజిస్ట్ డాక్టర్ లేరని తదితర అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్ళింది. దీంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెప్పిన ప్రకారమే బుధవారం సాయంత్రానికి ప్రభుత్వ వైద్యశాలకు అంబులెన్స్ వాహనం సమకూరింది. ఇక పోతే గైనకాలజిస్టను డిప్యూటేషన్‌పై నియమించాలని జిల్లా కలెక్టర్ జిల్లా వైద్యాధికారికి ఆదేశాలిచ్చారు. దీంతో ఆ సమస్యకు కూడా రెండు, మూడు రోజుల్లో పరిష్కారం లభించే అవకాశం ఉందని, వైద్యశాల సిబ్బంది చెప్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి గాడి తప్పిన వైద్య సేవలను గాడిలో పెట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జీఎస్టీ 2.0తో మరిన్ని ప్రయోజనాలు




పొన్నూరు, అక్టోబరు 8,ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీపై తీసుకున్న నిర్ణయం ప్రజల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే నినాదం వినిపిస్తుందని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ జీఎస్టీ 2.0ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రజలు కూడా తగ్గించిన జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. షాపుల్లో వస్తువులు కొనుగోలు చేసే సందర్భంగాలో షాపుల యజమానులు జీఎస్టీకి సంబంధించి ప్రభుత్వ నిబంధనలు అమలు చేస్తున్నారా..?లేదా..?అనే విషయాలను గుర్తించాలన్నారు. జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకుడు ఎం.ఏడుకొండలరావు, ఎవి హనుమంతరావు జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించారు.

## పాఠశాలకు వెళ్ళేదెట్లా !

**-కాలువ నిర్మించారు-మూత మరిచారు-ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**

పొన్నూరు, అక్టోబరు 8,ప్రభాతవార్త: పట్టణాభివృద్ధిలో భాగంగా ఇటీవల వివిధ వార్డుల్లో కాలువలు, రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పలు వార్డుల్లో కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పట్టణంలోని శ్రీ రామా మునిసిపల్ హైస్కూల్ వద్ద కూడా రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీరామా మునిసిపల్ హైస్కూల్ వద్ద కాలువ నిర్మాణం చేపట్టేందుకు రోడ్డును తవ్వారు. రోడ్డుకు, పాఠశాలకు వెళ్లే మధ్యలో తవ్వి వదిలేశారు. కాలువ నిర్మాణం పూర్తి చేసినప్పటికీ దానిపై మూత వేయడం మరిచారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్ళేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలు పడడంతో అక్కడ తవ్విన మట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుంది. మునిసిపల్‌శాఖాధికారులు పాఠశాలల వద్ద ఈ విధంగా తవ్వి వదిలేస్తే ఎట్లాని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేవిధంగా ఆలోచన చేయాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



09-10pg10 12 GNT_09-10pg10.qxd 10/8/2025 10:07 PM Page 1



ఆట



# వన్డేల్లో టాప్ కెప్టెన్లు

## అత్యధిక విక్టరీల హీరోస్

### టాప్ 2లో ధోనీ, 7లో అజరుద్దీన్

**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్ చరిత్రలో వివిధ దేశాలకు చెందిన పలువురు కెప్టెన్లు అత్యధిక విజయాలు సాధించారు. ఇందులో భారత్‌కెప్టెన్లు కూడా స్థానం సంపాదించారు. అత్యధిక విజయాలు సాధించిన టాప్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ నిలిచాడు. వన్డే ల్లో అత్యధిక విజయాలు సాధించిన కెప్టెన్ల జాబితాలో భారత మాజీ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోనీ, మహ్మద్ అజారుద్దీన్ కూడా ఉన్నారు. కానీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ కెప్టెన్ల పేర్లు ఈ రికార్డు జాబితాలో లేవు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 230 మ్యాచ్‌లకు ఆస్ట్రేలియాకు నాయకత్వం వహించాడు, వాటిలో 165 విజయాలు సాధించాడు. పాంటింగ్ కెప్టెన్సీలో, ఆస్ట్రేలియా రెండుసార్లు (2003, 2007) వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. టాప్ 7 కెప్టెన్ల జాబితాలో భారత మాజీ కెప్టెన్ ధోని రెండవ స్థానంలో ఉన్నాడు. అతను 200 మ్యాచ్‌లకు భారత జట్టుకు నాయకత్వం వహించాడు. వాటిలో 110 మ్యాచ్‌లలో గెలిచింది. ధోని కెప్టెన్సీలో భారత్ 2011లో వన్డే ప్రపంచ కప్, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్ మూడవ స్థానంలో ఉన్నాడు. అతను 178 మ్యాచ్‌లకు ఆస్ట్రేలియాకు నాయకత్వం వహించగా, వాటిలో 107 మ్యాచ్‌లలో విజయం సాధించాడు. బోర్డర్ కెప్టెన్సీలో ఆస్ట్రేలియా 1987 వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ హాన్సీ క్రోంజే వన్డే నాల్గవ స్థానంలో ఉన్నాడు. అతను దక్షిణాఫ్రికాకు 138 మ్యాచ్‌లకు నాయకత్వం వహించగా, వాటిలో 99 విజయాలు సాధించాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ఐదవ స్థానంలో ఉన్నాడు. అతను 218 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి, వాటిలో 98 విజయాలు సాధించాడు. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ ఆరో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికాకు 150 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి, వాటిలో 92 విజయాలు సాధించాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక విజయాలు సాధించిన టాప్ ఏడుగురు కెప్టెన్ల జాబితాలో భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ ఏడవ స్థానంలో ఉన్నాడు. అతను 174 మ్యాచ్‌లకు నాయకత్వం వహించాడు, వాటిలో 90 విజయాలు సాధించాడు.

# టెస్ట్ సిరీస్ భారత్ కైవసం

## 2-0తో ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన టెస్ట్ సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. సొంత గడ్డపై ఆసిస్‌ను క్వీన్ స్వీప్ చేసింది. మూడు మ్యాచ్‌ల వన్డే, రెండు మ్యాచ్‌ల టెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత్ వన్డే సిరీస్‌ను 3-0తో, టెస్ట్ సిరీస్‌ను 2-0 తేడాతో ఊడ్చేసింది. మెక్‌కే వేదికగా బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ బౌలర్లు మూకుమ్మడిగా చెలరేగడంతో ఆస్ట్రేలియా బెంబేలెత్తింది. తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుప్పకూలింది. భారత్ సైతం తొలి ఇన్నింగ్స్ 171 పరుగులకే ఆలౌట్ అయినా, 36 పరుగుల కీలక ఆధిక్యం సాధించింది. అనంతరం భారత్ బౌలర్లు మరోసారి చెలరేగిపోయారు. ఈ సారి ఆసిస్‌ను 116 పరుగులకే (రెండో ఇన్నింగ్స్‌లో) కుప్పకూల్చారు. తద్వారా భారత్ ముందు నామమాత్రపు 81 పరుగుల లక్ష్యం నిలిచింది. స్వల్ప ఛేదనలో భారత్ సైతం ఆదిలో తడబడింది. 13 పరుగుల వద్దే కెప్టెన్ ఆయుశ్ మాత్రే 13 వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత బంతికే స్టార్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ డకౌటయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో (14 బంతుల్లో 20, 2 ఫోర్లు, సిక్స్) మంచి ఆరంభం లభించినా భారీ స్కోర్‌గా మలచలేకపోయాడు. రెండో ఇన్నింగ్స్ ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు. ఈ దశలో వేదాంత్ త్రివేది, విహాన్ మల్హోత్రా భారత్ ఇన్నింగ్స్‌ను నిర్మించే ప్రయత్నం చేశారు. అయితే 52 పరుగులవద్ద విహాన్ (21) కూడా ఔటయ్యాడు. ఈ సారి వేదాంత్ (33 నాటౌట్) మరో ఛాన్స్ తీసుకోకుండా రాహుల్ కుమార్ (13 నాటౌట్) సహకారంతో భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు.



# ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌గా కజికిస్థాన్

## జపాన్ చేతిలో 11-35తో భారత్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియన్ అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్స్-2025లో కజకిస్తాన్ విజయం సాధించి ఛాంపియన్‌గా నిలవగా, భారత్ పురుషుల, మహిళల జట్లు ఓటమితో నిష్క్రమించాయి. ఈ అక్వాటిక్స్‌లో 10 పతకాలతో (6 బంగారు, 2 రజత, 2 కాంస్య) కజకిస్తాన్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఛాంపియన్‌షిప్ చివరి రోజు బుధవారం భారత పురుషుల వాటర్ పోలో జట్టు జపాన్ చేతిలో 11-35 తేడాతో, మహిళల జట్టు ప్రాథమిక రౌండ్‌లో ఉజ్బెకిస్తాన్ చేతిలో 4-23 తేడాతో ఓడిపోయాయి. పురుషుల గ్రూప్ బిలో లోరీ జున్ 6 గోల్స్‌తో జపాన్ స్కోర్‌బోర్డ్‌ను ముందుకు తీసుకెళ్లగా, కెప్టెన్ ఉరా ఎనిషి, మోరియా యుకీ తలా 4 రన్స్, మైదా తోషియుకి, సకామకి నరు, జో హిరోటో, మట్సునో ర్యోసుకే తలో 3, షోయామా యు, టకేడా ర్యూటా 2 జోడించగా, యమమోటో రియోటారో ఒక గోల్ చేశారు. భారత్ అంకిత్ ప్రసాద్ అత్యధికంగా 4 గోల్స్ చేయగా, సారంగ్ రవీంద్ర వైద్య 2, శ్రేయాస్ వైద్య, భాగేష్ కుతే, ప్రణవ్ మ్రే, ఉదయ్ ఉత్తేకర్, విభవ్ కుతే తలో ఒక గోల్స్ చేశారు. ఇక మహిళల గ్రూప్ ఎ లో, ఉజ్బెకిస్తాన్ 23-4 తేడాతో భారత్‌ను ఓడించింది. గవాషెలాష్విలి ఎలెనా 6 గోల్స్‌తో రాణించగా, కెప్టెన్ యుసు పోవా ఖిలోలా, సలామాటోవా అజీజా, వెర్ఖోవా అలెక్సా తలా 4 గోల్స్ చేశారు. ఖుస్నియాబోను అబ్దుల్లావా 2, ముర్తజేవా కొమిలా, ఆండ్రియాఖినా సోఫియా, తలీనా సోఫియా తలో ఒక గోల్ జోడించారు. భారత్ తరఫున కృపా రాణిచిత్ర, ప్రచేత రాఘవేంద్రరావు చెరో 2 గోల్స్ చేశారు.





# వరల్డ్ కప్‌లో విఫలమైనా స్మృతి అగ్రస్థానం పదిలం

## టాప్ 10లో భారత్ మహిళలు నిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనా ఐసీసీ మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో మాత్రం స్మృతి మంధాన అగ్రస్థానం పదిలంగా నిలిచింది. స్మృతి మినహా మరే భారత ప్లేయర్ టాప్10లో లేరు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 16వ స్థానంలో, దీప్తి శర్మ 17వ స్థానంలో ఉన్నారు. ఇక మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో శ్రీలంక, పాకిస్తాన్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లో విఫలమైనప్పటికి కూడా స్మృతి తన స్థానాన్ని కాపాడుకుంది. 791 రేటింగ్ పాయింట్లు మంధాన ఖాతాలో ఉన్నాయి. ఇంగ్లాండ్ చెందిన నాట్ స్కైవర్‌బ్రంట్ 731 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మంధాన, నాట్ స్కైవర్‌బ్రంట్ కు మధ్య 60 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది. 713 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఆస్ట్రేలియా ప్లేయర్ బెత్ మూనీ కొనసాగుతోంది. న్యూజిలాండ్ పై శతకం బాదిన దక్షిణాఫ్రికా బ్యాటర్ టాజ్మిన్ బ్రిట్స్ రెండు స్థానాలు మెరుగుపరచుకుని నాలుగో స్థానానికి చేరుకుంది. ఆమె ఖాతాలో 706 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. న్యూజిలాండ్‌పై విధ్వంసక శతకం బాదిన తంజిమ్ బ్రిస్త్ టాప్5లోకి దూసుకొచ్చింది. ఇండోర్ స్టేడియంలో రికార్డు శతకంతో సఫారీ జట్టును గెలిపించిన బ్రిస్త్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానం సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 706 పాయింట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియాకే చెందిన అష్ గార్డ్‌నర్ 697 రేటింగ్ పాయింట్లతో ఐదో ర్యాంక్ పట్టేసింది.

# ఆర్కిటిక్ ఓపెన్‌లో తరుణ్ సంచలన విజయం

## లక్ష్యసేన్, శ్రీకాంత్, కిరణ్ తదితరులు ఓటమి

**న్యూఢిల్లీ:** ఆర్కిటిక్ ఓపెన్‌లో మన్నేపల్లి తరుణ్ సంచలన విజయం సాధించగా, మిగిలిన భారత్ ప్లేయర్లు ఓటమిపాలయ్యాయి. ఫిన్లాండ్‌లోని వంటాన్ ఎనర్జియా అరీనాలో బుధవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ సూపర్ 500 ఈవెంట్ అయిన ఆర్కిటిక్ ఓపెన్ 2025 ప్రారంభ రౌండ్‌లో ప్రపంచ 46వ ర్యాంకర్ తరుణ్ అద్భుతమైన విజయం సాధించాడు. గంటా ఎనిమిది నిమిషాల పాటు జరిగిన ఉత్కంఠభరితమైన మూడు సెట్ల పోరులో తరుణ్ ఫ్రాన్స్‌కు చెందిన ఏడో సీడ్ టోమా జూనియర్ పోపోవ్‌ను ఓడించాడు. మొదటి గేమ్ ఓడిపోయిన తర్వాత తరుణ్ పుంజుకుని 11-21, 21-11, 22-20 తేడాతో విజయం సాధించాడు. ఇక లక్ష్య సేన్ నిరాశపరిచాడు, 57 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఐదో సీడ్ కొడై నరోకా (జపాన్) చేతిలో 15-21, 17-21 తేడాతో ఓడిపోయాడు. అలాగే కిదాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జ్, ఎస్ సుబ్రమణియన్ వంటి ఇతర భారత షట్లర్లు కూడా ప్రభావం చూపలేకపోయారు. శ్రీకాంత్ టోర్నమెంట్ నుండి వైదొలగగా, కిరణ్ జార్జ్ ఆట ప్రారంభమైన 13 నిమిషాలకే నిష్క్రమించాడు. 10-21, 1-4 తేడాతో వెనుకబడిన తర్వాత జపాన్‌కు చెందిన కె వటనాబే చేతిలో ఓడిపోయాడు. ఎస్ సుబ్రమణియన్ 44 నిమిషాల్లో ఫ్రాన్స్‌కు చెందిన మూడవ సీడ్ క్రిస్టో పోపోవ్ చేతిలో 17-21, 11-21 తేడాతో, ఎ శెట్టి తన ప్రారంభ రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ కె విటిడ్సార్న్ చేతిలో 15-21, 16-21 తేడాతో



# 'సూపర్ బోర్డు' టాటా ట్రస్ట్ ప్రతిష్టను పరిరక్షించాలి

## కేంద్ర మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్‌ల భేటీ

**ముంబయి, అక్టోబరు 8:** దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. టాటా ట్రస్ట్స్‌లో నలుగురు ట్రస్టీలు "సూపర్ బోర్డు"గా వ్యవహరిస్తూ గ్రూప్ స్థిరత్వానికి భంగం కలిగిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో, కేంద్రం నేరుగా రంగంలోకి దిగింది. ఎలాంటి పరిస్థితు ల్లోనైనా గ్రూప్‌లో స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని, అవసరమైతే అందుకు బాధ్యులైన ట్రస్టీలను



తొలగించడానికి కూడా వెనుకాడొద్దని టాటా యాజమాన్యానికి సూచించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా, వైస్‌ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో పాటు ట్రస్టీ డారియస్ ఖంబటాతో దాదాపు గంటసేపు సమావేశమయ్యారు. టాటా గ్రూప్ పరిమాణం, ఆర్థిక వ్యవస్థలో దానికున్న ప్రాధాన్యత దృష్ట్యా, ట్రస్ట్‌కు ప్రజా బాధ్యత ఉందని మంత్రులు గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 9న రతన్ టాటా మరణించిన నాటి నుంచి ట్రస్ట్‌లో విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ముఖ్యంగా నలుగురు ట్రస్టీలు డారియస్ ఖంబటా, జహంగీర్ హెచ్‌సీ జహంగీర్, ప్రమిత్ ఝవేరి, మెహ్లీ మిస్త్రీ ఒక వర్గంగా ఏర్పడి ఛైర్మన్ నోయెల్ టాటా అధికారాన్ని ప్రశ్నిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. టాటా సన్స్ బోర్డు సమావేశ మినిట్స్‌ను సమీక్షించడం, స్వతంత్ర డైరెక్టర్ల నియామకాలను ఆమోదించడం వంటి చర్యలతో వీరు కార్పొరేట్ పాలనా ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రతన్ టాటా ప్రథమ వర్ధంతికి ఒకరోజు ముందు ఈ కీలక సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# రూ.3 లక్షలకోట్లకు మీడియా వినోదరంగం

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారత మీడియా, వినోద రంగం అద్భుతమైన వృద్ధి పథంలో దూసుకెళుతోంది. కంటెంట్, సృజనాత్మకత, సాంకేతికత కలయికతో ఈ రంగం ఆర్థిక వ్యవస్థకు కీలక చోదక శక్తిగా మారుతోంది. 2024లో రూ.2.5 లక్షల కోట్ల విలువ కలిగిన ఈ రంగం, రాబోయే మూడేళ్లలో అంటే 2027 నాటికి రూ.3 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించనుందని ట్రాయ్ ఛైర్మన్ అనిల్ కుమార్ లహోటి అంచనా వేశారు. ఫిక్కీ ఫ్రేమ్స్ 25వ సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఈ రంగం భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలను పంచుకున్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో మీడియా, వినోద రంగం ప్రాముఖ్యతను లహోటి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతేడాది ఈ రంగం నుంచి రూ.2.5 లక్షల కోట్ల ఆదాయం సమకూరగా, అందులో కేవలం టెలివిజన్, ప్రసార విభాగం వాటాయే దాదాపు రూ.68,000 కోట్లుగా ఉందని ఆయన తెలిపారు. అనలాగ్ నుంచి డిజిటల్, అక్కడి నుంచి 4జి ప్రసారాల వరకు ఈ రంగం సాంకేతికంగా ఎంతో పరిణితి సాధించిందని అన్నారు. స్మార్ట్ టీవీలు, 5జి టెక్నాలజీ, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల రాకతో వినియోగదారుల సంఖ్య 60 కోట్లు దాటిందని, ఇది అసాధారణమైన మార్పు అని పేర్కొన్నారు. అయితే, ఈ డిజిటల్ విప్లవం కొనసాగుతున్నప్పటికీ, దేశంలోని 190 మిలియన్ల గృహాల్లో ఇప్పటికీ సంప్రదాయ లీనియర్ టెలివిజన్‌దే ఆధిపత్యమని ఆయన గుర్తుచేశారు. ఈ వేగవంతమైన వృద్ధిని సమర్థవంతంగా నిర్వహించేందుకు నియంత్రణ, ఆవిష్కరణల మధ్య సమతుల్యత చాలా అవసరమని లహోటి స్పష్టం చేశారు. "ఆవిష్కరణలు, ఆరోగ్యకరమైన పోటీ ద్వారా క్రమబద్ధమైన వృద్ధిని ప్రోత్సహించడమే ట్రాయ్ విధానం. అదే సమయంలో, వినియోగదారులకు పూర్తి పారదర్శకత కల్పించడం, చిన్న సంస్థల ప్రయోజనాలను కాపాడటం కూడా మా బాధ్యత" అని ఆయన వివరించారు. వ్యాపార ప్రక్రియలను సులభతరం చేసేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నిబంధనలను సరళీకరించేందుకు ట్రాయ్ అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

కేబుల్, టీవీ ప్రసార చట్టాల్లో చేసిన సవరణలు, టెలికమ్యూనికేషన్ చట్టం, 2023 కింద ప్రతిపాదించిన కొత్త అధికారాల వ్యవస్థ ఈ దిశగా వేసిన అడుగులేనని ఆయన అన్నారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, దేశంలోని ప్రధాన నగరాల్లో డిజిటల్ రేడియో ప్రసారాలను ప్రారంభించేందుకు ట్రాయ్ చేసిన సిఫార్సులను లహోటి ప్రస్తావించారు. ఎఫ్ఎం రేడియో రంగాన్ని బలోపేతం చేసి, ఆడియో ప్రపంచంలో ఆధునికతను తీసుకురావడమే దీని లక్ష్యమని చెప్పారు. ఈ సిఫార్సుల ప్రకారం, ప్రస్తుతం ఉన్న అనలాగ్ ఎఫ్ఎం రేడియో ఛానెళ్లు అదే ఫ్రీక్వెన్సీలో డిజిటల్ ప్రసారాలను కూడా అందించవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకే టెక్నాలజీ ప్రమాణాన్ని పాటించడం, 13 నగరాల్లో కొత్త ఫ్రీక్వెన్సీలను వేలం వేయడం వంటివి ఈ డిజిటల్ మార్పులో కీలక ఘట్టాలని పేర్కొన్నారు. కంటెంట్, క్రియేటివిటీ, సంస్కృతి ఆధారిత ఆరెంజ్ ఎకానమీని నిర్మించాలన్న ప్రధానమంత్రి దార్శనికతను సాకారం చేసేందుకు పరిశ్రమ వర్గాలతో కలిసి పనిచేస్తామని లహోటి పునరుద్ఘాటించారు.

# వచ్చే రెండేళ్లలో రూ.18 లక్షల కోట్లకు పసిడిపై తాకట్టు రుణాల టర్నోవర్!

## బంగారం ధరలు శరవేగంగా పెరుగుతుండటమే ఇందుకు కారణం అంటున్న 'ఇక్రా'




**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారత్‌లో గోల్డ్ మార్కెట్ 2026 మార్చి నాటికి రూ.15లక్షల కోట్లకు అధిగమిస్తుందని క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. గత కొన్ని నెలలుగా బంగారం ధరలు స్థిరంగా పెరగడం, అన్ని సమయాలలో గరిష్ట స్థాయికి చేరుకోవడం వేగవంతమైన వృద్ధికి కారణం. ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కోగ్రూప్ హెడ్ (ఫైనాన్షియల్ సెక్టార్ రేటింగ్స్) ఏఎం కార్తీక్ మాట్లాడుతూ వ్యవస్థీకృత గోల్డ్ లోన్ మార్కెట్ పరిమాణం 2027 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.18 లక్షల కోట్లకు పెరగవచ్చన్నారు. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ బంగారు రుణ పోర్ట్‌ఫోలియో 30 నుంచి 35శాతానికి పెరగవచ్చని తెలిపింది. భారీగా పలుకుతున్న బంగారం ధరలు, అన్‌సెక్యూర్డ్ రుణ ఉత్పత్తుల్లో నెమ్మదిగా వృద్ధి చెందడం దీనికి కారణం. ఇవి సాధారణంగా ఒకే రుణగ్రహీత విభాగాన్ని లక్ష్యంగా చేసుకుంటాయి. ఈ రంగంలో అనేక కంపెనీల వైవిధ్యీకరణ, దేశంలో అందుబాటులో ఉన్న పెద్ద మొత్తంలో ఉచిత బంగారం నిల్వలు ఈ వృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడతాయని కార్తీక్ అన్నారు. ప్రధానంగా బంగారం ధరలు పెరగడం వల్ల వృద్ధి జరిగినప్పటికీ 2020-2025 ఆర్థిక సంవత్సరంలో పూచీకత్తుగా ఉంచుకున్న బంగారం టన్నులు 1.7 శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు వద్ద స్వల్పంగా పెరిగాయి. ఈ కాలంలో సగటు రుణ పరిమాణాలు రెండింతలయ్యాయి. 2425 ఆర్థిక సంవత్సరంలో బంగారు రుణాలు సుమారు 26శాతం సీఏజీఆర్ వద్ద విస్తరించి మార్చి 2025 నాటికి 11.8 ట్రిలియన్లకు చేరుకున్నాయి. బ్యాంకులు ఎన్‌బీఎఫ్‌సీల కంటే వేగంగా వృద్ధిని నమోదు చేశాయి. మార్చి 2025 నాటికి బ్యాంకులు మొత్తం వ్యవస్థీకృత బంగారు రుణ మార్కెట్‌లో సుమారు 82 శాతం వాటాను కలిగి ఉండగా, మిగిలిన 18 శాతాన్ని ఎన్‌బీఎఫ్‌సీలు కలిగి ఉన్నాయని ఇక్రా తెలిపి ంది. జూన్ 2025 నాటికి నిర్వహణలో ఉన్న మొత్తం ఎన్‌బీఎఫ్‌సీ బంగారు రుణాల విభాగంలో నిర్వహణ ఆస్తులు 2.4 ట్రిలియన్లుగా ఉన్నాయని ఇక్రా డేటా చూపించింది. ఇది దాదాపు 41 శాతం బలమైన వార్షిక వృద్ధిని సూచిస్తుందని చెప్పింది.

## వాణిజ్యం




# ఇండిగోకు డిజిసిఎ రూ.20 లక్షల జరిమానా!

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు రూ.20 లక్షల జరిమానా విధించారు. పైలట్ శిక్షణ కోసం 'క్వాలిఫైడ్ సిమ్యులేటర్లు' ఉపయోగించకపోవడాన్ని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) తప్పుపట్టి సంస్తకు జరిమానా విధించింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ బుధవారం ఈ విషయం తెలిపింది. సెక్యూరిటీస్ ఫైలింగ్‌లో దీనిని ప్రస్తావించింది. 'కేటగిరీ సీ' ఏరోడ్రోమ్‌లలో పైలట్ శిక్షణ కోసం 'అర్హత కలిగిన సిమ్యులేటర్‌లను' ఉపయోగించనందుకు డీజీసీఏ రూ.20 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొంది. సెప్టెంబర్ 26న ఈ ఉత్తర్వు జారీ చేసినట్లు వివరించింది. కాగా, అంతర్గత కమ్యూనికేషన్ల సమస్య కారణంగా ఈ విషయాన్ని వెల్లడించడంలో ఆలస్యం జరిగినట్లు సెక్యూరిటీస్ ఫైలింగ్‌లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ తెలిపింది. అయితే ఈ చెల్లింపును తాము సవాల్ చేస్తామని చెప్పింది. అలాగే ఇండిగో ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలపై ఇది ఎటువంటి ప్రభావం చూపబోదని పేర్కొంది. మరోవైపు బుధవారం నాటి స్టాక్‌మార్కెట్‌లో ఇండిగో షేర్ల విలువ స్వల్పంగా తగ్గింది.

# నష్టాలతో వణికిన సెన్సెక్స్, నిఫ్టీలు

## ఐటి, కన్స్యూమర్ మినహా అన్నింటా అమ్మకాలజోరు!

**ముంబయి, అక్టోబరు 8:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయ. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల్లో అమ్మకాలు కనిపించాయి. దాంతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ప్రపంచ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు ఉదయం ఫ్లాట్‌గానే మొదలయ్యాయి. ఆ తర్వాత మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లిన కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి స్వల్పంగా కోలుకోవడంతో భారీ నష్టాల నుంచి బయటపడ్డాయి. ఉదయం 81,899.51 పాయింట్ల ప్రారంభమైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 81,646.08 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. అత్యధికంగా 82,257.74 పాయింట్ల గరిష్టానికి పెరిగింది. చివరకు 153.09 పాయింట్లు తగ్గి 81,773.66 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ సైతం 62.15 పాయింట్లు తగ్గి 25,046.15 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.4శాతం పతనమయ్యాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.7 శాతం, ఐటీ 1.5శాతం లాభపడ్డాయి. ఇక రియాల్టీ, టెలికాం, ఫార్మా, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో 0.3శాతం నుంచి 2శాతం వరకు పతనమయ్యాయి. నిఫ్టీలోటాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, జియో ఫైనాన్షియల్, ఓఎన్‌జీసీ, ట్రెంట్ నష్టాల్లో ముగియగా.. టైటాన్ కంపెనీ, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, మ్యాక్స్ హెల్త్‌కేర్ లాభపడ్డాయి. రూ.695.83 ఫ్లోర్ ధరతో క్యూఐపీని ప్రారంభించిన అనంత్ రాజ్ షేర్లు 5శాతం తగ్గాయి. రూ.707 కోట్ల విలువైన ఆర్డర్ల తర్వాత సాత్విక్ గ్రీన్ ఎనర్జీ షేర్లు 10శాతం వృద్ధి చెందింది. క్యూవన్ లాభం 67శాతం పెరిగినప్పటికీ మంగళసూత్ర షేర్ల శ్రింగర్ హౌస్ 2శాతం పతనమయ్యాయి. నీలా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేర్ ధర 11శాతం పెరిగింది. ది కార్డ్ కంపెనీతో సహకారంతో డ్రీమ్‌ఫోక్స్ సర్వీసెస్ షేర్ ధర 5శాతం పెరిగింది. జాగ్వార్ ల్యాండ్ రోవర్ క్యూ2 హోల్‌సేల్స్ 24.2శాతం తగ్గడంతో టాటా మోటార్స్ షేర్లు 2.5శాతం పడిపోయాయి. క్యూ2లో రూ.4,570 కోట్ల ప్రీసేల్స్ ఉన్నప్పటికీ లోధా డెవలపర్స్ షేర్లు 1.5శాతం తగ్గాయి. త్రైమాసిక గణాంకాలు మెరుగ్గా ఉండడంతో టైటాన్ షేర్లు 4శాతం పెరగ్గా.. బార్వాహ్ ప్లాంట్‌లో తయారీ ప్రారంభించడంతో అసోసియేటెడ్ ఆల్కొహాల్, బ్రూవరీస్ షేర్లు దాదాపు 3శాతం వృద్ధిని నమోదు చేశాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14